అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 19-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక :49 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

భారత్‌కు మరో 12 చీతాలు

దక్షిణాఫ్రికా నుంచి ఎయిర్‌ఫోర్స్ విమానంలో రాక

- అటు తర్వాత ఎంపీలోని కునో నేషనల్ పార్కుకు
- ఇందులో ఏడు మగ.. ఐదు ఆడ చీతాలు



న్యూఢిల్లీ : భారత్‌కు మరో 12 చీతాలు వచ్చాయి. దక్షిణాఫ్రికా నుంచి ఎయిర్‌ఫోర్స్ విమానంలో వీటిని తీసుకొచ్చారు.ఇందులో ఏడు మగవి, ఐదు ఆడ చీతాలు ...5లో

అదానీ వ్యవహారంలో

ప్రధాని పేరొద్దు

మీడియా సంస్థలకు బీజేపీ నేతల ఆదేశాలు

గౌతం అదానీ ఆర్థిక అక్రమాల్ని 'హిండెన్‌బర్గ్' బయటపెట్టాక, మీడియాలో పెద్ద ఎత్తున చర్చసాగింది. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అనేక ప్రశ్నలు సంధించాయి. అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాల గొంతును నొక్కేయటమేగాక, వారి ప్రశ్నలు అధికారిక రికార్డుల్లో నమోదుకాకుండా కేంద్రం తొలగించింది. అంతేగాక ఆ రోజు రాత్రి దేశంలోని మీడియా సంస్థల యాజమాన్యాలకు బీజేపీ పెద్దల నుండి ఫోన్‌కాల్స్ వెళ్లాయి. చర్చల సందర్భంగా 'ప్రధాని మోడీ పేరు వినిపించడానికి వీల్లేదు' అనే ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రధాని మోడీ పేరు వినిపించిందా? పర్యావసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నది.. ఆ ఫోన్ కాల్స్ సందేశం.

- మోడీ పేరు చర్చకు తేవద్దంటూ బెదిరింపులు
- వేధింపులు, బెదిరింపులతో స్వతంత్ర మీడియాపై దాడులు
- సుప్రీంకోర్టును టార్గెట్ చేస్తూ..పాంచజన్యలో ఆర్‌ఎస్‌ఎస్ సంపాదకీయం
- భారత్‌లో మునుపెన్నడూ లేని పరిస్థితులు : రాజకీయ విశ్లేషకులు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చింది మొదలు, దేశంలో మీడియాకు సంకెళు బిగుసుకున్నాయి. స్వతంత్రంగా వ్యవహరించే పాత్రికేయుల్ని, ఎడిటర్స్‌ను బెదిరించటం, జైళ్లకు పంపటం సర్వసాధారణమై పోయింది. 'బీబీసీపై ఐటీ దాడుల' వ్యవహారం బయటకు కనిపించేది మాత్రమే, కనిపించనవి ఎన్నో ఉన్నాయని, సామాన్యుడికి తెలియకుండా అనేకం జరుగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

సుప్రీంకోర్టును అవమానించిన ఆర్‌ఎస్‌ఎస్

గుజరాత్‌లో 2002 మారణకాండపై బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ డాక్యుమెంటరీ ప్రసారాలను నిషేధించాలనే పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అధికార బీజేపీ నాయకులకు, ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలకు సుప్రీంకోర్టు తీరు మింగుడుపడలేదు. దాంతో సుప్రీంకోర్టును అవమానపర్చే పన్నాగానికి తెరలేపారు. ఆర్‌ఎస్‌ఎస్ అధికారిక ...5లో

అదానీ కోసం ప్రధాని విదేశీ

పర్యటనలు!

బంగ్లాదేశ్‌తో రూ.14వేల కోట్ల విలువైన విద్యుత్ ఒప్పందం

- 'హిండెన్‌బర్గ్' నివేదిక తర్వాత ఒప్పందంపై బంగ్లాదేశ్ అనాసక్తి
- భారత్-బంగ్లా సంబంధాలపై ప్రభావం



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ రాజకీయాల్లో, జనాల్లో ఇటీవల భారత్ వ్యతిరేకత ఎక్కువవుతోంది. దీనికి కారణం అధిక ధరతో కూడిన అదానీ కంపెనీ విక్రయించే విద్యుత్. మార్కెట్ ధరకన్నా ఐదు రెట్లు ఎక్కువ చెల్లించి అదానీ కంపెనీ నుంచి విద్యుత్ కొనుగోలు ...5లో

దళితులపై దాడులు

భారతీయ సమాజానికి మాయని మచ్చ

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఎక్కువ
- రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న కేంద్రం

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయనీ, ఇలాంటి దాడులు భారతీయ సమాజానికి మాయని మచ్చని, రాజ్యాంగ ఉల్లంఘనని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభ తీర్మానించింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అలాగే కార్పొరేట్ అనుకూల మతతత్వ విధానాలతో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని వారి హక్కులు హరిస్తున్నారనీ, ఫలితంగా జీవనోపాధికి దూరమవుతున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగమైన బీజేపీ దాని మనుస్మృతిని అమలు చేసే పనిలో వేగంగా ముందుకు వెళుతోందని వివరించారు. లింగ, కుల అణచివేతతోపాటు శ్రామికప్రజల హక్కులనూ కాలరాస్తోందని పేర్కొన్నారు. వారి చట్టాలను ఉల్లంఘిస్తూ నిరంతరం ముందుకు సాగుతున్నదని, ఉదారవాద విధానాలు, సామ్రాజ్యవాద విధానాలు, ప్రైవేటీకరణ, ఆరోగ్య రంగాన్ని విస్మరించడం వంటి చర్యలతో దళితులపై నిరంతరం దాడి కొనసాగిస్తోందని చెప్పారు. మతోన్మాద రాజకీయాలను బీజేపీ నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో నివేదికల ప్రకారం హర్యానా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, రాజస్థాన్, తెలంగాణా, ఉత్తరప్రదేశ్‌లో దాడులు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. 2020లో ఉత్తరప్రదేశ్‌లో దళితులపై దాడులకు సంబంధించి 12714 కేసులు నమోదయ్యాయనీ, వాటిల్లో 3955 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయని తెలిపారు. తెలంగాణాలో అదే సంవత్సరం 1959 కేసులు నమోదయితే 25 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయని తీర్మానంలో పేర్కొన్నారు. హర్యానాలో 1210 కేసులకు 12 మందికి, జార్ఖండ్‌లో 666 కేసుల్లో 15 మందికి, మధ్యప్రదేశ్‌లో 6899 కేసుల్లో 791, మహారాష్ట్రలో 2569కి 67 మందికి, ఒడిస్సాలో 2046 కేసుల్లో ఐదుగురికి, రాజస్థాన్‌లో 7017 కేసుల్లో 886 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయని వివరించారు. కేసులు, అసమానతల మధ్య చాలా తేడా ఉందని తెలిపారు. ఇది దాడులు చేసినా శిక్షలు పడవనే భావనను కల్పిస్తాయని, ఇది దాడులు ...5లో



ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా

విజయరాఘవన్, వెంకట్

155 మందితో జనరల్ కౌన్సిల్

తెలంగాణ నుంచి 15 మంది

వివరాలు 10లో..



ఆ హక్కు మీకెవరిచ్చారు?

ఆరెస్సెస్‌తో సమావేశంపై జమాతే ఇస్లామీని ప్రశ్నించిన కేరళ సీఎం

- ఏం చర్చించారో మరింత స్పష్టతనివ్వాలన్న విజయన్

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆరెస్సెస్‌తో జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) సమావేశాన్ని కేరళ సీఎం తప్పుబట్టారు. మైనారిటీల తరఫున ప్రాతినిథ్యం వహించే హక్కు మీకు ఎవరిచ్చారు? అని ప్రశ్నించారు. ఆరెస్సెస్‌తో చర్చలు అవసరమని జేఐహెచ్ చెప్పడం దాని స్వంత కపటత్వాన్ని ప్రతిబింబిస్తున్నదని అన్నారు.దీనికి సంబంధించి విజయన్ ఒక ఫేస్‌బుక్ పోస్టును చేశారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మూక హత్యలు, అణగారిన వర్గాల అణచివేత అంశాలపై ఆరెస్సెస్‌తో చర్చల్లో దృష్టి సారించామని జేఐహెచ్ ప్రధాన కార్యదర్శి టి. ఆరీఫ్ అలీ ఇటీవల వెల్లడించారు. అయితే, ఆరెస్సెస్‌తో ఏం చర్చించారన్నదానిపై మరింత ...2లో

వేములవాడలో

శివరాత్రి వేడుకలు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్

- వీఐపీల సేవలో అధికారులు.. లైన్లలో సందర్శకుల తిప్పలు

నవతెలంగాణ - వేములవాడ


రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం శనివారం శివ నామస్మరణతో మారుమోగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు లైన్లలో బారులు తీరారు. దర్శనానికి దాదాపు 10-12 గంటల సమయం పట్టింది. మహా శివరాత్రి ...5లో



మాణిక్‌రెడ్డి గెలవాలి

చుక్కా రామయ్య ఆకాంక్ష

వివరాలు 5లో..



హీరో తారకరత్న

కన్నుమూత

వివరాలు సినిమాలో

మోరీలు తీసేదంతా దళితులే

ఊర్లో లేకుంటే పక్కూరోళ్లతో చేయిస్తున్న వైనం

- పనిలోనేకాదు..జీతాల్లోనూ వివక్షే
- నాలుగైదు వేల రూపాయలతో బతికేదెట్లాగో పాలకులే చెప్పాలి
- అదీ మూడు నుంచి ఐదు నెలల దాకా పెండింగ్‌లోనే
- మురికి కూపంలో పనితో రోగాలమయం
- అప్పులు చేసి బతుకుతున్న కార్మికులు
- ఒంటరి మహిళలే ఎక్కువ..చదువూ అంతంతే

వివరాలు 5లో..



క్షేత్రస్థాయిలో యాదజూసినా మోరీలెత్తేదంతా దళితులే. వీరుగాక మిగతా సామాజిక తరగతుల వారెవ్వరూ ఆ పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. ఒకవేళ ఆ ఊర్లో లేకుంటే ఆ పని వరకు పక్కూరోళ్లను పెట్టి చేయిస్తున్న దైన్యపరిస్థితి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. తండాల్లో మాత్రం అక్కడక్కడా కొందరు గిరిజనులు పనిచేస్తున్నారు. మోరీల్లోని చెత్తను, రోతను ఎత్తివేసే క్రమంలో ఆ వాసనను భరించేందుకు తాగుడు అలవాటు చేసుకుని కొందరు, పనిచేసే క్రమంలో రోగాలపాలై మరికొందరు అర్థాయుష్యుతో తనువు చాలిస్తున్నారు. తమ ఆలుబిడ్డల్ని అనాథల్ని చేసిపోతున్నారు. చనిపోతే ఏదో మొక్కుబడిగా సర్పంచులు రూ.10వేలు, 20 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప ఆ కుటుంబానికి పూర్తిస్థాయిలో భరోసా ఇస్తున్న పరిస్థితి లేదు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఇక నీరు ప్రైవేటు సొత్తు!

నీటివ్యాపారంపై నీతి ఆయోగ్ కసరత్తు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ప్రజలపై మరో పెను భారానికి సన్నాహాలు చేస్తోంది. ప్రజల కనీస అవసరమైన నీటితో వ్యాపారం చేయాలని చూస్తోంది. ఇప్పటికే దేశంలో సంపదను, అనేక వనరులను ప్రైవేటుకు, కార్పొరేట్ల పరం చేస్తున్న బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా నీటిని కూడా వారికి అప్పగించాలని చూస్తోంది. అందరికీ నాణ్యమైన నీటిని అందించడానికి బదులుగా డబ్బు చెల్లించే వారికే నీటిని అందించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నీటి వ్యాపారం కోసం ప్రపంచ ప్రమాణాలను అధ్యయనం చేయడానికి నీతి ఆయోగ్ ప్రణాళికలు సిద్ధం చేయడమే ఇందుకు నిదర్శనం. నీటి వ్యాపారంపై అధ్యయనం చేయాలనే నీతి ఆయోగ్ నిర్ణయం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నయా ఉదారవాద వైఖరికి కొనసాగింపు అని, దానిని మరింతగా ముందుకు తీసుకెళ్లడమేనని నిపుణులు చెబుతున్నారు. నీటిని ప్రైవేటీకరించడం భారత్‌లో కొత్త కాదు. జాతీయ నీటి విధానం 2002లో సెక్షన్ 13, జాతీయ నీటి విధానం 2012లో సెక్షన్లు 11.6, 12.3 కూడా నీటి నిర్వహణలో ప్రైవేటు జోక్యాన్ని ప్రతిపాదించాయి. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. ఈసారి మోడీ ప్రభుత్వానిది పూర్తిగా కొత్త ఆలోచన. ఎందుకంటే ఇప్పుడు ప్రైవేట్ సంస్థలు నీరు, నీటి వనరులకు చట్టబద్ధమైన యజమానులుగా ఉంటాయి. ఇది అమల్లోకి వస్తే జాతీయ వనరు అయినప్పటికీ నీరు బంగారం, వెండి వలే అమ్ముడు పోతుంది. ఈ అంశంపై బలమైన చట్టాన్ని నీతి ఆయోగ్ ప్రతిపాదించవచ్చు. ఇప్పటికే నిరంతరం వరదలు, కరువు ఎదుర్కొంటున్న భారతీయులను నీరు పూర్తిగా వ్యాపారమయం చేయడం అనే ప్రతిపాదన కలవరపెడుతుంది. నీరు వాణిజ్యానికి సరుకుగా మారిన తరువాత నీరు ధర ఎంత ఉంటుందన్నది పేద, మధ్యతరగతి ప్రజలను కలవర పెట్టే ప్రధాన ప్రశ్న. భారత్ వంటి దేశంలో నీటి వ్యాపారం అనే ఆలోచన సమానత్వం అనే భావనకే సవాలుగా నిలుస్తుంది. అందరికీ నీరు అనే దానికి బదులుగా డబ్బులు చెల్లించేవారికి నీరు అనేదాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. సమాజంలో కొనుగోలు శక్తిలో వ్యత్యాసం భిన్నంగా ఉంటుంది కాబట్టి, నీటి వ్యాపారంతో కొత్త అసమానతలు ఏర్పడతాయి. నీటి ఘర్షణలు, యుద్ధాలకు దారి తీయవచ్చు. వివిధ రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చవచ్చు. నీటి వివాదాలు సామాన్యం కావచ్చు. నీటి వ్యాపారంపై ప్రపంచ ప్రమాణాలను అధ్యయనం చేస్తున్న క్రమంలో నీతి ఆయోగ్ అమెరికా, ఆస్ట్రేలియా, చిలీ దేశాల్లోని వ్యవస్థను పరిశీలిస్తే.. ఆ దేశాలకు భారత్‌కు అనేక వ్యత్యాసాలు ఉన్నాయని నీతి ఆయోగ్ గ్రహించాలి. భారత్‌లో వర్షాల అనిశ్చితి, జనాభా సాంద్రత, వైవిధ్యమైన వృద్ధి అవసరాలు పైన పేర్కొన్న దేశాల కంటే భిన్నంగా ఉంటాయి. దీనిని నీతి ఆయోగ్ పరిశోధించడం చాలా అవసరం.

ఇంగ్లండ్‌లో చేదు అనుభవం

నీటి ప్రైవేటీకరణలో చేదు అనుభవాలను ఎదుర్కొన్న తరువాత ఇంగ్లండ్ నీటి వ్యాపారాన్ని విరమించుకుంది. దానికి బదులుగా నీటి నిర్వహణ ప్రక్రియలను మునిసిపలైజ్ చేసింది. నీటి వ్యాపారం నీతి ఆయోగ్ ఉద్దేశ్యం కాబట్టి నీతి ఆయోగ్ హేతు బద్ధమైన, సమర్థవంతమైన, అవినీతి రహిత పర్య వేక్షణ వ్యవస్థల గురించి ఆలోచించాలి. జాతీయ వనరైన నీరు వాణిజ్యానికి వనరు గా ఎలా ఉంటుంది?, ఎంఎన్‌సి కంపెనీల పెట్టుబడులను ప్రభుత్వం ఎలా నియంత్రిస్తుంది? అనే ప్రశ్నలకు నీతి ఆయోగ్ జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది.

అసహ్యకరం

లక్షలాది మంది ప్రజలు తాగునీటిని సేకరించడానికి, నిల్వ చేయడానికి మైళ్ల దూరం నడిచి వెళ్లవలసిన పరిస్థితిలో, లాభాలను పెంచుకోవడానికి నీటిని ప్రైవేటీ కరణ చేయడం నేరం. తరువాత, గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని సాకుగా చూపి, మోడీ ప్రభుత్వం మనం పీల్చే గాలిని కూడా ప్రైవేటీకరిస్తుంది.

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్

కొలీజియం కంటే మెరుగైనది లేదు

ఇది పర్‌ఫెక్ట్ మోడల్ : మాజీ ప్రధాన న్యాయమూర్తి లలిత్



న్యూఢిల్లీ : కొలీజియం వ్యవస్థపై దాడి జరుగుతున్న సమయంలో.. కొలీజియం వ్యవస్థ కంటే మెరుగైనదేదీ లేదని మాజీ ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్ వ్యాఖ్యానించారు. న్యాయ నియామకాలు, సంస్కరణలపై జరిగిన ఓ సెమినార్‌లో ఆయన శనివారం మాట్లాడారు. 'కొలీజియం వ్యవస్థ కంటే మెరుగైన వ్యవస్థ మన దగ్గర లేదు. ఈ వ్యవస్థలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇది పర్‌ఫెక్ట్ మోడల్' అని ఆయన అన్నారు. మన దేశంలో చాలామంది న్యాయమూర్తులు సాధారణంగా హైకోర్టు స్థాయిలో నియమితులవుతున్నారని, చాలా కొద్దిమంది మాత్రమే నేరుగా సుప్రీంకోర్టుకు నియమితులవుతున్నారని ఆయన అన్నారు.

ఆ హక్కు మీకెవరిచ్చారు?

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టత కావాలని విజయన్ అన్నారు. చర్చల ద్వారా ఆరెస్సెస్‌లో మార్పు వస్తుందన్న జమాతే ఇస్లామీ హింద్ వాదన వింతగా ఉన్నదనీ వివరించారు. ఈ తర్కం.. స్నానంతో చిరుతపై ఉన్న మచ్చలను తొలగించవచ్చన్న రీతిలో ఉన్నదని పేర్కొన్నారు. భారత్‌లోని మైనారిటీలు ఎదుర్కొంటున్న సాధారణ సమస్యలను తెలియజెప్పడానికి చర్చలు జరిపామన్న వాదని మరింత వింతగా ఉన్నదని వివరించారు. ఈ చర్చలు దేశంలోని మైనారిటీలకు తోడ్పాటును అందించవని పేర్కొన్నారు. మైనారిటీల రక్షణ అంటే మతస్వేచ్ఛ అనీ, దానికి విఘాతం కలిగిస్తున్నదెవరో తెలియదా? అని ప్రశ్నించారు. ఇలాంటి వారితో (ఆరెస్సెస్) చర్చలు జరిపితే లౌకికవాదం, మైనారిటీల రక్షణ ఎలా సాధ్యమవుతుంది? అని వివరించారు. ఈ చర్చలు ఆరెస్సెస్ హిందూత్వ అజెండాకు మద్దతు ఇచ్చినట్టుగా కనిపించిందని విజయన్ పేర్కొన్నారు. నేడు భారత్‌లో లౌకిక శక్తులు సంఘ్ పరివార్ అతివాద హిందూత్వ రాజకీయాలపై పోరాటం చేస్తున్నాయనీ, ఇలాంటి తరుణంలో ఇలాంటి చర్యలు ఆరెస్సెస్ అజెండాకు మద్దతునిస్తాయని వివరించారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య విలువలను తొక్కిపెట్టడానికి మతవాదులు ఏకమవు తారనడానికి ఇంత కంటే మించిన రుజువు ఉండదనీ, లౌకిక శక్తులకు ఇది ఒక సవాల్ అని విజయన్ పేర్కొన్నారు. ఈ జమాతే ఇస్లామీ హింద్ చర్యపై పలు ముస్లిం, మైనారిటీ సంఘాలకు చెందిన నాయకుల నుంచి వ్యతిరేకత వచ్చింది.

బిజినెస్

బీమా పాలసీతో పాన్ లింక్

- ముడిపెట్టనున్న ఎల్ఐసి



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) తమ పాలసీ దారులకు పాన్ కార్డ్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయనున్నట్లు తెలుస్తోంది. ఎల్ఐసి పాలసీ కలిగిన వారు వారి పాన్ కార్డును 2023 మార్చి 31 లోపు లింక్ చేసుకోవాలని ఆసంస్థ సీనియర్ అధికారి తెలిపారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా సర్వీసులు పొందాలని భావించే వారు కచ్చితంగా పాన్ కార్డును సమర్పించాలన్నారు. లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చన్నారు. పాలసీ కలిగిన వారు కంపెనీ ఎల్ఐసి వెబ్‌సైట్‌లో తమ పాన్ కార్డ్‌ను లింక్ చేసుకోవచ్చన్నారు. అదే విధంగా మొబైల్ నెంబర్, ఇ మెయిల్‌ను కూడా అప్‌డేట్ చేసుకోవాలని ఎల్ఐసి కోరింది. దీని ద్వారా పాలసీదారులు మరింత సులభంగా సేవలు పొందవచ్చని సూచించింది. ఎల్ఐసి దాదాపు 30 కోట్ల పాలసీదారులను కలిగి ఉంది.


ఏడు శాతం వృద్ధి లక్ష్యం

- విదేశీ వ్యవహారాల మంత్రి వెల్లడి



సిడ్నీ : ప్రస్తుత ఏడాది సహా వచ్చే ఐదేళ్లలో భారత్ ఏడు శాతం పైగా వృద్ధి రేటును అంచనా వేస్తుందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ అన్నారు. శనివారం సిడ్నీలో ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్స్టిట్యూట్ (ఎఎస్‌పిఐ), ఇండియా అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఒఆర్ఎఫ్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన సిడ్నీ బిజినెస్ బ్రేక్‌ఫాస్ట్‌లో మంత్రి మాట్లాడుతూ.. "ఈ ఏడాది ఏడు శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నాం. వచ్చే ఐదేళ్లలో మరింత పెరగనున్నాం. రాబోయే దశాబ్దనర కాలంలో 7-9 శాతం వృద్ధి రేటును నమోదు చేయనున్నాం. ఇందుకు అనుగుణంగా ఎఫ్‌డిఐ, ఎఫ్ఐఐ ప్రతిఫలించనున్నాయి." అని మంత్రి పేర్కొన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య 2022 ఏప్రిల్ 2న కుదిరిన ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (ఇసిటిఎ) డిసెంబర్ 2022 నుంచి అమల్లోకి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్యంలో మంచి ప్రభావం చూపిందన్నారు. ఆస్ట్రేలియాలో 10 లక్షల పైగా భారత విద్యార్థులు నివసిస్తున్నారన్నారు. భారత మేధో సంపత్తి ఇక్కడికి తరలి వస్తుందన్నారు. ఆస్ట్రేలియన్ యూనివర్శిటీలను భారత్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు. దీంతో ఇరు దేశాలు సహా ప్రపంచానికి నైపుణ్యాలు, పోటీ టాలెంట్‌ను అందించగలమన్నారు.

ఐసిసితో పాలీక్యాబ్ భాగస్వామ్యం



హైదరాబాద్: ప్రముఖ విద్యుత్ ఉత్పత్తుల కంపెనీ పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ (పిఐఎల్) ఈ ఏడాది జరుగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) మ్యాచ్‌లకు అధికారిక భాగస్వామిగా వ్యవహరించనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఐసిసి పురుషుల, మహిళల అంతర్జాతీయ ఈవెంట్లకు స్పాన్సర్‌గా కొనసాగనున్నట్లు పేర్కొంది. 2023 సంవత్సరాంతం వరకూ ఈ ఒప్పందం నిలిచి ఉంటుందని వెల్లడించింది. దీంతో దక్షిణాఫ్రికాలో జరుగనున్న ఐసిసి ఉమెన్స్ టి20 వరల్డ్ కప్, బ్రిటన్‌లో జరుగనున్న ఐసిసి వరల్డ్ టెస్ట్ చాంఫియన్‌షిప్ ఫైనల్‌కు, భారత్‌లో జరుగనున్న ఐసిసి పురుషుల వరల్డ్ కప్ 2023 భాగస్వామిగా కొనసాగనున్నట్లు పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిలేష్ మలానీ పేర్కొన్నారు. "పాలీక్యాబ్‌కు ఇది అత్యంత సంతోషకర అంశం. దేశీయంగా అభివృద్ధి చెందిన పాలీక్యాబ్ ఇప్పుడు 60కు పైగా దేశాలలో తమ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ భాగస్వామ్యంతో మా అభిమానులకు మరపురాని అనుభవాలను అందించనున్నాము" అని నిలేస్ తెలిపారు.

ఉన్నోనికి లేదు.. లేనోనికి పరి'ఆ'హారం

ఇన్నర్'రింగ్'లో అవినీతి మంత్రాంగం

- రియల్టర్లు, రెవెన్యూ అధికారుల భూదందా
- నష్టపరిహారంలో ఫోర్జరీలతో దోపిడీ



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ నగరంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు బాధితుల పరిహారంలో పెద్దఎత్తున చేతులు మారుతోంది.. భూములు కోల్పోయిన వారికి అందించే నష్టపరిహారంలో 'నకిలీ' దందా నడుస్తోంది. రియల్టర్లు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై నష్టపరిహారాన్ని దోచుకోవడానికి కొత్త కుంభకోణానికి తెరలేపారు. అసలు బాధితులకు భూమి పోవడం లేదని చెబుతూ, అసలు భూమే కోల్పోనివాళ్ల పేరుతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి నష్టపరిహారం దోచుకోవడానికి రంగం సిద్ధమైంది.

200 అడుగుల ఇన్నర్‌రింగ్ రోడ్డు తొలి దశలో వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపైనున్న నాయుడు పెట్రోల్ పంప్ నుంచి ఎనుమాముల మార్కెట్ వరకు 13 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేయనున్నారు. ఇందుకు వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లో 87 ఎకరాల భూమిని సేకరించాల్సి వుంది. ఇందుకు రూ.110 కోట్లు నష్టపరిహారం కోసం ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడే పరిహారం పంపిణీలో మాయాజాలం నడుస్తోంది. ఎనుమాముల శివారులో సర్వేనెంబర్ 171/ఎ, 171/బిలో భూములు పోతున్నాయి. అయితే, రెవెన్యూ అధికారులు, రియల్టర్లు కుమ్మక్కై పట్టాదార్లకు సర్వేనెంబర్ 171/ఎలో భూమి పోవడం లేదని, 171/బిలో మాత్రమే రోడ్డు కింద భూమి పోతుందని చెబుతున్నారు. సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అందరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. అసలు ఏం జరుగుతుందని ఆరా తీస్తే.. నకిలీ పత్రాలు సృష్టించి నష్టపరిహారాన్ని కాజేయడానికి దందా నడుపుతున్నట్టు సమాచారం. ఇందులో రెవెన్యూ అధికారులు ప్రత్యక్షంగా తమదైన శైలిలో పాత్ర పోషిస్తున్నారు. గజానికి రూ.7,500 నష్టపరిహారం ఇవ్వాలని నిర్ణయించడంతో సర్వేనెంబర్ 171 పార్ట్ ఎ, పార్ట్ బిలో వున్న భూములకు సంబంధించి 2021లో పలువురి పేరిట నోటరీలతో పత్రాలను సృష్టించారు.

పత్రాలు తయారు

ఎనుమాముల శివారులోని సర్వేనెంబర్ 171/బిలో స్థలానికి సంబంధించి 1991లోని పాత పేపర్‌ను సృష్టించి నకిలీ నోటరీ /1198/2020, 31-12-2020 ఈ డాక్యుమెంట్ నెంబర్‌కు సంబంధించిన గిఫ్ట్ డీడ్‌ను అనుమల్ల వెంకటేశం పేరిట చేశారు. ఈ డాక్యుమెంట్‌లో పేర్కొన్న హద్దులన్నీ తప్పుగా నమోదు చేశారు. శాయంపేటలో సర్వేనెంబర్ 39లో డాక్యుమెంట్ నెంబర్ 139/1998, ఎస్ఆర్ఓ వరంగల్ రూరల్ 2010, తేదీ 20-09-1998న మున్నంగి పున్నారెడ్డి అనే వ్యక్తి ఊకల్ ఎబిఎఫ్ఎస్‌సిఎస్ లిమిటెడ్‌లో మార్టిగేజ్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ 139/1998ని గ్రామం పేరు మార్చి ఎనుమాముల అని.. 537 గజాలు, హద్దులు ఎనుమాముల సర్వేనెంబర్ 171/బి కి సంబంధించిన హద్దులు సృష్టించారు. ఈ హద్దులకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్ టి.రమేష్‌బాబు కో అండ్ కంపెనీ గండ్ర రాజకిషన్‌రావుకు సర్వేనెంబర్ 171/బిలో 537 గజాలుగా రిజిస్ట్రేషన్ చేశారు. 171/బి ఎనుమాముల గ్రామానికి సంబంధం లేని డాక్యుమెంటును ఎనుమాముల 200 అడుగుల రోడ్డు కింద భూనిర్వాసితుడిగా నమోదు చేసుకొని నష్టపరిహారం స్వాహా చేయడానికి ఈ తతంగం నడుపుతున్నారు.

ఈ విషయాన్ని అల్లం వెంకటేశ్వర్‌రెడ్డి అనే బాధితుడు సర్వేయర్, గిర్దావర్ రామస్వామి, వరంగల్ తహసీల్దార్ సత్యపాల్ రెడ్డి, ఆర్‌డీఓ సీహెచ్ మహేందర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందని 'నవతెలంగాణ'కు తెలిపారు. ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర లేకుండా ఇంత పెద్దఎత్తున వ్యవహారం జరగదని చెబుతున్నారు. 40 ఏండ్లుగా పట్టాదారులైన అల్లం అనిమిరెడ్డి, అల్లం వెంకటేశ్వర్‌రెడ్డికి చెందిన 1.20 ఎకరాల భూమి ఇన్నర్ రింగ్‌రోడ్డులో పోతున్నా, ఈ భూమిని సర్వే చేయాలని ఆర్‌డీఓ, తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా తప్పుడు నివేదిక ఇచ్చినట్టు బాధితులు ఆరోపించారు.

రియల్టర్లు, రెవెన్యూ అధికారుల కుమ్మక్కు

ఎనుమాముల శివారులో గంజి గణేశ్ అనే వ్యక్తి పేరుతో సర్వేనెంబర్ 171/బి అని వేసి ప్లాట్ నెంబర్ 34 ఒక నకిలీ డాక్యుమెంట్‌ను తయారు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ డాక్యుమెంట్‌లో పట్టాదారు పేరుండదు. జీపీఏ హోల్డర్ పేరు నమోదు కాదు, కానీ ఆయనకు సర్వేనెంబర్ 171/బిలో భూమి వుందని డాక్యుమెంట్ తయారు చేశారు. ఈ డాక్యుమెంటులో చూపిన హద్దులు 171/ఎకి సంబంధించిన జీపీఏ హోల్డర్‌ని హద్దులుగా సృష్టించి ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించడం గమనార్హం.

ఉన్నోనికి రాదు..

ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో వాస్తవానికి కోల్పోతున్న భూమి ఎనుమాముల శివారులోని సర్వేనెంబర్ 171లోఎ, బి పార్ట్‌లో ఉంది. ఈ రెండు పార్ట్‌ల్లోని భూమి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో పోతుంది. సర్వేనెంబర్ 171/ఎ లోని భూమి రోడ్డు కింద పోవడం లేదని చెబుతూ బాధితులను మోసం చేస్తున్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు నోటిఫికేషన్ వచ్చాక సంబంధిత భూముల్లో క్రయ, విక్రయాలు జరుపకూడదు. కానీ ఇక్కడ అక్రమ నోటరీలు, రిజిస్ట్రేషన్లు చేసి నష్టపరిహారాన్ని దోచుకోవడానికి నయా దందా షురూ చేశారు. వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపైనున్న నాయుడు పెట్రోల్ పంప్ నుంచి వసంతాపూర్, స్తంభంపల్లి, ఖిలా వరంగల్, జాన్‌పీరీలు, కీర్తినగర్, కోటిలింగాల, ఎనుమాముల మార్కెట్, పైడిపెల్లి శివారు, ఆరేపల్లి జంక్షన్ వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించాల్సి వుంది. మొదటి దశలో నాయుడు పెట్రోల్ పంప్ నుంచి ఎనుమాముల మార్కెట్ వరకు నిర్మించనున్న ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో జాన్‌పీరీల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మినహా ఇప్పటికే 6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. 13 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో 200 మంది రైతులు, ప్రజలు తమ భూములను కోల్పోతున్నారు. కానీ, నిజమైన బాధితులకు కాకుండా.. నకిలీ పత్రాలు సృష్టించి నష్టపరిహారం కాజేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. వెంటనే జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి అక్రమాలు చేసిన అధికారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని భూనిర్వాసితులు కోరుతున్నారు.

ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం చర్యలు

ఇలాంటి కేసులు చాలా వస్తున్నాయి. వాటిని పెండింగ్‌లో పెట్టి ట్రిబ్యునల్‌కు పంపిస్తున్నాం. ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ బి.గోపి- వరంగల్ జిల్లా కలెక్టర్

21 మీటర్ల ఎత్తులో.. మెట్రో

మైండ్‌స్పేస్ జంక్షన్ దాటడం పెద్ద సవాలే

- ఈ జంక్షన్ కింద అండర్‌పాస్, మధ్యలో రోటరీ, పైన ఫ్లైఓవర్
- మూడు అడ్డంకులను దాటేందుకు ప్లాన్ చేస్తున్నాం : హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ఫేజ్-2 మెట్రో నిర్మాణాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. మైండ్‌స్పేస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31కిలోమీటర్ల మేర మెట్రో లైన్ సొంత నిధులతో చేపట్టాలని నిర్ణయించింది. ఆ మేరకు సీఎం కేసీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన కూడా చేయించారు. హెచ్ఏఎంఎల్ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను వేగిరం చేశారు. ఇందులో భాగంగా హెచ్ఏఎంఎల్ సివిల్ ఇంజినీరింగ్ అడ్వైజర్, రైల్వే బోర్డు మాజీ సభ్యులు ఇంజినీరింగ్ సుభోద్ జైన్‌తోపాటు సంబంధిత సీనియర్ ఇంజినీర్లతో కలిసి హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శనివారం ప్రత్యక్షంగా రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ మార్గం తనిఖీల్లో కొన్ని సవాళ్లను గుర్తించారు.

అందులో ప్రధానంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి నానక్‌రామ్‌గూడ జంక్షన్ వరకు మెట్రో నిర్మాణానికి అతిక్లిష్టమైన ప్రాంతంగా ఉంది. ఈ మార్గంలో మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద అండర్‌పాస్, మధ్యలో రోటరీ, పైన ఫ్లైఓవర్ ఒకదాని మీద ఒకటి ఉన్నాయని గుర్తించారు. రాయదుర్గం స్టేషన్ నుంచి నానక్‌రామ్‌గూడ జంక్షన్ వరకు మెట్రో నిర్మాణం చాలా క్లిష్టతరమైందని, 21 మీటర్ల ఎత్తులో మైండ్‌స్పేస్ జంక్షన్ దాటడం సవాలుతో కూడుకుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అండర్‌పాస్, మధ్యలో రోటరీ, ఫ్లైఓవర్ ఉన్నాయని, ఈ మూడు అడ్డంకులను దాటేందుకు ప్రత్యేక స్పాన్‌ను అక్కడికక్కడే నిర్మించే విధంగా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద 20మీటర్ల (66 అడుగులు) ఎత్తులో బహుళ స్థాయి ఫ్లైఓవర్‌ను దాటడం మరొక సవాలు. ఫ్లైఓవర్ పిల్లర్ల పునాదులపై ఎలాంటి ప్రతికూల ప్రభావమూ పడకుండా ఉండేందుకు ఎయిర్‌పోర్ట్ మెట్రో పిల్లర్లను ఫ్లైఓవర్ పిల్లర్లకు దూరంగా నిర్మించాల్సి ఉంది. ఫ్లైఓవర్ మీదుగా నిర్మించబడే స్పాన్ క్రాసింగ్‌ను 'ఇన్ సిటు' పద్ధతిలో ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ గర్డర్లతో ప్లాన్ చేయవచ్చు. అలాగే పొడిగించిన మెట్రో కారిడార్-3(బ్లూ లైన్), ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్ కొత్త ఇంటిగ్రేటెడ్ రాయదుర్గం స్టేషన్‌కు సంబంధించిన విభిన్న నిర్మాణ ప్రక్రియలు ప్రధానంగా ప్రయాణీకుల సౌలభ్యం కోణంలో పరిశీలించనున్నారు. ఈ బహుళ స్థాయి ఇంటర్‌చేంజ్ స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఎక్స్‌ట్రా హై వోల్టేజ్ 400 కేవీ భూగర్భ కేబుళ్లు మార్చకుండా ఉండేలా స్టేషన్ డిజైన్ చేయనున్నారు. అత్యుత్తమ ఇంజినీరింగ్ పరిష్కారాల కోసం అధ్యయనం చేస్తున్నామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇక్కడి సాంకేతిక సవాళ్లను ఎదుర్కొని పరిష్కార మార్గాలను సూచించేందుకు ఈ మార్గంలో తనిఖీలు చేశామని వివరించారు. ఈ తనిఖీలో హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ ఎం.విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఈవై సాయపురెడ్డి, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ జేఎన్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిసోడియాకు మరోసారి సీబీఐ నోటీసులు


- ఢిల్లీ మద్యంకుంభకోణం కేసు...

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీష్ సిసోడియాకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) శనివారం మళ్లీ సమన్లు జారీ చేసింది. సీబీఐ సమన్లు జారీ చేసిన విషయాన్ని ఢిల్లీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా శనివారం ట్వీట్ చేశారు. ఫిబ్రవరి 19న సీబీఐ ప్రధాన కార్యాలయానికి తనను పిలిపించిందని, విచారణకు తాను ఎప్పుడూ సహకరిస్తున్నానని, అలాగే కొనసాగుతానని మనీష్ సిసోడియా ట్వీట్ చేశారు. మనీష్ సిసోడియాకు వ్యతిరేకంగా లభించిన తాజా సాక్ష్యాధారాల ఆధారంగా ఆదివారం విచారణకు పిలిచామని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపొందించి అమలు చేయడంలో జరిగిన అవినీతికి సంబంధించి తాజా సమన్లను సీబీఐ జారీ చేసింది. "ఆదివారం సీబీఐ నన్ను మళ్లీ విచారణకు పిలిచింది. ఈడి, సీబీఐలు పూర్తి అధికారాన్ని నాపై ప్రయోగించారు. అధికారులు నా ఇంటిపై దాడులు చేశారు. నా బ్యాంకు లాకర్‌లో సోదాలు చేశారు. కానీ నాకు వ్యతిరేకంగా ఏమీ కనిపించలేదు" అని సిసోడియా ట్వీట్ లో పేర్కొన్నారు.

సిసోడియాతో పాటు మరో 14 మందిపై సీబీఐ గతేడాది ఆగస్టులో ప్రత్యేక కోర్టులో కేసు నమోదు చేసింది. గతేడాది నవంబర్‌లో తీసుకొచ్చిన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా సిఫారసు చేశారు. విచారణకు సిఫార్సు చేసిన తరువాత, ఢిల్లీ ప్రభుత్వం తన మద్యం పాలసీని ఉపసంహరించు కోవలసి వచ్చింది. దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన కేసులో సిసోడియాతో పాటు ఇతర ఎక్సైజ్ శాఖ అధికారులను ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితులుగా పేర్కొన్నారు.

కృష్ణా జలాలపై అమీతుమీ

- కేంద్రంతోపాటు కర్నాటకపై బిగ్‌ఫైట్
- ఎగువ భద్ర, ఎగువ తుంగ నిర్మాణాలతో రాష్ట్రానికి నష్టం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణానదిపై కర్నాటక రాష్ట్రం నిర్మిస్తున్న ఎగువ భద్ర, ఎగువ తుంగ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఆ నిర్మాణాలను ఆపేందుకు చర్యలు తీసుకుంటున్నది. అప్పర్ భద్ర ప్రాజెక్టు ద్వారా 12.24 టీఎంసీల నీటిని, అప్పర్ తుంగ ద్వారా 29.30 టీఎంసీల నిటిని వినియోగించుకునేందుకు కర్నాటక రాష్ట్రం ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణా నికి పూనుకున్నట్టు అధికారిక సమాచారం. ఈ రెండింటి పరిధిలో 3.06 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ఈ రెండు ప్రాజెక్టు లు పూర్తయితే తెలంగాణకు ఎగువ నుంచి చుక్కనీరు కూడా రాదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఎగువ తుంగ పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూటరీల పనులు ఇప్పటికే కర్నాటక పూర్తి చేసింది. ఇతర పనులూ కూడా ఇంకా నడుస్తున్నాయి. అలాగే ఎగువ భద్రకు సంబంధించి అన్ని పనులు వేగంగా నడుస్తున్నట్టు రాష్ట్ర సాగునీటి శాఖ అధికారులే చెబుతున్నారు. బచావత్ ట్రిబ్యునల్ నుంచి ఎలాంటి నీటి కేటాయింపులు లేకున్నా, కర్నాటక నిర్మాణాల విషయంలో ముందుకు వెళ్లడంపై రాష్ట్ర సాగునీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. ట్రిబ్యునళ్లు, మార్గదర్శకాలకు విరుద్ధంగా కర్నాటక వ్యవహరిస్తున్నా, ఆ రాష్ట్రానికి కేంద్రం మద్దతు ఇవ్వడంపై రాజకీయ కారణాలు ఉన్నాయనే ఆరోపణలు, విమర్శలు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో న్యాయపరంగా కర్నాటకను ఎదుర్కోంటూ ఆ రెండు ప్రాజెక్టు నిర్మాణాలను అడ్డుకునే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అవసరమైతే సుప్రీంకోర్టులో కేసు వేయాలని రాష్ట్ర సాగునీటి శాఖ వ్యూహంగా కనిపిస్తున్నది. ఇందుకు న్యాయనిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నది. అప్పర్ భద్ర, అప్పర్ తుంగ ప్రాజెక్టుల నిర్మాణానికి ఉపక్రమించిన కర్నాటక, ఎలాగైనా వాటిని పూర్తిచేయాలనే తలంపుతో ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అను మతులు లేకుండానే ప్రారంభించిన రెండింటి నిర్మాణాలకు నిలిపి వేయడంతోపాటు అనుమితులు ఇవ్వొద్దంటూ ఇప్పటికే కేంద్ర జలశక్తిశాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. ఈ రెండు ప్రాజెక్టులు నిర్మాణమైతే తుంగభద్ర నుంచి కృష్ణా నదిలోకి నీటి ప్రవాహం తగ్గుతుందనీ, ఆ మేరకు రాష్ట్ర సాగు నీటి ప్రయోజనాలు దారుణంగా దెబ్బ తింటాయని సాగునీటి శాఖ ఆందోళన చెందుతున్నది. ఈ నేపథ్యంలో కర్నాటకతో పాటు కేంద్ర జలశక్తి శాఖతోనూ కోర్టు ద్వారానే తేల్చుకునే ఆలోచనలో ఉంది. నీటి కేటాయింపు లు లేకుండా ఎగువన ప్రాజెక్టులు నిర్మిస్తే, ఆ ప్రభావం దిగువన ఉన్న తెలంగాణపై కచ్చితంగా పడుతుందని సాగునీటిరంగ నిపుణుల అంచనా.

చిన్న, మధ్యతరహా ప్రాజక్టులు, లిఫ్టుల రూపంలో సుమారు 288 టీఎంసీల అదనపు నీటిని కర్నాటక వాడు కుంటున్నదనీ, 2003లోనే సాక్షాధారాలతో సహా కేంద్ర జలసంఘానికి పలు ఫిర్యాదులు చేశారు. లేఖలూ రాశారు. కర్నాటకతోపాటు కేంద్రంలోనూ బీజేపీ అధికారంలో ఉండటంతో అప్పర్ భద్ర, అప్పర్ తుంగ ప్రాజెక్టులకు ఆ రాష్ట్రం సులువుగా అనుమతులు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర సాగునీటి శాఖ అభిప్రాయంగా ఉంది. ఇటీవల అప్పర్ భద్ర ప్రాజెక్టు ను కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రక టిస్తూ తాజా బడ్జెట్‌లో రూ. 5,300 కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. అదే తెలంగాణకు చెందిన పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదాను తిరస్కరించింది. దీంతో మోడీ సర్కారు రాజకీయంగా వివక్షను ప్రదర్శిస్తున్నదనే విమర్శలు బహిర్గతమైనట్టయింది. ఏడాదిలో దాదాపు ఆరు నెలల పాటు నీటి ప్రవాహం అక్కడ ఉంటుందని సమాచారం. సుమారు 5000 మీల్లిమీటర్ల వర్షపాతం నమోదవుతుంది.ఎగువతుంగపై ఎలాంటి ప్రాజెక్టు లు కట్టినా శ్రీశైలం ఎండిపోతుందని సాగు నీటి రంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి అభిప్రాయపడ్డారు. తద్వారా ఏపీతో పాటు తెలంగాణలోని కల్వ కుర్తి, పాల మూరు ఎత్తిపోతల పథకా లు తీవ్రంగా నష్టపోతాయని వ్యాఖ్యాని ంచారు.ఇప్పటికే పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీటిని తరలిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం లో 50 టీఎంసీలే ఉంటున్నా యని గుర్తు చేశారు. ఈ విషయం తెలంగాణ సాగు నీటి, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళధర్‌ను సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

పంట భూములపై 'రియల్' భూతం

మాయమాటలతో రైతులను మభ్యపెడుతున్న వైనం

- తక్కువ ధరకు అసైన్డ్ భూముల కొనుగోళ్లు
- అధికారుల మాయాజాలంతో భూములకు పట్టాలు
- రైతుల నుంచి చేజారుతున్న వ్యవసాయ భూములు



అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

పేద రైతుల జీవనాధారం కోసం ఎన్నో పోరాటాల ఫలితంగా నాటి ప్రభుత్వాలు పేదలకు అసైన్డ్ భూములు ఇచ్చాయి. వాటికి పట్టాలు ఇవ్వాలి. అసైన్డ్ భూముల పేరుతో రైతుల నుంచి తక్కువ ధరకు భూములు కాజేస్తూ కోట్లు గడిస్తున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

కాడిగళ్ల భాస్కర్, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి.

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

పచ్చని పంట భూములను రియల్ భూతం పట్టి పీడిస్తోంది. పేద రైతులనే టార్గెట్ చేసింది. 'అసైన్డ్' పేరును అడ్డుపెట్టుకుని రైతుల భూములు కాజేసే కుట్రలు జరుగుతున్నాయి. గతంలో ఎన్నో పోరాటాల ఫలితంగా నాటి ప్రభుత్వాలు పేదలకు అసైన్డ్ భూములు పంచాయి. ఈ భూములకు పట్టాలు కూడా వచ్చాయి. గీ భూములనే నమ్ముకుని రైతులు బతుకుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అభివృద్ధి పనుల పేరుతో ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పుడు ఈ భూములపై రియల్టర్ల కన్ను పడింది. ప్రభుత్వం తీసుకోకముందే తమకు భూములు అమ్మాలని రైతులను మభ్యపెడుతున్నారు. ఈ అసైన్డ్ భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాక అధికా రుల చేతివాటంతో పట్టా భూములుగా మారుతున్నాయి. రియల్టర్లకు కోట్లు కురిపిస్తు న్నాయి. రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ల కబంధ హస్తాల్లో చిక్కిన సాగు భూములపై కథనం.

రంగారెడ్డి జిల్లాలోని ఆదిభట్ల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 44/అ/1, 44/ఆ/1లో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమిని రైతుల నుంచి రియల్టర్లు కొనుగోలు చేశారు. ఆ వెంటనే భూమి పట్టా చేసుకున్నారు. అసైన్డ్ భూమిగా రికార్డుల్లో చూపిన భూములకు సాధారణ పట్టాలు వచ్చాయి. కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 22/1లో 20 ఎకరాలు, 255/2లో 32 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఇందులో 30 మంది రైతులకు ఎకరా చొప్పున ప్రభుత్వం భూమి అసైన్డ్ చేసింది. 1989లో కొంత భూమి 22బి కింద ప్రభుత్వం తీసుకుంది. అయితే, ఈ భూములను సాగుచేస్తున్న రైతులకు గతంలో అసైన్డ్‌తో పట్టాలు ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఈ సర్వే నెంబర్ల భూములు పేదలకు అసైన్డ్ చేసినట్టు చూపుతున్నాయి. అయితే, ధరణి పోర్టల్ వచ్చిన తరువాత కొత్త పాసు పుస్తకాలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇదే అదునుగా రాజకీయ పలుకుబడి, ప్రభుత్వ అండదండాలు ఉన్న రియల్ వ్యాపారులు రైతులకు నయానో.. భయానో ఇచ్చి ఈ భూములు కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారు.

షాబాద్ మండల పరిధిలోని చందనవల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములు ఇచ్చింది. ఈ భూములను ప్రభుత్వం తిరిగి లాక్కుంటుందని తెలిసి రియల్ వ్యాపారులు రైతులను మభ్యపెట్టి ఎకరాకు రూ.20 లక్షల చొప్పున ఇచ్చి 25 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇక్కడ ఎకరా భూమి సుమారు రూ.మూడు కోట్లు ఉంది. ఇలా మొయినాబాద్, శంకర్‌పల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీం పట్నం, షాద్‌నగర్‌లో వందలాది ఎకరాల భూములను పేదల నుంచి తక్కువ ధరకు రియల్ వ్యాపారులు కొనుగోలు చేస్తూ రూ.కోట్లు గడిస్తున్న పరిస్థితి. అయితే, ఈ తతంగం అంతా పాలక రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో జరుగుతుందన్న చర్చ జిల్లాలో జోరుగా వినిపిస్తోంది. రైతుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములు రియల్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లగానే పట్టాలుగా మారుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి పేదల భూములను రియల్టర్ల నుంచి కాపాడాలని, అసైన్డ్ భూములకు రైతులకే పట్టాలు ఇవ్వాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

పర్యాటక కేంద్రంగా ఏడుపాయల అభివృద్ధి : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో మహా శివరాత్రి జాతరను శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డితో కలిసి వనదుర్గా భవానీమాతకు పట్టు వస్త్రాలు సమర్పించారు. గర్భగుడి ముందు మంజీర నది పాయ మధ్యలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. శివుడి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అగ్రభాగాన ఉండేవిధంగా పరమశివుడు ఆశీస్సులు అందజేయాలని ప్రార్థించామన్నారు. ఈ సంవత్సరం రూ.రెండు కోట్లు కేటాయించామన్నారు.

పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేస్తాం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్

ఎట్టి పరిస్థితుల్లోనూ పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఎక్సైజ్, పర్యాటక, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట పెద్ద శివాలయంలో శనివారం దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయితేనే ఈ ప్రాంతానికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం ఒక న్యాయమైన కోరిక అని, కరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అత్యవసరమన్నారు. సాగునీటి లభ్యత పెరిగితే జిల్లా స్వరూపమే మారుతుందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు పండుతున్నాయన్నారు. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎండాకాలంలో కూడా వాగుల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తోందన్నారు. చెరువుల పూడికతీత వల్ల సాగునీటి లభ్యత పెరిగిందన్నారు.

ఏప్రిల్ 30న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి రాకేష్ మిత్తల్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 30న ఎన్నికలు నిర్వహించేందుకు రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి రాకేష్ మిత్తల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మొత్తం 8 వార్డులు ఉన్నాయి. ఇతర కంటోన్మెంట్లలో మూడు నుంచి ఐదు వరకే వార్డులు ఉన్నాయి. అయితే ఓ పక్క జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం విషయం పరిశీలన ఉంది. అయితే, దీనిపై పార్లమెంట్‌లో నూతన చట్టం బిల్లు ఆమోదానికి చర్చకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 2006 చట్ట ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుతోపాటు దేశంలో ఉన్న మరో 56 కంటోన్మెంట్లకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్లో పేర్కొంది. 2015లో చివరిసారిగా పాలకమండలి ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి నూతన చట్టం అమల్లో వస్తుందని ఎన్నికలు ఎప్పటికప్పుడూ వాయిదా వేస్తూ వచ్చారు. అయితే, కొన్ని కంటోన్మెంట్‌లలో మాజీ సభ్యులు స్థానిక న్యాయస్థానాలను ఆశ్రయించటంతో కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితులలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. 2005లో 1924 చట్ట ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత 2006లో చట్టాన్ని మార్పు తేవడంతో 2005లో ఎన్నికైన పాలకమండలిని రద్దు చేశారు. ఇప్పుడు కూడా 2020 బిల్లు ఆమోదం పొందితే మళ్లీ రద్దు అయ్యే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం 2006 చట్టప్రకారమే ఏప్రిల్ నెలలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది.

కువైట్‌లో ఎన్నారై సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్ :ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఎన్నారై బీఆర్ఎస్ కువైట్ శాఖ అధ్యక్షురాలు గొడిశాల అభిలాష ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణను సాధించడమే గాక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఎన్నో అద్భుతమైన పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టిన కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇదే తరహాలో ఆయన మున్ముందు ప్రధాని పీఠాన్ని అధిరోహించి దేశాన్ని సైతం అభివృద్ధి పథంలో పయనింపజేయాలని ఆకాంక్షించారు. సీఎం నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని అభిలషించారు. కార్యక్రమంలో జాగృతి కువైట్ అధ్యక్షుడు వినయ్ ముత్యాల, సురేష్ గౌడ్, ప్రమోద్ కుమార్, అయ్యప్ప, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ యాత్రకు విరామం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హాత్ సే హాత్ జోడో యాత్రకు టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విరామమిచ్చారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని (18,19 తేదీల్లో) ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 6న ములుగు జిల్లా మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర...11రోజులపాటు కొనసాగుతూ శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చేరుకుంది. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో వంద కిలోమీటర్లు నడిచారు. విరామానంతరం ఈనెల 20 నుంచి వరంగల్ పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల మీదుగా యాత్ర తిరిగి కొనసాగనుంది.

వ్యవసాయం పరిశ్రమగా స్థిరపడాలి

- ప్రపంచ జనాభాకు ఆహారాన్నందించే శక్తి భారత్‌కే ఉంది
- నూతన పద్ధతిలో వ్యవసాయం సాగాలి : మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వ్యవసాయం పరిశ్రమగా స్థిరపడాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని పారిశ్రామిక వాడలో ఏర్పాటైన అక్షయ అగ్రి పరిశ్రమలో తయారవుతున్న వ్యవసాయ యంత్రాలను మంత్రి నిరంజన్ రెడ్డి శనివారం పరిశీలించారు. యంత్రాల తయారీ విధానం, వాటి పనితీరును పరిశ్రమ ప్రతినిధులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచంలో 800 కోట్ల జనాబా దాటిపోయిందన్నారు. ఆ జనాభాకు తగిన ఆహారపు అలవాట్లను తీర్చగలిగే శక్తి కేవలం భారతదేశానికి మాత్రమే ఉందన్నారు. ఇక్కడి భూమి వనరులు, వాతావరణ అనుకూల పరిస్థితులతో అన్నిరకాల పంటలు పండే అవకాశం ఉందన్నారు. ఇంత ఉన్నా మన దేశానికి పప్పు దినుసులు, నూనెలు దిగుమతి చేసుకునే దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ ఉత్పత్తిని చేసుకునే విధంగా మన ఆలోచన మారాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ జయరాజ్, డీఏవో ఆశాకుమారి, ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్, వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, సర్పంచ్ నరాల ప్రభావతి పెంటయ్య, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

భాషా పండితుల సస్పెన్షన్ ఎత్తేయాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదోన్నతులు దక్కటం లేదనే ఆవేదనతో నిరసన తెలుపుతున్న భాషాపండితులను సస్పెండ్ చేయటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. వారిపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏండ్ల తరబడి పదోన్నతి లేకపోయినా, పాఠశాలల్లో వివక్షకు గురౌతున్నా విద్యార్థుల శ్రేయస్సు కోసం ఉన్నత తరగతులు బోధిస్తున్న భాషా పండితులకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలో పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులివ్వకుండా మభ్యపెడుతున్నారంటూ వారు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో కూడా వారి పదోన్నతుల అంశం లేకపోవడంతో భాషాపండితులు ఆవేదనకు గురయ్యారని వివరించారు. దీంతో వారి జాబ్ చార్ట్‌లో లేని విధంగా ఉన్నత పాఠశాలల్లో బోధన చేయబోమంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అయినా వారు అనధికారికంగా పాఠాలు బోధిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. నిరసన లేఖల ఆధారంగా రంగారెడ్డి, సంగారెడ్డి విద్యాధికారులు భాషా పండితులపై సస్పెన్షన్ వేటు వేయడం అన్యాయమని విమర్శించారు. డీఈఓల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. భాషాపండితులపై వేసిన సస్పెన్షన్ వేటు వెంటనే ఎత్తేయాలనీ, పదోన్నతులపై ఉన్న కేసును ప్రభుత్వం చొరవతీసుకుని తొలగించాలనీ కోరారు. ప్రస్తుత పదోన్నతుల షెడ్యూల్‌లోనే పండితులకు సైతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సంఘాల ఖండన

భాషాపండితులను సస్పెండ్ చేస్తూ డీఈవోలు ఆదేశాలు ఇవ్వడాన్ని ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు జి సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆ ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా విద్యాశాఖ అధికారులు ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేయడాన్ని బీసీటీఏ అధ్యక్షులు కె కృష్ణుడు, కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ ఖండించారు. అందరితోపాటు పండితులకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

పాలడుగు భాస్కర్, అబ్బాస్



నవతెలంగాణ-భువనగిరిరూరల్

పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్, వేతనాల పెంపు, పెండింగ్ బకాయిల చెల్లింపు, మల్టీపర్పస్ వర్క్ విధానం రద్దు, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలనే డిమాండ్ల సాధనకై ఫిబ్రవరి 12 నుంచి జనగామ జిల్లా పాలకుర్తి నుంచి పట్నం వరకు చేపట్టిన జీపీ కార్మికుల యాత్ర శనివారం భువనగిరి మండలం లోని రాయగిరికి చేరుకుంది. పాదయాత్రకు ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ సంఘీభావం తెలిపారు. పులిగిల్ల నుంచి రాయగిరి వరకు 19 కిలోమీటర్లు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్, అబ్బాస్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రమోషన్లు కల్పించి కార్యదర్శులుగా నియమించాలని కోరారు. స్పెషల్ స్టేటస్ కల్పించాలని, రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న రూ.15,600 వేతనాన్ని పంచాయతీ కార్మికులకు కూడా చెల్లించాలని కోరారు. పంచాయతీ కార్మికులు చేపట్టే ఆందోళన, పోరాటాలలో ఆవాజ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ప్రత్యక్ష పోరాటాల్లో వారికి మద్దతుగా నిలుస్తామని చెప్పారు. అనంతరం యాత్రకు సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రవణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు.

యాత్రకు భువనగిరి మండలం ప్రాంతంలోని వివిధ కార్మిక సంఘాలు, హమాలీ యూనియన్ నాయకులు కృష్ణయ్య, అంజయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు, కారోబార్ పద్మారావు, రాము, శ్రీను, సంజీవ, మహేందర్ పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపారు. యాత్రలో సీఐటీయూ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి, పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండు, జిల్లా నాయకులు తదిరులు పాల్గొన్నారు.

నెర్రెలువారిన నేలంతా సస్యశ్యామలం

'సింగూరు జలాలు మెదక్ హక్కు' నినాదాన్ని నిజం చేసినం

- సంగారెడ్డి జిల్లాలో 7 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే పథకాలు
- కొందరిలా మతాన్ని రాజకీయాలకు వాడే బుద్ధి మాకు లేదు : ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు
- 1.65 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే బసవేశ్వర లిఫ్టుకు భూమిపూజ



నవతెలంగాణ- మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కరువు పీడిత ప్రాంతంగా నెర్రెలు వారిన తెలంగాణ నేలంతా కేసీఆర్ పరిపాలనాదక్షతతో సస్యశ్యామలంగా మారుతోందని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండలం బోరంచ గ్రామంలో రూ.1774 కోట్లతో నిర్మించతలపెట్టిన బసవేశ్వరం లిఫ్టు ఇరిగేషన్ పథకం పనులకు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల 'సింగూరు జలాలు మెదక్ హక్కు' అనే నినాదం గోడ రాతల్లో కనిపించేదని, తెలంగాణ వచ్చాక నిజం చేసి బీడుభూముల్ని సాగులోకి తెచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. 471 మీటర్ల ఎత్తులో ఉండే మేడిగడ్డ నుంచి గోదావరి జలాలను తెచ్చి కరువు ప్రాంతమైన నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్టు పథకాల పనులు చేపట్టామన్నారు. సంగారెడ్డి జిల్లాలో 8 లక్షల ఎకరాలకు సాగునీరందించే పథకాల పనులు జరుగుతున్నా యన్నారు. నారాయణఖేడ్ ప్రాంతానికే ఇప్పుడు ఐదారు రాష్ట్రాల నుంచి ప్రజలు వలసలొచ్చి బతికేంత అభివృద్ధి ఇక్కడ జరిగిందన్నారు. కొందరు దేవుళ్లను రాజకీయాలకు వాడుకుంటుంటే కేసీఆర్ మాత్రం నమ్మకం, విశ్వాసంతో అభివృద్ధి, ప్రగతి బాటన నడుస్తున్నారని చెప్పారు. బీజేపీ వాళ్లేమో మతాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయంగా లబ్దిపొందేం దుకు ఎన్నికల ముందు గుళ్లు కట్టడం, ప్రారంభిం చడం చేస్తున్నారని, కేసీఆర్ మాత్రం అభివృద్ధి కోణంలోనే యాదాద్రిని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దార న్నారు. ప్రాజెక్టుల కోసం భూముల్ని ఇచ్చి సహకరి స్తున్న నిర్వాసితులకు మెరుగైన పరిహారంతోపాటు దళితబంధు, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల్లో తొలి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్, చీఫ్ ఇంజినీర్ అజయ్, ఎస్పీ రమణకుమార్ పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులపై మంత్రి సబిత ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తారా?. మాకు చెప్పకుండా భాషాపండితులను సస్పెండ్ చేస్తారా?. ఇలాంటి వైఖరితో ప్రభుత్వంపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరుగుతుంది.'అంటూ పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులపై మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. శనివారం మంత్రి వారికి ఫోన్ చేసి ఆ సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదేశించినట్టు సమాచారం. ముగ్గురు భాషాపండితులపై డీఈవోలు సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదంటూ ఈ సందర్భంగా మంత్రి సూచించినట్టు తెలిసింది. సమస్యను పరిష్కరించాల్సింది పోయి మరింత జఠిలం చేస్తారా?అని ప్రశ్నించినట్టు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ పరిణామాలతో పండితుల సస్పెన్షన్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వారికి పదోన్నతులు ఇవ్వకపోగా సస్పెండ్ చేయడంతో తన పట్ల ఆగ్రహంతో ఉంటారని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు పండితునిగా పనిచేస్తున్న సిహెచ్ దేవదానంను సస్పెండ్ చేస్తూ ఆ జిల్లా డీఈవో శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సస్పెన్షన్ ఎత్తేసే ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వచ్చే అవకాశమున్నట్టు తెలిసింది. 20 నుంచి భాషాపండితుల బోధన : మంత్రి విజ్ఞప్తికి సుముఖత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా భాషా పండితులు బోధన కొనసాగించాలంటూ విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చేసిన విజ్ఞప్తికి భాషా పండితుల జేఏసీ సుముఖత వ్యక్తం చేసింది. సోమవారం నుంచి బోధన కొనసాగుతుందని జేఏసీ ప్రకటించింది. ప్రభుత్వ ఉత్తర్వులు ఐదు, తొమ్మిదిల ద్వారా విడుదలైన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో భాషా పండితులకు అవకాశం కల్పించనందుకు నిరసనగా గత 17 రోజులుగా వారు తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ బోధనను బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పేద విద్యార్థులకు నష్టం వాటిల్లకూడదని భావించిన మంత్రి సబిత శనివారం జేఏసీ నాయకులను చర్చలకు ఆహ్వానించారు. వారితో సంప్రదింపులు జరిపారు. పదోన్నతుల సమస్యను పరిష్కరించి తగిన న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆమె ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి తొమ్మిది, పది తరగతులకు తెలుగు, హిందీ, ఉర్దూ విద్యాబోధన చేస్తామని భాషా పండితుల జేఏసీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం డి అబ్దుల్లా, సి జగదీశ్, చక్రవర్తుల శ్రీనివాస్, కృష్ణ, నర్సిములు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ హైకోర్టు ఆదేశాలతో నిలిచిపోయిన విషయం తెలిసిందే. మార్చి 14వ తేదీ వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టొద్దంటూ న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. భవిష్యత్తులో పదోన్నతులు చేపడితే అందులో భాషాపండితులకూ ప్రాధాన్యతనిచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జేఏసీకి మంత్రి హామీ ఇచ్చినట్టు సమాచారం. అవసరమైతే ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సంప్రదించి న్యాయం చేస్తామన్నారంటూ హామీనిచ్చారని జేఏసీ నేతలు తెలిపారు.

సంపాదకీయం


ద్వేషగీతం

"ఎక్కడ ఎన్నికలు మొదలవుతాయో! ఎక్కడ అధికారం కోసం తమ బాహువులను తమ పార్టీ చాస్తుందో! ఎక్కడ తమ పాలనకు వ్యతిరేకత వెల్లువెత్తుతుందో! అక్కడ కచ్చితంగా మత విద్వేషం రగుల్కుంటుంది. ఉన్మాదం తలలెత్తుతుంది." ఇది అక్షరాలా ఆచరిస్తూ ఉన్నది కాషాయ

> టిప్పు సుల్తాన్ పరిపాలనాదక్షుడు. తన పాలనలో అనేక సంస్కరణ లను తీసుకొచ్చినవాడు. అతని సైన్యంలో హిందువులను పెద్ద యెత్తున నియమించాడు. మంత్రులుగానూ ఉన్నారు. మైసూర్ పులిగా పేరుగాంచిన టిప్పు ఆధునికుడు. సామ్రాజ్య దురాక్రమణకు ప్రాణాలెదురొడ్డి పోరాడినవాడు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. ఈ చరిత్రను తిరగరాయాలని వీళ్లు తెగ ఆరాటపడుతున్నారు.

పరివారం. ఆ ద్వేషగీతం ఇప్పుడు కర్నాటకలో గొంతెత్తుతోంది. అదిప్పుడు అనాగరిక నినాదాలకు పూనుకొంటున్నది. ఈ మధ్య ఆ రాష్ట్రంలో జరిగిన ఓ బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నళిన్‌కుమార్ కాతీల్ తీవ్రమైన పిలుపులిచ్చాడు. టిప్పుసుల్తాన్ అనుచరులను, అభిమానులను వెంటాడి, వేటాడి అంతమొందించాలని బహిరంగంగానే తన విషాన్ని వెళ్లగక్కాడు. 'మనము శ్రీరాముడి భక్తులం. హనుమంతుడి భక్తులం. టిప్పు సుల్తాన్ భక్తులం కాదు. ఆ సుల్తాన్ భక్తులు బతికి ఉండటానికి వీలుల్లే చంపేయండి' అని అనాగరికాదేశం జారీ చేశాడు.

ఇలాంటి ప్రకటనలు, వ్యాఖ్యానాలూ, పిలుపులు ఇప్పుడు కొత్తేమీ కాదు, ప్రజ్ఞాసింగ్, రాజాసింగ్ మొదలైన కాషాయ నాయకులు గతంలోనూ ఇప్పుడు కూడా ఇలాంటి ప్రకటనలే చేస్తున్నారు. ఇంత బహిరంగంగా చంపమని కోరినా, పిలుపిచ్చినా ఎవరూ ఏమీ అనరు. ఏ చట్టమూ వారిని శిక్షించదు. పోలీసులూ, కేసులూ ఏమీ ఉండవు. అదే మరి అధికార విద్వేషానికుండే సౌలభ్యం. రాజ్యమే ఉన్మాద పక్షమైనప్పుడు జరిగేది అంతేగా. పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన టిప్పుసుల్తాన్ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన యోధుడు. అతని చరిత్రను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ ప్రజల మధ్య విభజనను సృష్టిస్తోంది కాషాయ దళ రాజకీయం. అతని జయంతిని కూడా వివాదాస్పదం చేసి అడ్డుకున్నది. అతను ముస్లిం కావడమే వారి ద్వేషానికి కారణం.



స్వాతంత్ర్యోద్యమ చరిత్రనే వక్రీకరించడానికి పూనుకొనే వాళ్లు ఇక టిప్పు విషయంలో ఎందుకు ఊరుకుంటారు! టిప్పుసుల్తాన్ చాలా మంది హిందువులను బలవంతంగా మతమార్పిడి చేయించాడని సంఘ్ పరివారం ఆరోపిస్తున్నది. అంతే కాదు, అతను ఎప్పుడూ యుద్ధం చేయలేదని, యుద్ధంలో చనిపోలేదనీ ప్రచారం చేస్తున్నది. కానీ దక్షిణ కర్నాటకలో ఇప్పటికీ ముద్దుగా తమ పిల్లలను టిప్పు సుల్తాన్ అని అనేక మంది ప్రజలు పిలుచుకుంటారు. కర్నాటక సాంస్కృతిక రాజధాని మైసూర్ రాజ్యాన్ని బ్రిటిష్ వారి నుండి కాపాడుకోవడానికి వారితో వీరోచితంగా పోరాడిన ధీరుడిగా టిప్పు ప్రసిద్ధుడు. అతని మీద వీళ్లు చేస్తున్న ఆరోపణలన్నీ రాజకీయ దురుద్దేశంతో, మతతత్వంతో చేస్తున్నవే. వాటిలో చారిత్రిక వాస్తవాలు లేవు. వాస్తవంగా చరిత్రకారులు, రచయితలు చెబుతున్నదేమంటే, ఆనాటి తన రాజ్యంలో ఉన్న దాదాపు 156 హిందూ దేవాలయాలను తన నిధులు కేటాయించి అభివృద్ధి పరిచాడు. ఆదిశంకరాచార్యులు నెలకొల్పిన శృంగేరీ మఠాన్ని మరాఠా దాడుల నుండి రక్షించి కాపాడి దాని విస్తరణకు టిప్పు పాటుపడ్డాడని చెబుతారు. అంతే కాదు రంగనాథస్వామి దేవాలయాన్ని కూడా రక్షించి అభివృద్ధి చేశాడు. శ్రీ కంఠేశ్వర ఆలయానికి పదివేల బంగారు నాణేలు చందాగా ఇచ్చి ఆదుకున్నాడు. తన రాజ్యానికి శ్రీరంగపట్నాన్ని రాజధానిగా చేసుకుని చివరికంటా కొనసాగించడమే కాక 4వ మైసూర్ యుద్ధంలో శ్రీరంగ పట్నాన్ని రక్షించుకునే ప్రయత్నంలోనే అమరుడయ్యాడు.

టిప్పు సుల్తాన్ పరిపాలనాదక్షుడు. తన పాలనలో అనేక సంస్కరణ లను తీసుకొచ్చినవాడు. అతని సైన్యంలో హిందువులను పెద్ద యెత్తున నియమించాడు. మంత్రులుగానూ ఉన్నారు. మైసూర్ పులిగా పేరుగాంచిన టిప్పు ఆధునికుడు. సామ్రాజ్య దురాక్రమణకు ప్రాణాలెదురొడ్డి పోరాడినవాడు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. ఈ చరిత్రను తిరగరాయాలని వీళ్లు తెగ ఆరాటపడుతున్నారు. చరిత్రలోకి వెళ్లి మతోన్మాదాన్ని రెచ్చగొడు తున్నారు. మత పరంగా విభజనను తీసుకువచ్చి రాజకీయ అధికారాన్ని పొందటానికి వాళ్లకున్న ఏకైక సాధనం ఇది. ఇంత క్రితం మన తెలంగాణలోని కాషాయ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా 'మా మత ధర్మ పరిరక్షణ' కోసం ఎవరినైనా చంపటానికి సిద్ధమని అన్నాడు. చంపుతామని ఓపెన్‌గా ప్రకటిస్తున్నారు. నిన్న రాజస్తాన్ రాష్ట్రంలో భరత్పూర్ జిల్లాలో గోరక్షకుల పేరుతో భజరంగేయులు ఇద్దరు ముస్లిం యువకులను అపహరించి హత్య చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇక కేంద్ర ఎన్నికలు ముంచుకొస్తే ఇంకెన్ని దారుణాలకు పాల్పడతారోనని ప్రజలు భయపడుతున్నారు. మానవహననమే వీరి ఎన్నికల వాగ్దానంగా వినపడుతున్నది. ఈ ద్వేషగీతానికి చరమగీతం పాడాల్సి ఉంది.

న్యాయమూర్తులతో గవర్నర్ రాజకీయాలా!

రాష్ట్రాల రాజకీయాలతో గవర్నర్లకు పనేమిటని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నిస్తున్న సందర్భంగానే నరేంద్రమోడీ ప్రభుత్వం ద్విముఖ రాజకీయానికి పాల్పడింది. ఏకకాలంలో రెండు వ్యవస్థలతో రాజకీయ క్రీడ సాగించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా పన్నెండు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజకీయ వివాదంగా మారడానికి కారణం ఇదే. ఇందులో సగం మందిని ప్రస్తుతమున్న చోట్ల నుంచి కొత్త చోట్లకు మార్చగా, మరో ఆరుగురిని నూతనంగా నియమించారు. వీరిలో చాలామంది బీజేపీ నేతలు, ఒకరు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్. పాలక పార్టీల నేతలకు పునరావాస కేంద్రాలుగా రాజ్‌భవన్‌లను ఉపయోగించే రివాజు గతం నుంచి ఉంది గనుక ఎవరూ ఆశ్చర్యపోరు. అనుభవజ్ఞులైన మాజీ ముఖ్యమంత్రులూ, మంత్రులూ సీనియర్ నేతలతో పాటు మాజీ బ్యూరోక్రాట్లను కూడా గవర్నర్లుగా నియమించడం గతంలో జరిగేది. కాంగ్రెస్ హయాంలోనూ చెన్నారెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి వంటి మాజీ ముఖ్యమంత్రులను కూడా గవర్నర్లను చేశారు. గవర్నర్లు సిఎంలుగానూ మారారు. ఉదాహరణకు మహారాష్ట్ర



తెలకపల్లి రవి

> సర్కారియా సిఫార్సుల ప్రకారం గవర్నర్ల నియామకంపై ముందుగా రాష్ట్రాలను సంప్రదించి నిర్ణయించాలి. వారి ముందు ముగ్గురి జాబితా ఉంచి ఎంచుకోవడానికి అవకాశమివ్వాలి. తాజాగా పదవులు నిర్వహించిన వారినీ అప్పడే రాజకీయ పదవుల నుంచి వచ్చిన వారిని దూరం పెట్టాలి. వివాదాస్పద నేపథ్యం ఉంటే అసలు పరిశీలనకే తీసుకోకూడదు. ఇక న్యాయమూర్తుల వరకూ బాధ్యతల విరమణ తర్వాత రెండేండ్ల విరామం లేకుండా పదవులు ఆమోదించకూడదు. ప్రధాన న్యాయమూర్తుల జాతీయ సభలో దీనిపై కచ్చితమైన నిర్ణయం తీసుకోవాలి.

నాయకుడు సుశీల్ కుమార్ షిండే, యూపీ నేత నారాయణ్‌దత్ తివారి వంటివారు ఉమ్మడి ఏపీకీ గవర్నర్లుగా పనిచేశారు. కాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాక వీటిని మార్చేశారు. ఉదాహరణకు తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలు తమిళిసైని తెలంగాణ గవర్నర్‌గా నియమించారు. సంఘ్ పరివార్ పెద్దలను నియమించడం వాజ్‌పేయి హయాంలోనూ జరిగింది గాని ఇప్పుడు మరింత పెరిగింది. వారు ఆయా బీజేపీయేతర రాష్ట్రాల వ్యవహారాలలో తలదూర్చడం, ఇబ్బంది పెట్టడం కూడా ఆ మేరకు పెరిగింది. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక వంటిచోట్ల గవర్నర్ల నిర్వాకాలు, నిరోధకాలు నిరసనలకు దారితీశాయని చాలాసార్లు చెప్పుకున్నదే. ఈ సమయంలో కూడా పంజాబ్ గవర్నర్ ముఖ్యమంత్రి మాన్‌పై బహిరంగ విమర్శలు చేస్తున్నారు. తమిళనాడు గవర్నర్ బిఎస్ రవి రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదని బాహాటంటా విమర్శిస్తున్నారు. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ గతంలో బెంగాల్ గవర్నర్‌గా ఉండి పాలన తీరుపై నిత్యం వ్యాఖ్యలు చేసేవారు.

రాజ్‌భవన్‌లలో న్యాయమూర్తులు

ఈతరహా ఉల్లంఘనలన్నిటిలోకీ దారుణమైంది మాజీ న్యాయమూర్తులనూ ప్రధాన న్యాయమూర్తులనూ కూడా గవర్నర్లుగా నియమించడం. వాస్తవానికి జడ్జీలుగా నియమించేముందు వారిగురించి ప్రత్యేక నిఘా నివేదికలు తెప్పించుకుంటారు. కాస్త వివాదం ఉందన్నా నియామకం నిలిపేస్తారు. మోడీ ప్రభుత్వం వచ్చాక తమకు నచ్చని వారిని కొలీజియం సిఫార్సు చేస్తే నియమించకుండా నిలిపేస్తున్నారు. కొలీజియం నిర్ణయాల పారదర్శకత ఉండటం లేదని కేంద్ర న్యాయశాఖామంత్రి కిరణ్ రిజీజు పదేపదే దాడిచేస్తున్నారు. జడ్జిల నియామకంలో జోక్యం కోసం ఒక అఫిడవిట్ కూడా కేంద్రం సుప్రీం కోర్టుకు సమర్పించింది. ఇటీవలనే ఒక న్యాయమూర్తిని స్వలింగ సంపర్కుడన్న కారణంతో నిలిపేసింది. ఇదంతా కూడా న్యాయమూర్తులుగా వచ్చేవారి సచ్ఛీలత కోసమేనని చెబుతున్నారు. న్యాయ మూర్తుల నియామకంపై చర్చ మరోసారి చేయొచ్చు. కానీ అంతగా చెప్పే సచ్ఛీలత పదవీ విరమణ తర్వాత అక్కర్లేదా? పదవీ విరమణ తర్వాత మరింత కీలకమైన పదవులు ఎరజూపితే ఇక విలువలమయ్యేట్లు? జైభీమ్ సినిమాతో దేశమంతటినీ ఆకర్షించిన జస్టిస్ చందు తను పదవీ విరమణ తర్వాత ఏ విధమైన కమిషన్ల చైర్మన్ గిరీ కానీ, రాజ్యసభ సభ్యత్వం గానీ, గవర్నర్ గిరీ గానీ తీసుకోబోనని ముందే ప్రకటించారు. యూపీఏ హయాంలో వచ్చిన పదవుల ప్రతిపాదనలన్నిటినీ తిరస్కరించారు. మాజీ సిజెఐ రంజన్ గోగోయ్ పుస్తకానికి ముందు మాట రాయడానికీ, ఆవిష్కరణకూ కూడా నిరాకరించారు. న్యాయమూర్తులు గనక రాజకీయ పదవులకు ఎన్నికైన నేతలకు పుష్పగుచ్ఛాలు, అభినందన సందేశాలు పంపించడం మొదలెడితే వారిపై ప్రజల విశ్వాసం సన్నగిల్లిపోతుందని జస్టిస్ తుల్జాపుర్కార్ 1980లో వ్యాఖ్యానించారు. కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటి? మాజీ న్యాయమూర్తి అరుణ్‌మిశ్రా ప్రధాని మోడీ భజన చేయడం బహిరంగ విమర్శలకు గురవడం గుర్తుండేవుంటుంది. ఆయన హయాంలోనే అదానీ అక్రమాలను బయటపెట్టిన పాత్రికేయులు పరంజయ్‌గుహ ఠాగూర్ లపై మూడు పరువు నష్టం దావాలు రావడం, వారిని రాయకుండా ఆంక్షలు విధించడం మర్చిపోకూడని విషయం.

మోడీ రాజ్యంలో పరాకాష్ట

కాంగ్రెస్ హయాంలోనూ అనేక అవకతవకలు జరక్కపోలేదు. ఇందిరాగాంధీ సీనియారిటీని ఉల్లంఘించి ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక చేసిన ఉదంతాలున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఆమె నిబద్ధ న్యాయవ్యవస్థ (కమిటెడ్ జ్యుడిషయరీ కావాలని అంటుండేవారు. ఆ పార్టీ హయాంలో మాజీ న్యాయమూర్తులను అనేక న్యాయసంబంధమైన పదవుల్లో నియమించేవారు. 1952లో నెహ్రూ హయాంలో జస్టిస్ ఫజల్ ఎస్ అలీని ఒరిస్సా గవర్నర్‌గా నియమించారు. మళ్లీ దేవగౌడ ప్రభుత్వం జస్టిస్ ఫాతిమాబీవీని పదవీ విరమణ తర్వాత అయిదేండ్లకు తమిళనాడు గవర్నర్‌గా పంపించింది. నరేంద్రమోడీ అధికారం చేపట్టగానే కేరళకు మాజీ సిజెఐ పి.సదాశివన్‌ను గవర్నర్‌గా పంపించారు. ఆయన హయాంలో అనేక సమస్యలు రాగా తర్వాత వచ్చిన ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మరింత తీవ్రమైన సంక్షోభాలు సృష్టిస్తూనే ఉన్నారు. నూతన గవర్నర్ల నియామకాలు కొత్త వివాదానికి కారణమైనాయి. ఏపీ గవర్నరుగా వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ గతంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా అనేక కీలక కేసుల్లో ఇచ్చిన తీర్పులు మోడీ సర్కారుకు ఎంతో సంతోషం కలిగించడమే ఇందుకు కారణం. వాటిలో అయోధ్య రామమందిరం తీర్పు కీలకమైంది గాని మిగిలినవి కూడా తక్కువ ప్రాధాన్యత గలవికావు. పెద్దనోట్ల రద్దు కేసులో ప్రభుత్వం చేసిందాట్లో తప్పు లేదన్న తీర్పు, విద్వేష ప్రసంగాల వివాదంలో ఇష్టానుసారం మాట్లాడకుండా కట్టడి చేయలేమన్న తీర్పు, కాశ్మీర్ 370వ అధికరణం రద్దు చెల్లుతుందన్నతీర్పు అన్నీ బీజేపీకి ఎంతో ఉత్సాహమిచ్చాయి. ఈ ధర్మాసనాలన్నిటిలోనూ జస్టిస్ నజీర్ భాగస్వామి. ముస్లిం అయినప్పటికీ రామాలయానికి అనుకూలంగా తీర్పు నివ్వడం ఆయన లౌకికస్ఫూర్తికి నిదర్శనమని పెద్దఎత్తున ప్రచారం నడిచింది. ఎవరిమతం ఏమిటన్న మీమాంస కంటే ఎవరు రాజ్యాంగ లౌకిక స్ఫూర్తిని కాపాడేవిధంగా వ్యవహరించా రన్నది ఇక్కడ ముఖ్యంగా చూడాల్సి ఉంటుంది. ఈ తీర్పుపై అనేక భిన్నాభిప్రాయాలు రావడమే గాకుండా సుప్రీం కోర్టులో సవాలు చేయడం గమనించదగింది. ఏమైనా ఈ తీర్పుతర్వాత ఆ ధర్మాసనంలో సభ్యులైన న్యాయమూర్తులందరినీ పదవులు వెతుక్కుంటూ రావడం యాదృచ్ఛికం కాదు. ముందుగా అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. దీనిపై విమర్శలు ఎన్ని వచ్చినా ఆయన బేఖాతర్ చేశారు. ఇటీవలనే ఆయన పనితీరు ఆరాతీస్తే అతి తక్కువగా



పార్లమెంటుకు హాజరులోనూ, చర్చలలోనూ ప్రయివేటు బిల్లులు ప్రతిపాదించడంలోనూ బాగా వెనకబడి ఉన్నారు. అందులోని మరో న్యాయమూర్తి అశోక్ భూషణ్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) చైర్మన్‌గా నియమితు లయ్యారు. ఇది కంపెనీల వ్యవహారాలపై తీర్పులిచ్చే అతి కీలక సంస్థ. ఈ కోవలో ఇప్పుడు జస్టిస్ నజీర్ నియామకం మూడవది.

జస్టిస్ నజీర్ నేపథ్యం

ఏపీ గవర్నరుగా వచ్చిన జస్టిస్ నజీర్ కేవలం ఆ తీర్పు ఇవ్వడమే కాదు. బీజేపీకి అనుకూలమైన లాయర్ల సంస్థ అఖిలభారత అధివక్త పరిషత్(ఎబిఎపి)లో సభ్యులుగా ఉన్నారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ... భారతీయ న్యాయ వ్యవస్థ మనుస్మృతిని ఎప్పుడూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారట. సంఘ్ పరివార్‌కూ మనుధర్మానికి ఉన్న అనుబంధం మనువుతో పాటు కౌటిల్య, కాత్యాయన, బృహస్పతి, నారద, యాజ్ఞవల్క్య వంటి ప్రాచీన పండితుల వారసత్వం కూడా కలుపుకుని మన న్యాయవ్యవస్థను భారతీయం చేయాలని అభిలషించారు! భారతీయ సమాజంలో దొంతరలను నిర్దేశించే నాటి భాష్యాలు ఈ న్యాయమూర్తికి నచ్చడమేమిటి? అయితే ఈయన చాలా నిరాడంబరుడనీ మతాతీతంగా తీర్పునిచ్చాడనీ సిజెఐ

> ఏపీ గవర్నరుగా వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ గతంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా అనేక కీలక కేసుల్లో ఇచ్చిన తీర్పులు మోడీ సర్కారుకు ఎంతో సంతోషం కలిగించడమే ఇందుకు కారణం. వాటిలో అయోధ్య రామమందిరం తీర్పు కీలకమైంది గాని మిగిలినవి కూడా తక్కువ ప్రాధాన్యత గలవికావు. పెద్దనోట్ల రద్దు కేసులో ప్రభుత్వం చేసిందాట్లో తప్పు లేదన్న తీర్పు, విద్వేష ప్రసంగాల వివాదంలో ఇష్టానుసారం మాట్లాడకుండా కట్టడి చేయలేమన్న తీర్పు, కాశ్మీర్ 370వ అధికరణం రద్దు చెల్లుతుందన్నతీర్పు అన్నీ బీజేపీకి ఎంతో ఉత్సాహమిచ్చాయి.

చంద్రచూడ్ కూడా కొనియాడటం విశేషం. గతంలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం గురించీ ఆయన లౌకికతత్వం గురించీ ఇలాంటి కబుర్లే వినేవాళ్లం. వ్యక్తిగతంగా ఎవరు ఎలా ఉంటారనేది ఒకటైతే, ఎవరివైపు ఉంటారు, ఏ విలువలవైపు ఉంటారు, ఏ వృత్తిలో ఉన్నారనేది కూడా కీలకం. ఆ విధంగా చూస్తే అబ్దుల్ నజీర్ కూడా సంఘ్ పరివార్‌కు ప్రీతిపాత్రులైన వ్యక్తిగనకే ఇలాటి తీర్పులు ఇవ్వడం, ఈ పదవులు పొందడం సాధ్యమైందన్నమాట. ఆయనతో పాటు నియమితులైన మరో నలుగురు గవర్నర్లు లక్ష్మి ప్రసాద్ ఆచార్య(సిక్కిం) సిపి రాధాకృష్ణన్(జార్ఖండ్) శివప్రతాప్ శుక్లా (హిమచల్ ప్రదేశ్) గులాబ్ చంద్ కతారియా (అస్సాం) కూడా సంఘ్ నేపథ్యం గలవారే. ఆ మాటకొస్తే ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ అయిన విశ్వభూషణ్ హరిచందన్ అచ్చంగా అదే తరహాలో వారే! గవర్నర్ల అనుచిత ప్రవర్తనలు అప్రజాస్వామిక రాజ్యాంగ విరుద్ధపోకడలకు కారణాలేమిటో దీన్నిబట్టే తెలుస్తోంది. గతంలో ఇందుకోసం కాంగ్రెస్‌ను తిట్టిపోసిన బీజేపీ ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరు అంతకంటే దారుణం. తమాషా ఏమంటే మాజీ న్యాయమూర్తుల నియామకాలు పెరిగిన కొద్ది మాజీ బ్యూరోక్రాట్ల నియామకాలు తగ్గిపోవడం!

కిం కర్తవ్యం?

ఈ పరిస్థితి మారాలంటే ముందు కేంద్రం దృష్టికోణం మారాలి. సర్కారియా సిఫార్సుల ప్రకారం గవర్నర్ల నియామకంపై ముందుగా రాష్ట్రాలను సంప్రదించి నిర్ణయిం చాలి. వారి ముందు ముగ్గురి జాబితా ఉంచి ఎంచుకోవడానికి అవకాశమివ్వాలి. తాజాగా పదవులు నిర్వహించిన వారినీ అప్పుడే రాజకీయ పదవుల నుంచి వచ్చిన వారిని దూరం పెట్టాలి. వివాదాస్పద నేపథ్యం ఉంటే అసలు పరిశీలనకే తీసుకోకూడదు. ఇక న్యాయమూర్తుల వరకూ బాధ్యతల విరమణ తర్వాత రెండేండ్ల విరామం లేకుండా పదవులు ఆమోదించకూడదు. ప్రధాన న్యాయమూర్తుల జాతీయ సభలో దీనిపై కచ్చితమైన నిర్ణయం తీసుకోవాలి. న్యాయవ్యవస్థపై పాలకుల ఒత్తిడి ఒక సవాలైతే వారి ప్రలోభాలను తోసిపుచ్చే నైతికత నిలబెట్టుకోవాలి. అది లోపిస్తున్నందునే సిజెఐ చంద్రచూడ్ న్యాయవ్యవస్థకు అతిపెద్దముప్పు అంతర్గతంగానే ఉత్పన్నమవుతుందని హెచ్చరించాల్సి వచ్చింది. జస్టిస్‌నజీర్ నియామకం దాన్ని మరోసారి గుర్తు చేస్తున్నది.

శివతత్వం

మహాశివరాత్రి... ఉపాసం... జాగారం. గుడిలో లింగంపై పంచామృతాలంటూ పాలు, పెరుగు, తేనే, నెయ్యి, నీళ్లుపోసి కడిగేసే! కడుపు కాల్చుకొని ఉపాసం ఉండబట్టే! నిద్రలేని రాత్రితో జాగారం చేసి, మోక్షాన్ని పొందినట్టు ఫీల్ కాబట్టే!! బాగుంది. ఓసారి రివర్స్ ఇంజినీరింగ్‌లో దీన్ని తిరగేద్దాం?

'మన్ కీ బాత్' అంటూ కడుపులో సల్ల కదలకుండా, వన్ వే ట్రాఫిక్ మాదిరి కూసున్న దగ్గరే నీతుల్ని వల్లిస్తూ భారతీయులు ఎలా ఉండాలో ఆ పెద్దమనిషి చెప్పబట్టే! కోరికలు సంపుకోవాలే...చెప్పింది వినాలే... కాదంటే కృష్ణ జన్మస్థానమే నంటే గమ్మునుండాలే! ఏడాదికోపాలైనా కాయో, పండో తిందామంటే జీఎస్టీ దెబ్బకి ఉపాసమే బెటర్ అనిపించబట్టే! మతరాజ్యం గుర్తుకు రాగానే భవిష్యద్దర్శనంతో జాగారమే మిగిలే!! త్యాగానికి గుర్తుగా త్రివర్ణపతాకంలో స్థానం దక్కించుకున్న 'కాషాయం' చూడగానే శివతత్వం స్థానంలో మూకదాడులు, ఉన్మాద చేష్టలు, కార్పొరేట్ల దోపిడీ, పెరిగిన ధరలు, ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితి గుర్తుకురాబట్టే!! అఘోర ధిక్కార స్వరంతో ప్రజాచైతన్యం పెచ్చరిల్లితే తప్ప... ఈ కషాయ బానిసత్వ బంధన విముక్తి లభించేలా లేదయ్యా.... శివయ్యా..అంతేనంటావా??

-ఎస్.ఎస్.ఆర్.శాస్త్రి

'కారు' బరువెక్కుతుందా?

ఎన్నికల సీజన్ షురువైంది. స్థానిక నాయకుల సామాజిక కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. టికెట్ దక్కించుకునేందుకు నాయకులు అపసోపాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు బీఆర్ఎస్ నాయకుల మధ్య సంభాషణ ఇలా జరిగింది. 'అన్న మీకు టికెట్ వస్తుందంటావా? సీఎం సార్ టికెట్ ఇస్తాడో, లేదో అనే అనుమానం కలుగుతుంది?' అదేంది తమ్మి అట్లా అంటావు? 'నీకు రాకపోతే ఇంకెవ్వరికి వస్తుంది?' ఏమో అన్న సిట్టింగులకు ఇస్తామని సీఎం కేసీఆర్ గారు చెప్పిండు. 'కానీ ఆయనపై ఒత్తిళ్లు తీవ్రంగా ఉన్నాయి.' అదేంది తమ్మి ఆయన సీఎం... ఆయనపై ఏం ఒత్తిడి ఉంటుంది? 'అయ్యో అన్న ఎందుకుండదు.' ప్రతి నియోజకవర్గానికి ఐదారు మంది నాయకులు పోటీకి రెడీ అవుతున్నారు. అన్ని విధాలుగా సిద్ధమవుతున్నారు. సీట్లకు మించి కూర్చోవడంతో కారు బరువెక్కిపోయింది. కారులో ఇర్కటంగా కూర్చోవడంతో టైర్లలో గాలి తగ్గిపోయి బండి ఊగుతుంది. ఎప్పుడు టైర్లు బ్లాస్ట్ అవుతాయో తెలియదు.కారు ఇంజిన్ వేడెక్కి పొగలు కమ్ముతుంది. అంటూ స్థానిక పరిస్థితిని వివరించాడు. సిట్టింగులకు సీట్లు ఇస్తే కొంత మంది కారు దిగిపోయే ప్రమాదం ఉందని చెప్పకనే చెప్పాడు. దిగకపోతే కారుకు ఇబ్బంది కల్గుతుంది. ఈ పరిస్థితుల్లో కారు నుంచి ఒక్కరిద్దరైనా దిగకపోతారా? అనే ఆశతో కొన్ని పార్టీలు గుంటనక్కలా కాచుకుని కూర్చున్నాయి. గులాబీకారులో పోటీ ఎక్కువాయే. టికెట్ వస్తుందో, రాదో ఏమీ అర్థం కావడం తమ్మీ అంటూ సీరియెస్‌గా చర్చించుకున్నారు.

- గుడిగ రఘు



కుల చెదిరింది..!

"నాకేం కాలేదు" అంది అతి పెద్ద సర్కారీ బ్యాంకు!
"నాకూ ఏం కాలేదు!" అంది సర్కారీ ఇన్సూరర్
"నాకు గాయమైందన్నా"డు పే..ద్ద సర్కారీ పెట్టుబడిదారు!
"ఎవడ్రా రాయేసింది?" సర్కారు ప్రశ్న!
"విదేశీ శక్తి!" రాష్ట్రీయ స్వదేశీ సంఘం సమాధానం
"ఎందుకేశాడు?"
ఐదు బిలియన్ డాలర్ల వ్యవస్థను చూడలేక!
అదెప్పుడొస్తుందన్నారు ప్రజలు!
"కుంభమేళా టైమ్‌లో!" అంది సర్కారు.
"ఆహా! దగ్గరకొచ్చేసిందిగా!" ఆనందంతో జనం!
"నో... నో! నెక్స్ట్ కుంభమేళాకి!" కూల్‌గా నిటి ఆయోగ్!
"అయ్యో! 2035 దాకా ఆగాలా?" నిట్టూరుస్తూ.. మళ్ళీ జనమే!
"రాహు, కేతువులు 'సూర్యుణ్ణే'
నోట కరుచుకుంటే ఎలావస్తుంది?" మళ్ళీ సర్కారు ప్రశ్న!

అద్దదిగో..! దూరంగా ఆ గుంపేంట్రా కొత్వాలూ?
ఆ! 2024 దగ్గరికొస్తోంది కదా!
గొర్రెల మందయ్యుంటుంది రాజా!
కాదు, కాదు... అవి చీమలే! సారూ!
ఎర్ర చీమల్రా నాయనా!
బంగారు పుట్ట ధ్వంసమై
కసిగా ఉరికొస్తున్నాయి!

- ఆరెస్బీ

"స్వామీ! శివరాత్రి పర్వదినాన నాదో కోరిక తీర్చరూ!" గోముగా అడిగింది శివుడిని పార్వతి.

"దేవీ! నీవు అంతగా అడగాలా! నీవు కోరుట నేను తీర్చుట అను వేర్వేరు భావనలేల? మనిద్దరం అర్ధనారీశ్వరులము కదా!" అన్నాడు శివుడు.

"అయిననూ నేను అడగాలి! మీరు తీర్చాలి! అప్పుడే నాకు ఆనందము! నా కోరికను తీర్చండి!" అన్నది పార్వతి.

"సరే నీ కోరిక ఏమిటో తెల్పుము!" అన్నాడు శివుడు.

"శివరాత్రి పర్వదినమున మనిద్దరము భూలోక సంచారము చేయుదము! ఇదియే నా కోరిక!" అన్నది పార్వతి.

"తప్పక చేయుదుము! నీ కోరిక తీర్చుటయే నా బాధ్యత." అంటూ శివుడు, పార్వతితో కలసి భూలోక యాత్రకు బయలు దేరారు.

భూలోకంలో శివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అభిషేక ప్రియుడైన శివుడిని ప్రజలు భక్తి భావంతో ఘనంగా అభిషేకిస్తున్నారు! తమ కోరికలు తీర్చాలని మనసులోనే వేడుకుంటున్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కోకోరిక. మరి కొందరు ఒకటి కంటే ఎక్కువ కోరికలే కోరుకుంటున్నారు!

"స్వామీ! వీరి కోరికలు వింటుంటే చాలా తమాషాగా ఉంది. తమ కోరికల్లో పరస్పర విరుద్ధమైన కోరికలు కూడా ఉన్నాయి. ఈ కలియుగంలో నిస్వార్థమైన కోరికలు కోరేవారే కన్పించటం లేదు! నిజమైన భక్తుల కోసం ఎంతో ఎదురు చూడవలసి వస్తున్నది" అన్నది పార్వతి.

శివుడు చిన్నగా నవ్వాడు.

"దేవీ! కోరిక అంటేనే స్వార్థమున్నట్లు! ఇక నిస్వార్థమైన కోరికలు ఎలా ఉండగలవు! భక్తకన్నప్ప, మార్కేండయులతో సహా భక్తాగ్రేసరులు అందరూ ఏదో ఒక విధమైన స్వార్థముతో కోరికలు కోరినవారే కదా!" అన్నాడు శివుడు.

నారదుడి గోడు

శివుడు అలా మాట్లాడుతుండగా పార్వతి కింద భూమిపై చూస్తూ ఆగిపోయింది. శివుడూ ఆగిపోయాడు. ఒక కాషాయ వస్త్రధారిని, మరి కొందరు కాషాయ వస్త్రధారులు చెట్టుకు కట్టేసి కొడుతున్నారు.

"స్వామీ! చెట్టుకి కట్టేసింది మన నారదుడిని. పదండి" అంటూ శివుడితో సహా నారదుడి ముందు మారు వేషాలతో ప్రత్యక్షమయ్యారు.



> నారదుడు అంటే బిబిసినే. బిబిసి లేనప్పడు నారుదుడే వార్తలు అందరికీ చెప్పేవాడంట. బిబిసికి పూర్వరూపమే నారదుడని మా యూనివర్సిటీలో ఎప్పడో చదువుకున్నాము! కొత్త బిబిసిని విడిచిపెట్టలేదు. ఇన్‌కం టాక్స్‌తో దాడి చేయించాము! నిన్ను వదులుతామా? చెప్పు. బిబిసి వద్ద ఎంత జీతం తీసుకుంటున్నావు? అల్రెడీ ఇన్‌కం టాక్స్ శాఖకి ఫోన్ చేశాము!వచ్చేస్తారు! ఈడీకి, సిబిఐకి, ఇంటలిజెన్స్‌శాఖకి అందరికీ చెప్పేశాం! వారంతా వచ్చేలోగా చెప్పావా సరే! లేదా, నీకు పుట్టగతులుండవు!" అన్నారు కాషాయులు.

"ఎందుకు నాయనలారా! అతనిని చెట్టుకు కట్టేసి మరీ కొడుతున్నారు!" అడిగాడు మారువేషంలోని శివుడు.

"ఇతడు భారతదేశాన్ని దెబ్బతీసే కుట్రదారులతో చేయి కలిపి దేశద్రోహానికి పాల్పడుతున్నాడు! అందుకే చెట్టుకి కట్టేసి కొడుతున్నాం!" అన్నారు కొడుతున్నవారు.

"దేశాన్ని కుట్ర చేసే వారితో చేతులు కలిపాడా? ఎవరితో?" అడిగింది పార్వతి.

"బిబిసితో చేతులు కలిపాడు. అది విదేశీ సంస్థ. పైగా మన దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నది. మన ప్రధానికి వ్యతిరేకంగా డాక్యుమెంటరీలు చూపుతున్నది!" ఇతను బిబిసికి చెందినవాడినని తానే అంగీకరించాడు!" అన్నాడు కాషాయ వస్త్రధారులు.

"ఏమయ్యా! నీవు బిబిసిలో ఎప్పటి నుండి పనిచేస్తున్నావు?" నారదుడిని అడిగాడు శివుడు.

"అయ్యో! మహాప్రభూ నేను నారదుడినని చెప్పాను. అంతే!" అన్నాడు నారదుడు గింజుకుంటూ.

నజర్

"అదే! నారదుడు అంటే బిబిసినే. బిబిసి లేనప్పుడు నారుదుడే వార్తలు అందరికీ చెప్పేవాడంట. బిబిసికి పూర్వ రూపమే నారదుడని మా యూనివర్సిటీలో ఎప్పుడో చదువుకున్నాము! కొత్త బిబిసిని విడిచిపెట్టలేదు. ఇన్‌కం టాక్స్‌తో దాడి చేయించాము! నిన్ను వదులుతామా? చెప్పు బిబిసి వద్ద ఎంత జీతం తీసుకుంటున్నావు? అల్రెడీ ఇన్‌కం టాక్స్ శాఖకి ఫోన్ చేశాము!వచ్చేస్తారు! ఈడీకి, సిబిఐకి, ఇంటలిజెన్స్‌శాఖకి అందరికీ చెప్పేశాం! వారంతా వచ్చేలోగా చెప్పావా సరే! లేదా, నీకు పుట్టగతులుండవు!" అన్నారు కాషాయులు.

"అయ్యో! నేను ఎవరి వద్ద పనిచేసేవాడిని కాను! హరినామ స్మరణ చేసేవాడను! నన్ను నమ్మండి!" అన్నాడు.

"హరి పేరు తలిస్తే ఒప్పుకోం! నీవు నిజంగా బిబిసి వద్ద పనిచేయకుంటే నమో! అని స్మరించు! వదిలిపెడ్తాం!" అన్నారు కాషాయులు.

"లేదు! నేను హరినామ స్మరణ దక్క మరొకటి నామస్మరణ చేయనంటే చేయను!" అన్నాడు నారదుడు.

దాంతో నారదుడిని మళ్ళీ కొట్టబోయారు. పార్వతి వారించింది. వాషింగ్టన్ పోస్టు లాంటి పత్రికలు మోడీని పొగిడాయని, అంత గొప్ప నాయకుడే లేడని ప్రకటించాయని మీరు గొప్పగా చెప్పుకున్నారు కదా! అవి కూడా విదేశీ పత్రికా సంస్థలే కాదా! అప్పుడు లేని విదేశీయత ఇప్పుడెందుకు వచ్చింది?" అన్నది.

"ఎందమ్మో! లాజిక్ మాట్లాడుతున్నావు! ఎవరైనా, ఏ సంస్థలైనా ఒకటే నిబంధన! మోడీని మెచ్చుకుంటున్నారా? లేక విమర్శిస్తున్నారా? దాన్ని బట్టే దేశభక్తులా లేక దేశ ద్రోహులా అని నిర్ధారిస్తాము!" అన్నారు కషాయులు.

"అయితే ఈ నారదుడు మోడీని విమర్శించలేదు కదా!" అడిగాడు శివుడు.

"నారదుడంటేనే బిబిసి అని యూనివర్సిటీలో చదివామని చెప్పాము కదా! అదీకాక నమో అనమంటే నారాయణ, నారాయణ అంటున్నాడు. ఇతని దేశద్రోహానికి ఇంతకన్నా సాక్ష్యమేమి కావాలి?" ప్రశ్నించారు కాషాయులు.

"మీరే దేశద్రోహం నేరం మోపుతారు! మీరే దేశద్రోహానికి శిక్షలు విధిస్తారు? ఇదెక్కడి న్యాయమయ్యా! ఈ దేశంలో న్యాయస్థానాలు లేవా?" అడిగాడు శివుడు.

"న్యాయమూర్తుల్లో కూడా కొందరు మేం చెప్పిందే అనటం లేదు! అన్నవారికి తగిన బహుమతులు అందుతూనే ఉన్నాయి." నేరం మోపేదీ, శిక్షలు విధించేదీ మేమే! అయినా అప్పటి నుంచీ ప్రశ్నలు అడుగుతూనే ఉన్నారు! మీరు కూడా బిబిసిలో పని చేస్తున్న విలేకరులా, మీ వద్ద కెమెరాలు, మైక్రో ఫోన్లు ఉన్నాయా? చెప్పండి!" అంటూ మారువేషంలో ఉన్న శివపార్వతులవైపు దూసుకుని వచ్చారు. కాషాయ వస్త్రధారులు!

రాబోయే ప్రమాదాన్ని గుర్తించి, నారదుడితో సహా శివపార్వతుల అదృశ్యమైపోయారు.

- ఉషాకిరణ్

డా. తాళ్లపల్లి యాకమ్మ... అణగారిన వర్గ ధిక్కార స్వరం ఆమె అక్షరం. దోపిడిని నిలదీసి నిగ్గదీస్తుంది ఆమె కలం. దళిత కుటుంబంలో పుట్టి బాల్యం నుండి అంటరానితనాన్ని చాలా దగ్గరగా చూస్తూ పెరిగారు. పాఠశాలలో, కళాశాలలో, సమాజంలో అనేక అసమానతలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. కుటుంబంలోనూ లింగ వివక్షతను, అణచివేతలను ఎదుర్కొంటూ అన్నింటిని అధిగమిస్తూ తనదైన దారిలో సాహితీ పయనం మొదలుపెట్టిన ఆమె పరిచయం నేటి మానవిలో...



ముఖాముఖి

అణగారిన బతుకు వెతలే యాకమ్మ సాహిత్యం

మహబూబాబాద్‌లోని ఊరి చివర కుమ్మురాని దళితవాడలో పుట్టారు యాకమ్మ. తల్లిదండ్రులు తాళ్లపల్లి అబ్బమ్మ, అబ్బయ్య. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అప్పట్లో తండ్రి దొర దగ్గర జీతం ఉండేవాడు. అది ఒక రకంగా వెట్టి చాకిరి లాంటిది. సంవత్సరం మొత్తం పని చేయించుకొని మూడు, నాలుగు బస్తాలు వడ్లు ఇచ్చేవారు. ఆ వెంటనే అప్పిచ్చాం అనే వంకతో ఆ వడ్లను మొత్తం తమ వడ్ల రాశిలో కలుపుకునేవారు. తల్లి పాత కల్లోల దగ్గర కూలి చేసి పిల్లల్ని పోషించేది. పూట గడవని రోజుల్లో కూడా ఆ తల్లిదండ్రుల్ని పిల్లల్ని బడికి మాత్రం కచ్చితంగా పంపించేవారు. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారే అనే బాధ వారిలో అస్సలు కనిపించేది కాదు. పేదరికం ఒకవైపు, అవమానాలు, అణచివేతలు ఒకవైపు, పెత్తందారుల శ్రమదోపిడి మరోవైపున చుట్టుముట్టినా కష్టాలకు దడవకుండా, కన్నీళ్ళకు విరవకుండా ఎంతో ఓర్పుతో ఆ దంపతులు పిల్లల్ని చదివించారు. ఎందుకంటే చదువుంటే పిల్లలు ఆత్మగౌరవంగా బతుకుతారని వారి ఆశ.

భర్తను ఒప్పించి

యాకమ్మ ఒకటవ తరగతి నుండి ఇంటర్ వరకు మహబూబాబాద్‌లోనే విద్యను అభ్యసించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోకి వచ్చిన వెంటనే దగ్గర బంధువైన సోమవరపు వీరస్వామితో పెండ్లి జరిగింది. పెండ్లి తర్వాత భర్తను ఒప్పించి ఆయన సహకారంతో ఉన్నత విద్యకు శ్రీకారం చుట్టారు. డిగ్రీ ఖమ్మంలోని ఉమెన్స్ కాలేజీలో పూర్తి చేశారు. తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు, సంస్కృతం పూర్తి చేశారు. ఆ తర్వాత హనుమకొండలో బీఈడి చేసి, తమిళనాడులోని మదురై కామరాజు విశ్వవిద్యాలయం ఏంఫీల్ చేశారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఆచార్య బన్న ఐలయ్య పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తర్వాత యూజీసీ నెట్, ఏపీ సెట్‌లో ఉత్తీర్ణత పొంది 2001 డీఎస్సీ ద్వారా తెలుగు పండిట్ ఉద్యోగం సాధించారు. వీరికి ఇద్దరు పిల్లలు. కూతురు గాయత్రి ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతుంది. కొడుకు కళ్యాణ్ కుమార్ ఇంటర్ సెకండియర్.



సామాజిక వర్గ గొంతుక

"మనం ఏదైనా రాయాలనుకున్నప్పుడు వాటి గురించి లోతుగా అధ్యయనం చేసి రాయాలి. అప్పుడే అవి సామాజిక పరిణామాలను, చరిత్రను మానవ సంబంధాల్లోని అవకతవకలను కథలుగా చిత్రించగలవు. అలా నా జీవితాన్ని కథలుగా చిత్రించి నా అనుభవాలను కథల్లో చిత్రిస్తూ క్రమక్రమంగా ఎదిగిన పరిణామాన్ని నా రచనల ద్వారా తెలియజేశాను. తెలుగు సాహిత్యంలో వెలుగులోకి రావలసిన, ఎదగాల్సిన, ఎదుగుతున్న తెలంగాణ రచయితలు ఎందరో ఉన్నారు. అలా ఎదుగుతూ వస్తున్న రచయితలలో నేను ఒకదానిగా ఉన్నాను. పిచ్చి చెట్ల మధ్య సుగంధాలు వేద జల్లే పూల చెట్లు మొలిచినట్టు అణగారిన జాతి నుండి అనేకమైన ఒడిదుడుకలను ఎదుర్కొంటూ ఉన్నత విద్యను అభ్యసించాను. నా సామాజిక వర్గ గొంతుకగా, ఓ దళిత ప్రతినిధిగా మా జిల్లా నుండి నా రచనల ద్వారా స్పందిస్తున్నాను. నేను రాసిన, రాస్తున్న కథలు వర్తమాన దళితుల జీవిత నేపథ్యాలను, సంఘర్షణలను, వాటి వెనకాల వెతలను సమాజం ముందు ఉంచుతున్నాను. ఆ నేపథ్యంలో రాసిన మరో కథల సంపుటి 'రక్షణ'. ఈ సంపుటిలో 14 కథలు ఉన్నాయి.

సాహితీ ప్రస్థానం



యాకమ్మ ఎంఫీల్ చేసేటపుడు అలాగే పీహెచ్‌డీ కోసం 'బోయ జంగయ్య సాహిత్య అనుశీలన' అనే పరిశోధనలో భాగంగా బోయ జంగయ్య సాహిత్యంతో పాటు బన్న ఐలయ్య, కాల్వ మల్లయ్య, పెద్దింటి అశోక్ కుమార్, బి.ఎస్ రాములు వంటి ప్రముఖ రచయితల పుస్తకాలు ఎన్నో చదివారు. దీంతో ఆమెకు సాహిత్యంపై మక్కువ పెరిగింది. పీహెచ్‌డీ తర్వాత ఆచార్య బన్న ఐలయ్య "నువ్వు వచనం బాగా రాస్తున్నావమ్మా, కథలు చక్కగా రాయగలవు" అంటూ ఆమెలోని సాహితీ క్షేత్రానికి బీజం వేశారు. ఆయన ప్రోత్సాహంతో కథలు రాయడం మొదలు పెట్టారు. అంతేకాకుండా తాను పనిచేస్తున్న పాఠశాలలో అలిశెట్టి ప్రభాకర్ 'నగర గీతం' కవితను విద్యార్థులకు బోధిస్తూనే ఎంతో స్ఫూర్తి పొందారు. కవిత్వం అంటే కేవలం వర్ణనలు మాత్రమే కాదు బతుకు చిత్రం అనే అవగాహనకు వచ్చారు. అప్పటినుండి సామాజిక అంశాలు, దళిత జీవిత బాధలు, వెతలను కవిత్వంగా రాస్తున్నారు.

మమతల మల్లెలు

మహబూబాద్ జిల్లా సాహితీ శిఖరంలో మొగ్గ తొడిగిన ఏకైక ఉపాధ్యాయ, దళిత రచయిత్రిగా గుర్తింపు పొందారు యాకమ్మ. ఆమె రాసిన మొదటి కథా సంపుటి 'మమతల మల్లెలు'. ఈ సంపుటిలో మొత్తం 11 కథలు ఉన్నాయి. తాను చూసిన, అనుభవించిన, ఎదుర్కొన్న సంఘటనలని కథలుగా మలిచారు. తాను చిన్నతనంలో పెంకి పిల్లగా ఎలా ఉండేదో మమతల మల్లెలు కథలో చూపించారు. తండ్రి ఆమెను ఎంత గారాబంగా పెంచాడో చిత్రించారు. సాధారణంగా అణగారిన ప్రజల జీవితాలను చిత్రించేటప్పుడు తండ్రి తాగుబోతుగా తల్లి మాత్రమే కష్టపడుతూ తమ పిల్లలను పెంచి పోషించినట్టుగా ఎన్నో కథలు చిత్రించారు. కానీ అందుకు భిన్నంగా ఉంటుంది యాకమ్మ రాసిన కథ. చిన్ననాటి పెంకితనాన్నే వయసు పెరుగుతున్న కొద్ది జీవిత సంకల్పాన్ని మొక్కవోని దీక్షగా మలుచు కోవడానికి ప్రయత్నించారు. తనని తాను మలుచుకోవడంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. ఎంతో సహనంతో ఎన్నో అవమానాలను చవి చూశారు.

దళిత అభ్యున్నతికై

దళిత సామాజిక వర్గానికి చెందిన యాకమ్మ బోయ జంగయ్య రచనలు చదవడం, ఆయన స్వయంగా అనుభవించిన పరిస్థితులను అవగతం చేసుకొని ఆమె పరిశోధనలో సాధ్యమైనంత వరకు సమగ్ర విశ్లేషణ చేశారు. బోయ జంగయ్య రచనల నుండి స్ఫూర్తి పొందిన ఈమె కూడా ఏ ప్రక్రియలో రచన చేపట్టినా దళిత చైతన్యం విశ్లేషిస్తూ వారి అభ్యున్నతి లక్ష్యంగా పెట్టుకున్నారు. మూఢనమ్మకాలను వదిలేసిన నాడే దళితులు అభ్యున్నతి సాధించగలరని తన రచనల్లో స్పష్టంగా చెబుతారు యాకమ్మ

అణగారిన జీవితాలే...

కెరటం' ఆమె మొదటి నవల. ఈ నవల అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ వారు నిర్వహించిన పోటీలో 'ఉద్యమ కెరటం' పేరుతో ద్వితీయ బహుమతి పొందింది. అంతే కాదు ఇది తెలంగాణలో దళిత స్త్రీ రాసిన తొలి దళిత నవలగా పేరుపొందింది. ఈ నవలలో ప్రధాన వస్తువు దళితుల జీవితం. ఇందులో ప్రధాన పాత్ర మల్లమ్మ. మాదిగ గూడెంలో కటికదారిద్రాన్ని అనుభవిస్తున్న స్త్రీ. దళితుల అమాయకత్వం, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, ఓర్వలేని తనం మొదలైన అనేక ఇతివృత్తాలను ఈ నవలలో చిత్రించారు. ఈ నవలను పరిశీలిస్తే అణగారిన జీవితాలు, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాల స్థితిగతులు అర్థమవుతాయి. ఇక 'దుఃఖనది' కరోనా కథలు. ఈ కథా సంపుటిలో 12 కథలు ఉన్నాయి. కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడిన వారందరి గురించి ఇందులో చిత్రించారు. అంతేకాకుండా కరోనా సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను కూడా చిత్రించాను. 'మట్టి బంధం' అనే కవితా సంపుటిలో 94 కవితలు ఉన్నాయి. ఇందులో మహిళా సాధికారత, సామాజిక ఆర్థిక నేపథ్యం చిత్రీకరించారు.

పూట గడవని రోజుల్లో కూడా ఆ తల్లిదండ్రుల్ని పిల్లల్ని బడికి మాత్రం కచ్చితంగా పంపించేవారు. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారే అనే బాధ వారిలో అస్సలు కనిపించేది కాదు. పేదరికం ఒకవైపు, అవమానాలు, అణచివేతలు ఒకవైపు, పెత్తందారుల శ్రమదోపిడి మరోవైపున చుట్టుముట్టినా కష్టాలకు దడవకుండా, కన్నీళ్ళకు విరవకుండా ఎంతో ఓర్పుతో ఆ దంపతులు పిల్లల్ని చదివించారు. ఎందుకంటే చదువుంటే పిల్లలు ఆత్మగౌరవంగా బతుకుతారని వారి ఆశ.

లెక్కకు మించిన పురస్కారాలు

యాకమ్మ చేస్తున్న సాహితీ కృషికి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. అందులో మదర్ ఫౌండేషన్ వరంగల్ వారి సేవరత్న జాతీయ అవార్డు, అక్షరాలతోవ ఖమ్మం వారి జాతీయస్థాయి ద్వితీయ బహుమతి, అక్షర శిఖరం, జాతీయస్థాయి ఉత్తమ కవితా పురస్కారం, విశాల సాహిత్య అకాడమీ వారి బిఎస్ రాములు ప్రతిభా పురస్కారం, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 'మమతల మల్లెలు' కథా సంపుటికి డాక్టర్ పుట్ల హేమలత స్మారక పురస్కారం, మాతృభాషా దినోత్సవం సందర్భంగా సాహితీరత్న పురస్కారం, గిడుగు ఫౌండేషన్ హైదరాబాద్ వారి నుండి 'బోయ జంగయ్య సాహిత్య అనుశీలన' పరిశోధన గ్రంథానికి గాను సాహితీసేవ పురస్కారం, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వారిచే ఉత్తమ రచయిత అవార్డు, మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ రచయిత అవార్డు, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ కవిత పురస్కారం ఇలా లెక్కకు మించిన పురస్కారాలు అదుకున్నారు.

– సలీమ

బోయ జంగయ్య సాహిత్య పరిశీలన

వాస్తవ పరిస్థితుల ఆధారంగా సమాజంలో జరుగుతున్న అసమానతలను, పడిపోతున్న మానవతా విలువలకు నా కథలు అద్దం పడతాయి. అణకారిన వర్గాలు విద్యను అభ్యసించడం ఒక ఎత్తు అయితే సృజన రంగాల్లో అడుగుపెట్టడం మరొక ఎత్తు. అలా సాహితీ ప్రపంచంలోకి వచ్చిన గొప్ప రచయిత బోయ జంగయ్య. తన వర్గాల చరిత్రను తానే రాయాలని మౌలికమైన ఆలోచనలు ఆయనలో చెలరేగాయి. అలా రచన వైపు దృష్టిసారించి కవిత్వం, కథలు, నవల బాల సాహిత్యంతో పాటు అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. అలాగే తనకంటే ముందు తరం వారిని ప్రభావితం చేసిన మహానుభావుల జీవిత చరిత్రలు రాసిన అరుదైన దళిత రచయిత బోయ జంగయ్య. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దృక్పథం కలిగి స్వచ్ఛందంగా తన ఆలోచనలను సమాజం ముందు పెట్టిన కవి. స్వతహాగా తన జీవిత సంఘర్షణ నుండి ఎన్నో పాఠాలు నేర్చుకున్న రచయిత. వాటిని ప్రేరణగా తీసుకొని తన రచన సాహిత్యానికి ఎన్నుకున్నారు. జీవిత వాస్తవికత పునాదిగా వచ్చిన వారి రచనలపై నేను రచించిన పరిశోధన గ్రంథమే 'బోయ జంగయ్య సాహిత్య అనుశీలన'.



మాణిక్‌రెడ్డి గెలవాలి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయ ఉద్యమంలో కార్యకర్తగా పనిచేస్తూ, నిబద్ధతతో ఉపాధ్యాయులకు సేవ చేస్తున్న పాపన్నగారి మాణిక్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలవాలని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య ఆకాంక్షించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కార్యదర్శి ఎ సింహాచలంతో కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో చుక్కా రామయ్యను కలిసి పరామర్శించారు. సోమవారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా రామయ్య ఆశీస్సులు కోరారు. శాసన మండలి ఉద్యమ కారులకు వేదిక కావాలనీ, ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అందులోని చర్చలు దోహద పడాలని ఈ సందర్భంగా రామయ్య ఆకాంక్షించారు. అందుకు సరైన వ్యక్తి మాణిక్‌రెడ్డి అని రామయ్య అభిప్రాయపడ్డారు. తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును మాణిక్ రెడ్డికే వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత్‌కు మరో 12 చీతాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. వీటిని మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కుకు హెలికాప్టర్లలో తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లలోకి ఈ చీతాలను మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆ రాష్ట్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్‌లు వదిలారు. దక్షిణాఫ్రికా నుంచి చీతాలతో వచ్చిన విమానం శనివారం ఉదయం 10 గంటలకు గ్వాలియర్ ఏయిర్‌ఫోర్స్ బేస్‌లో ల్యాండ్ అయింది. అనంతరం అక్కడి నుంచి వాటిని హెలికాప్టర్లలో కునో జాతీయ పార్కుకు తరలించారు. చీతాల రాకపట్ల మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెప్పారు.

దళితులపై దాడులు

(మొదటిపేజీ తరువాయి)

పెంచేందుకు ఉపయోగపడుతుందే తప్ప తగ్గించడానికి కాదని పేర్కొన్నారు. నిశితంగా పరిశీలిస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ దాడులు ఎక్కువగా ఉన్నాయని, ఆయా రాష్ట్రాల్లో 2015లో 38,613 కేసులు ఉంటే 2020 నాటికి 50202 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో ఇలాంటి దారుణాలు కొనసాగుతూనే ఉంటాయని, బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఉద్యమంలో బాధితులను కులపుకుని ముందుకు సాగాలని మహాసభ తీర్మానించింది.

అదానీ వ్యవహారంలో ప్రధాని పేరొద్దు

(మొదటిపేజీ తరువాయి)

వార పత్రిక (పాంచజన్య)లో రాసిన 'సంపాదకీయం'లో సుప్రీంకోర్టుపై అనేక విమర్శలు ఎక్కుపెట్టింది. మరోవైపు బీబీసీపై ప్రతీకార దాడులు మొదలయ్యాయి. డాక్యుమెంటరీ విడుదలైన నెలరోజుల్లో ఐటీ దాడులు చోటుచేసుకున్నాయి. పన్ను ఎగవేతలు, ఆర్థిక అక్రమాలపై ఆధారాల్ని సేకరించాలని ఐటీ అధికారులపై పెద్ద ఎత్తున ఒత్తిడి కొనసాగుతోంది. దీనిని ఎలా డీల్ చేయాలో ఐటీ శాఖ ఉన్నతాధికారులకు అర్థం కావటం లేదు. ఇన్నేండ్లుగా బీబీసీపై రాని అనుమానం, లేని అక్రమాలు..ఇప్పుడు కొత్తగా గుర్తించడానికి ఐటీ శాఖ యంత్రాంగం రాత్రిపగలు అన్న తేడా లేకుండా పని చేయాల్సి వస్తోంది. ఏదో ఒక లోపాన్ని, అక్రమాన్ని గుర్తించాలని ఐటీ శాఖపై మోడీ సర్కార్ చేస్తున్న ఒత్తిడి మామూలుగా లేదు. దేశవ్యాప్తంగా పాత్రికేయుల లోకం దీనిపై మాట్లాడుకుంటోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పాత్రికేయులు రాకుండా అడ్డంకులు

భారత్‌లో పనిచేస్తున్న విదేశీ మీడియా ప్రతినిధులపై గతకొన్నాండ్లుగా కేంద్రం పలు ఆంక్షలు విధిస్తోంది. వారి వీసా పేపర్లకు ఆమోదం తెలపటం లేదు. భారత్‌లో పనిచేస్తున్న ఫ్రాన్స్‌కు చెందిన మీడియా కరస్పాండెంట్స్ వీసా పేపర్లను కేంద్రం పక్కనపడేసింది. దాంతో వారు ఇక్కడ ఉండాలో, స్వదేశానికి వెళ్లిపోవాలో ? తెలియని సంకట స్థితిలో ఉండిపోయారు. ఇటీవల అమెరికాకు చెందిన ఒక పాత్రికేయుడు భారత్‌కు రాకుండా కేంద్రం నిరాకరించింది. బ్రిటన్ ప్రభుత్వ మీడియా అయిన 'బీబీసీ'పై ఏకంగా బెదిరింపులకు దిగింది. భారత్‌లో మీడియా స్వేచ్ఛపై ఇంత తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నా, పాశ్చాత్య మీడియా నోరు మెదపటం లేదు.

మీడియా స్వేచ్ఛపై కత్తి

ప్రభుత్వ పెద్దల ఒత్తిడి, బెదిరింపులకు లొంగని వారిని కేంద్రం టార్గెట్ చేస్తోంది. అదానీ అక్రమాలు, బీబీసీ డాక్యుమెంటరీ బయటకు కనిపించే ఉదాహరణలు. ఇలాంటి పరిస్థితి మునుపెన్నడూ లేదని స్వతంత్ర మీడియా పాత్రికేయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్, ప్రింట్, డిజిటల్ మీడియా సంస్థల యాజమాన్యాలు, ఎడిటర్స్..మోడీ సర్కార్‌కు శత్రువులుగా కనిపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంజాయిషీ చెప్పుకునే స్థితిలోకి బీబీసీని నెట్టడం మోడీ సర్కార్ వ్యూహం. తద్వారా దేశంలోని మిగతా మీడియాను కూడా ప్రభావితం చేయాలన్నది ఉద్దేశం. నిధులు అడ్డుకోవటం, పాత్రికేయుల్ని జైలు పాలు చేయటం పెద్ద విషయం కాదని బీజేపీ పెద్దలు బెదిరింపులకు దిగుతున్నారు.

అదానీ కోసం ప్రధాని విదేశీ పర్యటనలు!

(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సిన అవసరమేంటి? అని బంగ్లాదేశ్ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై 2017లో సంతకాలు అయ్యాయి. ఒప్పందం భారంగా మారిందని, ఇందులో మార్పులు చేయాలని బంగ్లాదేశ్ పదే పదే కోరుతోంది. ఈ అంశం భారత్‌పై బంగ్లాదేశ్‌లో వ్యతిరేకతకు దారితీస్తుందని, ఇరు దేశాలకు మంచిది కాదని పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొంతమంది ఎంపీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ప్రధాని మోడీ 2015లో జరిపిన ఢాకా పర్యటనలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కుదిర్చారు. ఒక బడా కార్పొరేట్ కోసం ప్రధాని మోడీ తన శక్తియుక్తులు ఉపయోగించారు. దీనివల్ల పక్క దేశంలో మన గురించి చెడుగా మాట్లాడుకుంటు న్నారు. అదానీ గ్రూప్–బంగ్లాదేశ్ మధ్య కుదిరిన విద్యుత్ ఒప్పందంపై వివరాలు బయటపెట్టండి" అని పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక ఎంపీ విదేశాంగ శాఖకు లేఖ రాశారు.

భారత్‌లోని బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రధాని మోడీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని, వేల కోట్ల కాంట్రాక్ట్‌లు అప్పగించేందుకు ప్రధాని తన రాజకీయ చిత్తశుద్ధిని వెచ్చించారని 'వాషింగ్టన్ పోస్ట్' ఒక వార్తా కథనం ప్రచురించింది. రెండు నెలల క్రితమే ఈ వార్తా కథనం వెలువడింది. ఇందులో అదానీ గ్రూప్–బంగ్లాదేశ్ మధ్య కుదిరిన పీపీఏ (విద్యుత్ కొనుగోలు ఒప్పందం) 163 పేజీల పత్రాల్ని విశ్లేషించింది. ఢాకా పర్యటనలో రూ.14వేల కోట్లకు పైగా విలువజేసే విద్యుత్ కాంట్రాక్ట్ అదానీ గ్రూప్‌నకు ప్రధాని మోడీ ఇప్పించారని ఆరోపించింది. ఈ వార్తా కథనం తర్వాత కొంతమంది లోక్‌సభ ఎంపీలు కేంద్రానికి లేఖలు రాశారు. ఈ ఒప్పందం వివరాలు ఇవ్వాలని కోరారు. హిండెన్‌బర్గ్ నివేదికతో ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందం మళ్లీ తెరపైకి వచ్చింది.

ఒప్పందంపై బంగ్లాదేశ్ పునరాలోచన

బంగ్లాదేశ్ ప్రభుత్వ పెద్దలు విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై పునరాలోచనలో పడ్డారు. అదానీ పవర్ తయారుచేసిన విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఆరోపణలు వెలువడ్డాయి. 'పీపీఏ' (విద్యుత్ కొనుగోలు ఒప్పందం)పై ఆ దేశంలో వ్యతిరేకత కనపడుతోంది. ఒప్పందం ప్రకారం నిర్వహణ, ఇతర ఛార్జీల కింద అదానీ గ్రూప్‌నకు బంగ్లాదేశ్ ప్రతిఏటా 450 మిలియన్ డాలర్లు (రూ.3724 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. ఒక యూనిట్ విద్యుత్ మార్కెట్ ధరకన్నా ఐదు రెట్లు ఎక్కువకు బంగ్లాదేశ్‌కు భారత్ అమ్ముతోందన్న చర్చ సోషల్‌మీడియాలో నెలకొంది. ఈ వ్యవహారం భారత్‌పట్ల తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. అదానీ కోసం ఇదంతా అవసరమా ? అని భారత్‌లోని కొంతమంది ఎంపీలు మోడీ సర్కార్‌ను ప్రశ్నిస్తున్నారు.

వేములవాడలో శివరాత్రి వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)



సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబుతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పట్టు వస్త్రాలు సమర్పించారు.స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున వీఐపీలు రావడంతో సామాన్య సందర్శకులకు ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం దాదాపు గంటపాటు ఆలయంలోనే ఉండటంతో సందర్శకుల లైన్లు ముందుకు కదలలేదు. దీంతో వేకువజాము నుంచి దాదాపు 10 గంటల పాటు లైన్లలో వేచి ఉన్న జనం అసహనం వ్యక్తం చేస్తూ, ఈవో డౌన్ డౌన్, పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సాయంత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ వచ్చిన సమయంలోనూ పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మంది ఆయనతో కలిసి ఆలయం లోపలికి వెళ్లగా జనానికి ఇబ్బందులు తప్పలేదు.

కంటి వెలుగు శిబిరాలకు విశేష స్పందన

- 43.83 లక్షల మందికి కంటి పరీక్షలు
- 8.42 లక్షల మందికి కండ్లద్దాల పంపిణీ
- రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల శాఖ కమిషనర్



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలకు విశేష స్పందన లభిస్తున్నట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నాటికి 43.83 లక్షల మందికి పరీక్షలు నిర్వహించి, వారిలో 8.42 లక్షల మందికి రీడింగ్ కండ్లద్దాలను పంపిణీ చేశారు. 40 ఏండ్లు పైబడిన వారిలో ఎక్కువగా దగ్గరి చూపు కనిపించని వారు శిబిరాలకు వస్తున్నారు. మరోవైపు వైద్యులు రీడింగ్ గ్లాసెస్ ఇవ్వడంతో పాటు ఇతర కంటి సమస్యలతో బాధ పడుతున్న వారికి విటమిన్ ఏ, డీ, బీ కాంప్లెక్స్ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నారు. 50 ఏండ్లు పైబడిన వారిలో ఎక్కువగా మోతబిందు (కాటరాక్ట్) సమస్య ఉన్నట్టు గుర్తించారు. వీరిని శస్త్రచికిత్స చేసుకోవాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారు. తమ వద్దకే కంటి పరీక్షలను తీసుకురావడం పట్ల పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దినసరి కూలీలు, వయస్సు మళ్లిన వారికి ప్రయాస లేకుండా పరీక్షలు చేసి అక్కడే కండ్లద్దాలు ఇచ్చే ఏర్పాటు బాగుందని ప్రశంసిస్తున్నారు. శస్త్రచికిత్సకు అవసరమైన పేర్లను నమోదు చేసుకుంటూ వారిలో మానసిక స్థైర్యాన్ని నింపుతున్నారు. వెలిమనేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్యశిబిరంలో ఎక్కువ మంది కాటరాక్ట్, టెరిజీయం సమస్యతో బాధ పడుతున్నట్టు వారు గుర్తించారు.

మోరీలు తీసేదంతా దళితులే

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

వంశపారంపర్యంగా ఆ పనులే చేసుకుని బతికేలా సమాజం గిరిగీసి వారిని అందులో బంధించేసింది. ఆ పని చేస్తున్నారన్న కనీస సానుభూతి చూపే వారికన్నా ఛీ..ఛీ అంటూ ఈసడించుకుంటూ ముక్కుమూసుకుని పోయేవారే ఎక్కువ. అటు సామాజికంగా, ఇటు పనిపరంగానూ వివక్ష ఎదుర్కొంటూ ఎవ్వరూ చేయలేని పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర సర్కారు ఇస్తున్నది అక్షరాలా రూ.8,500 మాత్రమే. దానికే పెద్ద గొప్పలు చెప్పుకుంటున్నది. ఆ జీతమూ అందుతుందా అంటే అదీ లేదు. దాన్నీ ఇద్దరు, లేదా ముగ్గురు పంచుకోవాల్సి వస్తుండటంతో కార్మికుల చేతికి నాలుగైదు వేల రూపాయలకు మించి అందట్లేదు. అందులోనూ మూడు నాలుగు నెలలకోసారి, కొన్ని మండలాల్లో ఆరేడు నెలలకోసారి ఇస్తున్న దౌర్భాగ్య పరిస్థితి.తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామపంచాయతీ కార్మికుల పిల్లలు మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్నారు. కూలినాలి చేసుకుని బతుకుతున్నారు. గ్రామాల్లో మోరీలు తీసేవారిలో పురుషుల్లో ఎక్కువగా ముసలివారు, స్త్రీలల్లో ఒంటరి మహిళలే నూటికి 99 శాతం కనిపిస్తున్నారు. ఒంటరి మహిళల భర్తలు గతంలో ఇదే పనిచేసేవారు. వారు చనిపోవడంతో భర్తల స్థానంలో విధిగా ఆ పనిచేయాల్సిన దౌర్భాగ్య స్థితికి వారు నెట్టివేయబడుతున్నారు. మోరీల్లో నుంచి పేరుకుపోయి చెత్త, ఇసుక, రోతను ఎత్తివేసే క్రమంలో వారు ఎక్కువ అంటువ్యాధులకు గురవుతున్నారు. వారికి వైద్యం చేయించుకునేందుకు చేతిలో డబ్బుల్లేక, ఈఎస్ఐ లేక ఆ రోగాలతోనే కుంగికృశించి చనిపోతున్నారు. పనిచేసే ఒంటరి మహిళల్లో 30 ఏండ్ల వారు కూడా కనిపించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నియోజకవర్గంలోని కొన్ని ఊర్లలో శవాలమీద పేలాలు ఏరుకుని తిన్నట్టుగా గ్రామపంచాయతీ కార్మికుల నుంచి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు. 'మేం పెట్టిచ్చినం. నెలకు ఇంత ఇస్తే ఉంచుతాం. లేకుంటే పనిచేస్తలేరని పీకేస్తం' అంటూ సర్పంచులు బెదిరిస్తున్నారని ఓ మహిళా పారిశుధ్య కార్మికురాలు వాపోయింది. అదే సమయంలో జీతాలు రాకుండా ఇబ్బంది పడుతున్న కార్మికులకు వారి కుటుంబాలు నడిచేలా సర్పంచులు ఎంతో కొంత ఇచ్చి జీతాలు పడ్డాక తీసుకుంటున్న పరిస్థితి కూడా క్షేత్రస్థాయిలో ఉంది. పాలకుర్తి నియోజకవర్గంలో నాలుగు నుంచి 8 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాల్లేక కార్మికులు అప్పులు చేసుకుని బతుకుతున్నారు. మంత్రి నియోజకవర్గంలోని ధర్మపురం గ్రామంలోని ఇద్దరు గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలు మొదటి నుంచీ కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉంటూ వస్తున్నాయి. అక్కడ టీఆర్ఎస్ సర్పంచి గెలిచాక ఇద్దర్నీ తీసేసి తమకు అనుకూలంగా ఉన్నవారిని పెట్టుకున్నారు. వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా విధుల్లోకి మాత్రం తీసుకోలేదు. ఇవేకాదు..ఏ పంచాయతీ కార్మికుడ్ని కదిలించినా ఒకొక్కరిది ఒక్కో గాథ. అయినా, వారు తమ సమస్యలు చెప్పడానికి భయపడుతున్నారు. దీనికి కారణం మల్టీపర్పస్ బాండ్ పేపరు రాయించుకోవడమే. తాము చెప్పినట్టు ఉంటేనే పనిలో కొనసాగనిస్తాం. లేకుంటే తీసేస్తాం అనే బెదింపు ధోరణి క్షేత్రస్థాయిలో ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో సర్పంచ్‌లకు భయపడి వారి వ్యవసాయ పనులు, ఇంటి పనులు కూడా చేస్తున్నారు. ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్లు నిరంతరం విధుల్లో ఉండాలి. వారి రక్షణ కోసం సర్కారు ఏ ఒక్కటీ చేయడం లేదు. ఉదయం 6 గంటల నుంచి 10, 10:30 వరకు– మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదారు గంటల దాకా ఎవ్వరూ చేయలేని పనిని చేస్తున్న వారికి కనీసం ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కూడా లేవు. రోగమొచ్చినా, నొప్పొచ్చినా సొంతపైసలు పెట్టుకుని చూపించుకోవాల్సిందే. కారోబారు, బిల్ కలెక్టర్లు సైతం చాలా అవమాన భారంతో పనిచేస్తున్నారు. వారే ట్రాక్టర్లు నడుపుతున్నారు. లైట్లు వేస్తున్నారు. కొన్నిచోట్లనైతే మోర్లలో మట్టికూడా తీస్తున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల నాలుగైదు పనులు చెప్పి టార్గెట్లు పూర్తిచేయలేదని వేధిస్తున్నారు.

'మాకు జీతం పెంచితేనే మంచిది బిడ్డా'

'గీ పనిజేస్కుంట ఉన్ననాడు తింటున్నం. లేనినాడు ఉపాసంతోని పండుతున్నం. ఉప్పుపప్పులు, బియ్యం మస్తు పిరమాయే. నాలుగైదు వేలు బతుకుతందుకు ఎట్ల సరిపోతయి కొడకా? అదీ మూడు నాలుగు నెలల కోసారి ఇస్తున్రు. మేంగాబట్టి జేస్తున్నంగానీ ఈ రోత పని లక్ష రూపాయలిచ్చినా ఎవ్వరు చేయరుబిడ్డ. మాకు జీతం పెంచితేనే మంచిది బిడ్డా' అని జనగామ జిల్లా, మండల కేంద్రానికి చెందిన ఓ పంచాయతీ కార్మికురాలు అన్నది. 'పొద్దుగాల కోడికూసే జాముకే లేచి పొరుకా, పార పట్టుకుని బోతం. ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లల బాగోలును పట్టించుకుంటలేం. వాళ్లు చదువుసంధ్యలేక మాలెక్కనే తయారైతున్నరు' అంటూ తరిగొప్పుల మండలానికి చెందిన మరో మహిళకార్మికురాలు వాపోయింది.

మమ్ముల్ని రాచిరంపాన పెడ్తరు...

"పేర్లు చెప్పండమ్మా... మీ ఫొటోలు తీసుకుని వార్త రాస్తామమ్మా..."అంటే.. 'వద్దు బిడ్డా. మీరు పోయినంక మమ్ముల్ని రాచిరంపాన పెడ్తరు. ఏందమ్మో ఎక్కువైందా అంటూ ఎచ్చిడిజేస్తరు. పగబడుతరు. ఈపాటి బతుకుదెరువు కూడా లేకుండ జేస్తరు' అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గానికి చెందిన 60 ఏండ్ల మహిళా పంచాయతీ కార్మికురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

వినికిడి లోపం ఉన్న వారికి సేవ చేయడం గొప్ప విషయం



ప్రముఖగాయని చిత్ర

నవతెలంగాణ- సరూర్‌నగర్

వినికిడి లోపం ఉన్న వారికి సేవ చేయడం గొప్ప విషయం అని ప్రముఖ గాయని చిత్ర అన్నారు. ఆన్వీ హియరింగ్ సొల్యూషన్స్ తన 9వ వార్షికోత్సవం సందర్భంగా సిగ్నియా ఎక్స్‌క్లూజివ్ సెంటర్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మానవ శరీరంలో ప్రతి భాగం ఎంతో ముఖ్యమైందని అన్నారు. శరీరంలో ఏ భాగం ఇబ్బందులు తలెత్తినా ఏదో ఒక రూపంలో ప్రమాదం ఉంటుందన్నారు. ముఖ్యంగా వినికిడి లోపం ఉంటే మనం ఎవరితోనూ సరిగా మాట్లాడలేకుండా ఉంటామని ఆ బాధ వర్ణనాతీతమన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో దుస్తులు పంపిణీ

నవతెలంగాణ - సరూర్‌నగర్

సీఎం కేసీఆర్ జన్మదినంను పురస్కరించుకొని సరూర్ నగర్‌లోని ఆరాధన, కౌసల్య ఫౌండేషన్ అనాథాశ్రమం లలో వందమందికి భోజనం, దుస్తులను హ్యూమన్ రైట్స్ ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు ఇలాంటి ఎన్నో పథకాలు తీసుకొచ్చి పేదవారిని ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దే అన్నారు.



కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించి బాల బాలికలకు దుస్తులు పంచారు. వీధుల్లో ఉన్న అనాథలకు దుస్తులు పంచారు.

ఆ కాల్స్‌తో జాగ్రత్త!



- **వీడియోస్‌ను వాట్సాప్ కాల్‌లో చూపిస్తూ మాయ చేస్తున్న నేరస్తులు**
- **పరువుపోతుందని లక్షల్లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్న బాధితులు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొందరు సైబర్ నేరస్తులు అమ్మాయిలతో కలిసి అమాయకులకు గాలం వేస్తున్నారు. ర్యాండంగా సెల్‌ఫోన్లకు ఓ మెసేజ్ పంపిస్తున్నారు. స్పందించిన వారితో అమ్మాయి మాట్లాడుతోంది. మీరు చాటింగ్‌లోకి రండి అంటూ చెపుతోంది. ఆ తర్వాత నగ్నంగా వీడియో కాల్‌లో మాట్లాడుతోంది. బాధితుడిని కూడా నగ్నంగా వీడియో కాల్ చేయాలని చెపుతారు. ఆ తర్వాత నీ వీడియో అంతా రికార్డు అయ్యింది. దానిని సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు దిగుతారు. ఆందోళనలకు గురవుతున్న బాధితులు వారు అడిగినంత డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇదే తరహాలో అమాయకులు ఇలాంటి ముఠాల బారిన పడి లక్షలు పోగుట్టుకుంటున్నారు.

బెదిరింపులు... లక్షల్లో వసూళ్లు

సులువుగా డబ్బులు సంపాదించాలని సైబర్ నేరస్తులు రోజుకో కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. కొందరు 'హనీ ట్రాప్' చేస్తుంటే మరికొందరు పెండ్లీలు, ప్రేమ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు నగ్న వీడియోకాల్స్‌తో అందినకాడికి దోచుకుంటున్నారు. ఆ సమయంలో బాధితులు ఏం చేస్తున్నారో తెలియని అయోమయంతో వారు చెప్పినట్టు చేస్తున్నారు. ఇదే తరహాలో ఓ అమ్మాయి పేరుతో వచ్చిన ఒక మెసేజ్‌కు స్పందించిన ఓ ఉద్యోగి, న్యూడ్ వీడియో కాల్ బారిన పడి బ్లాక్ మెయిలింగ్‌తో రూ.5లక్షలు పోగొట్టుకున్నాడు. ముందుగా ఆ యువతి మెసేజ్ చేసింది. కొద్దిసేపు చాటింగ్ చేసిన తర్వాత నగ్నంగా వీడియో కాల్ చేసింది. అతన్ని అలానే చేయమని చెప్పింది. ఆ తర్వాత ఆ వీడియోలు రికార్డు చేసి పంపించడంతో బాధితుడు ఆందోళనకు గురయ్యాడు. దశలవారీగా దాదాపు రూ.5లక్షల వరకు వారికి ట్రాన్సఫర్ చేశాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

పక్కా ప్లాన్ : వీడియోకాల్స్ ముఠాలు వేస్తున్న వలలో ఎంతో మంది అమాయకులు చిక్కుకుంటున్నారు. కొందరు బాధితులు పరువు పోతుందని వారు అడిగినంత డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. మరికొందరు డబ్బులు చెల్లించలేక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల న్యూడ్ కాల్స్ ఫిర్యాదుదారులు ఇచ్చిన ఆధారాలు, వీడియోలను సైబర్ క్రైమ్ పోలీసులు పరిశీలించారు. అయితే ఈ ముఠాలు పోర్న్‌సైట్స్‌లోని వీడియోలతో మోసం చేస్తున్నట్టు గుర్తించారు. దాదాపు అన్ని వీడియోలు ఇలాంటివే ఉన్నాయని హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు తేల్చారు. ఈ ముఠాలు పక్కా ప్లాన్‌తో ఇదంతా చేస్తోందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ముందుగా ఒక ఫోన్‌లో పోర్న్ సైట్స్‌లో ఉండే అమ్మాయిల న్యూడ్ షో వీడియోలు ఓపెన్ చేసి ఉంచుతున్నారు. ఆ తర్వాత వారు టార్గెట్ చేసుకున్నవారికి మరో ఫోన్ నుండి వాట్సాప్ కాల్ చేసి ఎదుటివాళ్ళు ఫోన్ ఎత్తగానే మరో ఫోన్‌లో కనిపిస్తున్న న్యూడ్ షో వీడియోను చూపిస్తూ వాట్సాప్ కాల్‌ను రికార్డు చేస్తున్నారని తేల్చారు. అయితే చూడటానికి అది ఒక అమ్మాయి న్యూడ్ కాల్ చేసి కవ్విస్తున్నట్లుగా అనిపించేలా ఈ ముఠాలు జాగ్రత్త పడుతున్నారని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. వాళ్ళు రికార్డు చేసిన వీడియోలను బాధితులకు పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఆ వీడియోస్‌లో కాల్ చేసిన అమ్మాయి మాట్లాడుతున్నట్టుగా ఉన్న ఆడియో లిప్ మూమెంట్ ఎక్కడా మ్యాచ్ కావట్లేదన్నారు. వీడియో కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల కాల్స్‌కు సమాధానం ఇవ్వొద్దని సైబర్ క్రైమ్ ఏసీపీ ప్రసాద్ తెలిపారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ - సరూర్‌నగర్

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో సీఎం కోహినూర్ కప్ ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్-2023 ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మెన్ వేణుగోపాల చారితోముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్పోర్ట్స్‌కి, క్రీడాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో, నియోజక వర్గాల్లో స్పోర్ట్స్ స్టేడియంలు కూడా నిర్మిస్తున్నారని అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా ఇస్తున్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. క్రీడాకారులు మంచిగా క్రీడలలో రాణించి జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి, దేశానికి తెలంగాణ రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ కె స్పోర్ట్స్ ఇండియాతో కలిసి ఈనెల 18 నుండి 20 వరకు ఛాంపియన్‌షిప్- 2023 నిర్వహించనున్నారు. ఈ ఛాంపియన్ షిప్‌లో 5 దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వివిధ రాష్ట్రాలు, జిల్లాల క్రీడాకారులు, 200 మెంబెర్లు పోటీపడుతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఈ డబ్ల్యూ ఐడిసి చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్, ప్రెసిడెంట్ రవి నాయక్, మహేష్, గణేష్, స్పోర్ట్స్ నిర్వహకులు, మరియు వివిధ రాష్ట్రాలు, జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాజానికి మనం ఏం ఇచ్చాం అనేదే ముఖ్యం



- **యాదాద్రి భువనగిరి కలెక్టర్ పమేలా సత్పతి**

నవతెలంగాణ-సరూర్‌నగర్

సమాజం మనకు ఏమి ఇచ్చింది అనేది ముఖ్యం కాదు, మనం సమాజంకి ఏమి ఇచ్చామనేది ముఖ్యమని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం ఆర్కే పురంలోని బాబు జగ్జీవన్‌రావు భవనంలో పీపుల్ ఫర్ ఇండియా ఐదవ వార్షికోత్సవంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాంపిటీషన్ 2023ని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సత్పతి, యాదాద్రి భువనగిరి జిల్లా అడిషన్ కలెక్టర్ దీపక్, యాదాద్రి డీఈఓ నారాయణరెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోబోటిక్ కాంపిటీషన్ పోటీలు భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. భువనగిరి జిల్లాలో పీఎఫ్ఐ తరపున ఏర్పాటు చేసిన 198 మొబైల్ లైబ్రరీలు విద్యార్థులలో పుస్తక పఠనాన్ని అలవర్చుకు నేందుకు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు.

అనంతరం పీపుల్ ఫర్ ఇండియా ప్రెసిడెంట్ సూరజ్ మాట్లాడుతూ ఐదవసారి రాష్ట్ర మొత్తం మీద 350 స్కూల్స్‌లో కాంపిటీషన్స్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు అయిన కిచెన్ షెడ్, కంప్యూటర్స్, స్మార్ట్ టీవీస్, ప్రింటర్స్, సౌండ్ బాక్స్ లాంటి వస్తువులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గారేపల్లి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్యాన్ని, మూఢత్వాన్ని ప్రతిఘటించడమే భాగ్యరెడ్డి వర్మకు నివాళి

మనువాదాన్ని మట్టుబెట్టే ఉద్యమాలు ఉధృతం చేయాలి

స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర నాయకులు ఎ.విజయ్ కుమార్



నవతెలంగాణ-తుర్కయాంజల్

మనువాదాన్ని ప్రతిఘటించడం ద్వారానే మహనీయుల లక్ష్యాలు సాధించుకోవాలని సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ చూపిన బాటలో మూఢనమ్మకాలను పారద్రోలే కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర నాయకులు ఎ.విజయ్ కుమార్ అన్నారు. శనివారం భాగ్యోదయం పేరుతో 10వ తరగతి పాఠ్యపుస్తకంలోని భాగ్యరెడ్డి వర్మ జీవిత పాఠం బహిరంగ బోధన కార్యక్రమాన్ని స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కోటగిరి దళిత టీచర్ మల్లికార్జున్‌పై పెట్టిన కేసుల్లో భాగ్యారెడ్డి వర్మ పాఠం బోధించారనేది కూడా ఒక కారణమన్నారు. అందుకే రాష్ట్రమంతటా ఈ పాఠం బహిరంగ బోధన జరుపుతున్నట్లు చెప్పారు.

భారతీయ పౌరులందరు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు భాగ్యరెడ్డివర్మ మూఢనమ్మకాలు, జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు పోరాడారని చెప్పారు. కేంద్ర బీజేపీ అధికార అండదండలతో మతోన్మాద సంస్థలు రెచ్చిపోయి భౌతిక దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు. హమారా ప్రసాద్ వంటి మతోన్మాది అంబేద్కర్‌ను కాల్చి చంపుతామనడం బీజేపీ ఇచ్చిన ధైర్యమేనని చెప్పారు. అభ్యుదయ శక్తులు ఐక్యంగా మనుస్మృతి భావాలను తుదముట్టించి రాజ్యాంగాన్ని మతోన్మాద దుండగుల నుండి రక్షించాలన్నారు. ఈ కార్యక్రములో సీపీఐ(ఎం) మున్సిపల్ నాయకులు తులసిగారి నర్సింహ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లూరి భాస్కర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, శ్రీకాంత్, అంబేద్కర్ సంఘం నాయకులు వెంకటేష్, డివైఎఫ్ఐ నాయకులు భాస్కర్, గణేష్ కెవిపిఎస్ మలాద్రి, అదం రాజు, వినయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీ.ఎస్.ఐ వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-నాగోల్

16వ తేదీ నుండి రెండు రోజులపాటు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జీ.ఎస్.ఐ జాతీయ 2023 36వ వాలీబాల్ మీట్‌లో పాల్గొన్న విజేతలకు శుక్రవారం బండ్లగూడలోని జీఎస్ఐ శిక్షణ సంస్థలోని ఆడిటోరియంలో బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు డైరెక్టర్ జనరల్, ట్రైనింగ్ మేనేజర్ ఎంఎం పోవార్ పాల్గొని ప్రసంగిస్తూ వార్షిక క్రీడల నిర్వహణకు కేవలం లక్షల్లో నిధులనే మాత్రమే కేటాయించడం పట్ల వాటి నిర్వహణ బాధ్యత భారంగా ఉందని, నిధుల పెంపునకు తగిన ప్రతిపాదన ప్రభుత్వానికి పంపించి జీఎస్ఐలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్నో ఏళ్ల తరబడి నిలిచిపోయిన క్రీడల కోట కింద ఉద్యోగాల భర్తీకి కూడా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖతో చర్చించి త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. దక్షిణ భారత విభాగం ప్రాంతీయ కార్యాలయం అదనపు జనరల్ జనార్ధనప్రసాద్ మాట్లాడుతూ జరగబోయే వాలీబాల్ పోటీలను నిర్వహించేందుకు క్రీడా సముదాయాన్ని జీఎస్ఐలోనే నిర్మిస్తామని ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ బాధ్యత తనకు లభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. వాలీబాల్ క్రీడల్లో ఉత్తమ ప్రదర్శనతోపాటు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న జీఎస్ఐ ఉద్యోగి సీ హెచ్ రవికుమార్‌కు ప్రత్యేక బహుమతులను అందజేసి సన్మానించారు. విజేతగా సెంట్రల్ రీజియన్ నాగపూర్, రన్నర్‌గా సదరన్ రీజియన్ హైదరాబాద్ జట్లు నిలిచాయి. వీరికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏడీజీలు, డీడీజీలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.హెచ్.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ అజయ్ కుమార్‌తోపాటు అధికారులు, డైరెక్టర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 21వ వార్డు వాది హే ముస్తఫా కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం కౌన్సిలర్ల షేక్ వహీద అఫ్జల్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 21,22వార్డులలో పూర్తిగా ముస్లిం మైనార్టీల ప్రజలు నివాసం ఉంటున్నారని ఆ కాలనీలు వాది హే ముస్తఫా, వాది హే హుడా కాలనీలు ఏర్పడి ఎన్నో ఎండ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ముఖ్యంగా కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ, బీటి రోడ్లు లేక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉందన్నారు. ప్రజలకు మౌలిక



సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై సన్‌డే సందడి




నవతెలంగాణ-సిటీబ్యూరో

సరికొత్త ఆటవిడుపులతో ట్యాంక్‌బండ్‌పై ఆదివారం 'సన్‌డే ఫన్‌డే' నిర్వహిస్తున్నారు. కొద్ది నెలల క్రితం ట్యాంక్ బండ్‌పై 'సన్‌డే ఫన్ డే' కార్యక్రమాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఫార్ములా ఈ రేసింగ్ కారణంగా గత కొన్ని వారాల నుంచి సండే ఫన్‌డే కార్యక్రమాన్ని నిలిపివేశారు. తాజాగా సండే ఫన్‌డే పునఃప్రారంభం నేపథ్యంలో 19 ఆదివారం సాయంత్రం ట్యాంక్ బండ్‌పై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ట్యాంక్ బండ్ సందర్శకుల కోసం పరిసర ప్రాంతాల్లో 4 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున నగరవాసులు పిల్లాపాపలతో తరలిరానున్నారు. దాంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఇకపై ప్రతి ఆదివారం సాయంత్రం సండే ఫన్‌డే కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ముగ్గురు ఏసీపీలకు సన్మానం







నవతెలంగాణ-సంతోష్‌నగర్

సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆల్ జోన్ జనరల్ సెక్రెటరీ కిషన్ శర్మ ఆధ్వర్యంలో మలక్‌పేట ఏసీపీ జి.శ్యాంసుందర్, మీర్ చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ కె.శ్రీనివాసరావు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను సౌత్ జోన్ అధ్యక్షులు గజవుద్దీన్, ఈస్ట్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ తోష్ణివాల్, సౌత్ జోన్ సెక్రెటరీ అబ్దుల్ మోహిజ్, గోపాల్ దాస్, గోపాల్‌శర్మ కమిటీ సభ్యులు శనివారం స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి పలు పోలీస్ స్టేషన్ పరిధిలో శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ, మిఠాయిలు పంచుతూ శాలువతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఏసీపీలు మాట్లాడుతూ.. సమాజ సేవలో యువత ముందుండాలన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలన్నారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సూచించారు.

పీస్ కమిటీ సభ్యులు ఎల్లవేళలా ఉంటుందన్నారు ఐక్యతగా సమాజ సేవలో ముందుకు రావాలని అధ్యక్షులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'పేదలను మానవతా హృదయంతో ఆదుకోవాలి'

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమాజంలో ఉన్న పేద ప్రజలను, ఆపదలో ఉన్న వారిని మానవత హృదయంతో ఆదుకున్నవారే దేవునితో సమానమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంగటి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల సుదర్శన్ అనారోగ్యం బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్జరీ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్ఓసిని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహాయ సహకారంతో రూ.1లక్ష రూపాయల ఎల్ఓసిని మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆదేశం మేరకు బాలాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్ళెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాసరెడ్డి, జూకంటి సురేష్ గౌడ్ మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివలు ఎల్ఓసి పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి సీఎం సహాయ నిధి పథకం నుండి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం మంత్రి సబితా ఇంద్రారెడ్డి సైతం ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. అందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల పాలిట ఆపన్న హస్తంగా మారింది ఆపదలో ఆదుకున్నవాళ్లే దేవుళ్ళుగా అభివర్ణించారు.



వీరన్నగుట్ట ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హయత్‌నగర్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్ట దేవాలయాన్ని, చుట్టుపక్కల ప్రాంతాన్ని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పర్యవేక్షించారు. తొలుత రామలింగేశ్వర స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం వీరన్నగుట్ట చుట్టుపక్కల ఉన్న ప్రాంత కాలనీ ప్రజలతో మాట్లాడారు. వీరన్నగుట్ట ప్రాంగణం అభివృద్ధి కోసం దాదాపు 13 కోట్లు మంజూరు చేయించానని, అందులో భాగంగా వీరన్నగుట్ట చుట్టూముట్టు ప్రహరీ గోడ నిమిత్తం మొదటి విడతగా 1 కోటి 60 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని, ఎమ్మెల్సీ కోడ్ దృష్ట్యా అభివృద్ధి పనులు ఆపాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి వీరన్నగుట్ట ప్రాంతం అభివృద్ధికి గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాను అని తెలిపారు. గుట్ట అభివృద్ధిలో స్థానిక కాలనీల ప్రజలు భాగస్వామ్యులు కావాలి అని కోరారు. రాబోయే రెండు సంవత్సరాలలో గుట్ట పరిసర ప్రాంతాలన్నీ సుందరీకరణ చేసి ఆహ్లాదకరంగా నిర్మించుకోవడానికి ప్రతి ఒక్క కాలనీలోని ప్రతి ఒక్క సభ్యుడు తన వంతు ఉడతా భక్తి సహాయం అందించడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. గుట్ట అభివృద్ధి కోసం హెచ్ఎండిఏ నుంచి దాదాపు 13 కోట్లు నిధులు సమకూర్చిన విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. నేను వాగ్దానం చేశాను అంటే ఒక రోజు అటు ఇటు అవ్వొచ్చు, కానీ ఖచ్చితంగా వాగ్దానం నెరవేరుస్తాను హామీ ఇచ్చారు. పని చేసే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా, ధైర్యంగా వాటిని ఎదుర్కొంటూ నా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో నా పాత్ర ఎప్పటికీ ఉంటుందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చెయ్యాలని, ప్రతీ విషయాన్ని రాజకీయం చేస్తూ ప్రజల మధ్యన చిచ్చు రాజేయడం తగదని ప్రతిపక్షాలకు హితవు పలికారు. ఇకనైనా ప్రతిపక్షాలు గ్రహించి అభివృద్ధి కోసం పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మహిళా అధ్యకురాలు కోసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, నరహరి శెట్టి శ్రీనివాస్, కెకెఎల్ గౌడ్, కడమంచి ఆనంద్, చంద్రారెడ్డి, చుట్టుపక్కల పలు అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణికి ఉప్పల్ ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కృష్ణవేణి పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి కృష్ణవేణిని శాలువాతో సత్కరించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన పాల్ రెడ్డి, నాయకులు గంప కృష్ణ, లవణం ఉపేందర్, సారా వినోద్, శ్యామ్, రాకేష్, మల్లా రెడ్డి, నవీన్ గౌడ్, చంద్ర శేఖర్, భారతి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పనుల పరిశీలన

నవతెలంగాణ-బంజారాహిల్స్

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జాగారం చేసి భక్తులనూ దృష్టిలో ఉంచుకుని తిరుమల తిరుపతి దేవస్థానంను సందర్శించే, నేటి నుండి జరగబోయే బ్రహ్మోత్సవాల పనులను జూబ్లీహిల్స్ కార్పొరేటర్ డి.వెల్దండ వెంకటేష్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు కె.వెంకట్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, కె.బోజిరెడ్డి, కమిటీ మెంబర్, నిరంజన్, దేవస్థానం ఇన్‌చార్జి, జీహెచ్ఎంసీ అధికారులు శానప్ప, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కీసర గుట్టకు భక్తుల తాకిడి

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- జాతర ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట పరసర ప్రాంతం భక్తులతో కిటకిటలాడిపోయింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయం నుంచే ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు.





కన్నుల పండువగా శ్రీ భవాని శివదుర్గ శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణం..

శ్రీ భవాని శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ప్రభుత్వ పరంగా స్వామివారికి పట్టు వస్త్రాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అందజేశారు. కళ్యాణ మహోత్సవంలో ఆలయా చైర్మెన్ తటాకం రమేష్ శర్మ, ఈఓ సూధాకర్ రెడ్డి ,అధికారులు పాల్గొన్నారు.

స్వామివారి సేవలో ప్రముఖులు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామివారిని పలువురు రాజకీయ, ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి, ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భార్య కావ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.





ఆధిపత్యం, మూఢత్వాన్ని ప్రతిఘటించడమే భాగ్యరెడ్డికి నివాళి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ-కాప్రా

అన్ని రకాల అధిపత్యాలను, మనువాదాన్ని ప్రతిఘటించడం ద్వారా మహనీయుల లక్ష్యాలు సాధించుకోవాలని సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ చూపిన మూఢనమ్మకాలను పారద్రోలే కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ కొల జనార్దన్ అన్నారు. శనివారం భాగ్యోదయం పేరుతో 10వ తరగతి టెక్స్ట్ బుక్‌లోని భాగ్యరెడ్డి వర్మ జీవిత పాఠం బహిరంగ బోధన కార్యక్రమాన్ని స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కోటగిరి దళిత టీచర్ మల్లికార్జున్‌పై పెట్టిన కేసుల్లో ఈ పాఠం బోధించారనేది కూడా ఒక కారణమన్నారు. అందుకే రాష్ట్రమంతటా ఈ పాఠం బహిరంగ బోధన జరుపుతున్నట్టు చెప్పారు. భారతీయ పౌరులందరూ శాస్త్రీయ దృక్పధం కలిగి ఉండాలన్నారు. భాగ్యరెడ్డి వర్మ మూఢనమ్మకాలు జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు పోరాడారని చెప్పారు. కేంద్ర బీజేపీ అధికార అండదండలతో మతోన్మాద సంస్థలు రెచ్చి పోయి భౌతిక దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు. హమారా ప్రసాద్ వంటి మతోన్మాది అంబేద్కర్‌ను కాల్చి చంపుతామనడం బీజేపీ ఇచ్చిన ధైర్యమేనని చెప్పారు. అభ్యుదయ శక్తులు ఐక్యంగా మనుస్మృతి భావాలను తుద ముట్టించి రాజ్యాంగాన్ని దుండగుల నుంచి రక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీ(ఐ)ఎం భారత నాస్తిక సమాజం కేవీపీఎస్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, టీపీఎస్‌కె, ఎన్పీఆర్డీ తదితర సంఘాల జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పాట పాడిన మాష్టార్జి..

బహుజన ప్రజా కవి మాష్టార్జి పాట పాడి వినిపించారు. బానాసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె మల్లేశం అధ్యక్షత వహించగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్ర శేఖర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృపాసాగర్, ఎన్.బాల పీరు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అన్వర్, టీపీఎస్‌కె జిల్లా నాయకులు శ్రీమన్నారాయణ, బానాసా నాయకులు రవీందర్ సిద్దార్థ్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వెంకట్ శ్రీనివాసులు, లింగస్వామి, సీఐటీయూ నాయకులు కరుణాకర్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, కేవీపీఎస్ జిల్లా నాయకులు గుంటి లక్మన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు

- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- కీసరగుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

మహాశివరాత్రి సందర్భంగా కీసర గుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసి వారికి అన్ని వసతులు కల్పించినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా జాతరకు అంచనా కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తూ అధికారులు, పోలీసు సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను జిల్లా అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెల 21 తేదీ వరకు జాతర జరగనున్న దృష్ట్యా జాతరలో ఏర్పాటు చేసిన లైటింగ్, ఆవరణలో అలంకరణ, పోలీస్ ఔట్ పోస్టు, క్యూలైన్లు, భక్తులకు అవసరమైన టాయిలెట్లు, మహిళా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతులను కలెక్టర్ పరిశీలించారు. మహాశివరాత్రి రోజైన శనివారం సాయంత్రం కీసరకు భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడం వారికి అవసరమైన సదుపాయాలు, ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్, జిల్లా పంచాయతీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతర రోజుల్లో ఆలయం వద్ద వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలనీ, జాతరలో భక్తులకు నీటి సౌకర్యం ఉండేలా ఆయా చోట్ల తాగునీటి వసతి కల్పించాలనీ, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతర సమయంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ ఎంట జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కీసర ఆర్డీవో రవి, ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్ శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకం రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



'నవతెలంగాణ' కీసరగుట్ట బ్రహ్మోత్సవాల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ





నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా నవతెలంగాణ పత్రిక ప్రచురించిన బ్రహ్మోత్సవాల ప్రత్యేక సంచికను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, నర్సింహ్మా రెడ్డి శనివారం కీసరగుట్టలో ఆవి ష్కరించారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ విశిష్టతను వెలువరించే విధంగా ప్రత్యేక సంచికను ప్రచురించడం చాలా సంతోషం అన్నారు. ప్రజాస మస్యలపై నిరంతరం వార్తలు అందించే నవతెలంగాణ పత్రిక మరింతగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ లింగ్యానాయక్, నవతెలంగాణ విలేకరి బందెల యాదగిరి, నవతెలంగాణ సిబ్బంది రవి పాల్గొన్నారు.



జాతరలో ఆకట్టుకున్న నవతెలంగాణ ప్రత్యేక సంచిక

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నవతెలంగాణ ప్రత్యేక సంచికను భక్తులకు అందించ డంతో విశేషంగా ఆకట్టుకుంది. కీసర గుట్ట చరిత్రకు సంబంధించిన కథనా లు, క్షేత్రంలో సందర్శించే స్థలాల గురించి వివరంగా ఉండటంతో ఆదారణ లభించి ంది. ఆలయానికి సంబం ధించిన వివరాలను అందించినందుకు నవతెలంగాణ పత్రికకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-అంబర్‌పేట

ఛత్రినాక, శివగంగనగర్‌లో లింగాకారంలో ఉన్న ప్రాచీన అపురూప శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయం శనివారం మహా శివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో మారుమోగింది. దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహా శివరాత్రి పండుగ సందర్భంగా తెల్లవారు జాము నుంచే భక్తులు గర్భాలయ ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, అభిషేక కార్యక్రమాలు నిర్వహించేందుకు బారులు తీరారు. శివనామస్మరణతో పరమశివుని దర్శించుకుని భక్తులు పులకించిపోయి, హరహర మహాదేవ, శంభో శంకర నినాదంతో ఆలయా ప్రాంగణం హోరెత్తిపోయింది. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు భక్తి శ్రద్ధలతో శివలింగానికి అర్చనలు, పాలాభిషేకాలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహా శివరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పిడి సీతారాం రెడ్డి, శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్, అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి సీతారాం రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రజలు ఆకాంక్షించిన రీతిలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆలయాల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అవిరామంగా కృషి చేస్తుందన్నారు. ప్రత్యేకంగా పురాతన చరిత్ర గల ఆలయాలకు పూర్వవైభవం కల్పించేందుకే ధూప దీప నైవేద్య పథకం ప్రవేశపెట్టిందనీ, ఆలయాలకు ప్రతి నెలా రూ.6వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన పాలక మండలి సభ్యులు శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి బాధ్యతతో కృషి చేయాలనీ ముప్పిడి సీతారాం రెడ్డి కోరారు. శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరి రాజలింగం మాట్లాడుతూ శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా పూల అలంకరణ, దీపాలంకరణ, మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామిమూలవిరాట్‌ను విశేష పుష్పాలతో అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.వి.శ్రీకాంత్ ఆచార్యులు, అర్చకులు రంజీ పాండేలు పాలాభిషేకం, పుష్పాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేసారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామనీ, ఉపవాస దీక్షలతో స్వామివారిని దర్శించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అయన తెలిపారు. ఈ రోజు రాత్రి పరమశివునికి జ్యోతిర్లింగార్చన జరుగుతుందని అనంతరం శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వరి సహిత లక్ష్మణేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని మాచునూరి రాజలింగం తెలియజేసారు. ఈ మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు ఏం.మహేష్, గిట్టి రమేష్, కె.స్వరూప నాయక్, ఏ.శ్రీకాంత్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పి.రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.మహేందర్, ఉపాధ్యక్షులు సి.రవీందర్, బి.నారాయణ, సంయుక్త కార్యదర్శి అంబటి పాండు, ప్రచార కార్యదర్శి ఆర్. అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



సురేష్ బాబు, హీరో దగ్గుబాటి రానాపై క్రిమినల్ కేసు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫిలింనగర్ ల్యాండ్ వివాదంలో కొత్త మలుపు తిరిగింది. సినీ నిర్మాత సురేష్ బాబు, హీరో దగ్గుబాటి రానా మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలనీ, దౌర్జన్యంగా తమను రౌడీల సాయంతో ఖాళీ చేయించారని ప్రమోద్ కుమార్ అనే వ్యాపారి ఫిర్యాదు చేశారు. ఖాళీ చేయకపోతే అంతు చూస్తామని సురేష్‌బాబు బెదిరింపులకూ పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసినా బంజారాహిల్స్ పోలీసులు పట్టించుకోవడం లేదని బాదితుడు కోర్టును ఆశ్రయించారు.పోలీసులతో సంబంధం లేకుండా నేరుగా సురేష్ బాబు, దగ్గుబాటి రానా సహా మరి కొంతమందిపై కేసు నమోదు చేసిన నాంపల్లి కోర్టుకు విచారణకు రావాలని సమన్లు జారీ చేయాలని కోరినట్టు సమాచారం.

మౌలాలి పీబీ కాలనీలో అధ్వాన్నంగా రోడ్లు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మౌలాలి డివిజన్ పరిధిలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎంతమంది కార్పొరేటర్లు మారుతున్నా.. ఏండ్లు గడుస్తున్నా తమ కాలనీలో రోడ్లు బాగుపడటం లేదని స్థానికులు వాపోతున్నారు. తమ గల్లీలు, రోడ్లు బాగా లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్లు తేలి గుంతలమయమైన రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోక ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిర్వహణ లోపంతో పలు ప్రాంతాల్లోని రహదారులు మట్టికుప్పలు, రాళ్ల దిబ్బలుగా మారుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రయాణికులు, కాలనీ వాసులు చెబుతున్నారు. ఆటో డ్రైవర్లు సైతం తమ ప్రాంతాలకు వచ్చేందుకు జంకుతున్నారని తెలిపారు. గుంతలు, రాళ్లమయమైన రోడ్లపై ఎలా ప్రయాణించాలని వారు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఈ అధ్వాన్న రహదారులపై ప్రయాణం అనునిత్యం ప్రమాదాలు చోటు చేసుకోవటం సాధారణమైందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లోనే కాక పగలు కూడా ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయని వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఇదే విషయమై గతంలో అటు కార్పొరేటర్, ఇటు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళామనీ, ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇక నైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని తమ కాలనీలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఘనంగా మహాశివరాత్రి

నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని సిఫైల్ కాలనీలోని సిద్ధివినాయక ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓంప్రకాష్, సోమయ్య, జగన్మోహన్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు

బేగంపేట : మహాశివరాత్రి సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అమీర్‌పేట డివిజన్ కుమ్మరి బస్తీలో గల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం శివాలయంలో శివలింగానికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో విటలయ్య, మాజీ చైర్మన్ సత్యనారాయణ యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు సంతోష్, అశోక్ యాదవ్, శేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, గులాబ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్ : మహాశివరాత్రి సందర్భంగా శనివారం భూదేవి నగర్‌లోని శివాలయంలో వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్ అభిషేకం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నేరేడ్‌మెట్ : మహాశివరాత్రి సందర్భంగా శనివారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జెజె నగర్‌లో సిద్ది వినాయక, సాయిబాబా ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.





ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు.

నేరేడ్‌మెట్ : మహాశివరాత్రి సందర్భంగా శనివారం వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ కాన్యం రాజ్యలక్ష్మి కాశీ విశ్వేశ్వర, వెంకటేశ్వర, బాల ఆంజనేయ ఆలయంలో అభిషేకం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

కంటోన్మెంట్ : ఓల్డ్ బోయిన్‌పల్లి ఆర్ ఆర్ నగర్ లో శివాలయంలో డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాప్రా : కైలాసగిరిలో ఉన్న కైలాసగిరి మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి



లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి, గోపా కుమార్, ప్రసాద్, జగన్ మోహన్, బుచ్చిరెడ్డి, భరత్, ప్రసాద్, గోపాల్ రెడ్డి, దూసరి నవీన్ గౌడ్ పూస రమేష్, సిద్ధ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాప్రా : మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి దర్శనం చేసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి. అనంతరం సోలిస్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో సోలిస్ రాము ఆధ్వర్యంలో నిర్వహించిన. కీసరగుట్టకి వచ్చే భక్తుల కోసం నీళ్ళు, పాలు, పండ్లు. పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుడుగు మహేందర్ రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, సాయి జనశేఖర్, డాక్టర్ బీవీ చారి, గిల్బర్ట్, నంది కంటి శివ, గంప కృష్ణ, ఉపేందర్, వినోద్, మల్లారెడ్డి, శ్యామ్, రాకేష్, సోలిస్ ఆసుపత్రి సిబ్బంది, రాము, విజయేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.









కాప్రా : మహాశివరాత్రి సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడలో ఉపవాసం ఉన్న భక్తులకు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమ్మిగడ్డ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.



రేపు ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ మహా సభ

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ మహాసభను రేపు బడంగ్‌పేటలోని జీఎంఆర్ గార్డెన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యులు నక్క యాదగిరి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల శ్రీకాంత్ రెడ్డి, నేమాల బెనర్జీ తెలిపారు. శనివారం మింట్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాల ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ పెద్ద సం ఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు హాజరయ్యే కార్మికులకు రూ.లక్ష ఉచిత బీమా పాలసీ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, స్థానిక నాయకులు, రాష్ట్ర ఎలక్ట్రికల్ నాయకులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, అక్మణ్, వెంకన్న, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాదరి భాగ్యరెడ్డి వర్మ 84వ వర్ధంతి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



చాదర్ఘట్ ఆది హిందు భవన్‌లో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాదిరి భాగ్యరెడ్డి వర్మ 84 వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి. ఆది హిందు సోషల్ సర్వీసెస్ లిగ్ అధ్యక్షులు డాక్టర్ రాహుల్ అమలోక్యాస్త్రి, కార్యదర్శి మాధురి అజయ్ గౌతమ్, ఎస్ జ్ఞాన ప్రకాష్, జ్ఞానేశ్వర్, చంద్రకళ, శ్రీలత గౌతమ్, విజయరాజ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో 'బోర్డు' ఎన్నికల హడావుడి

- రెండేండ్ల తర్వాత నిర్వహణ
- సంచలన నిర్ణయం తీసుకున్న రక్షణశాఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంటోన్మెంట్



దేశంలోని అన్ని కంటోన్మెంట్లకు రెండేండ్లుగా ఎన్నికల్లేవు. కంటోన్మెంట్ పాలకమండలిని రద్దు చేసిన రక్షణశాఖ నామినేటెడ్ సభ్యులను నియ మించింది. దీనికి తోడు జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియ తెరపైకి రావడంతో కంటోన్మెంట్లకు ఇప్పట్లో ఎన్నికలు ఉంటాయోనని నాయకులందరూ భావించారు. విలీనం కోసం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆమోదం పొందని చట్ట సవరణ బిల్లు ఒక వైపు, జీహెచ్ఎంసీలో విలీనం ప్రక్రియ మరోవైపు ఉండగా రక్షణశాఖ అనూహ్య నిర్ణయం తీసుకుంది. రెండు నెలల్లో ఎన్ని కలు నిర్వహిస్తామని రక్షణశాఖ సంచలన నిర్ణయం తీసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏప్రిల్ 30న ఎన్నికలు నిర్వహించ నున్నారు. దీంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత నాయకులు ఎన్నికల నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలకు అతీతంగా ఎన్నికలు

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కంటోన్మెంట్లకు పార్టీలకతీతంగా ఎన్నికలు జరుగుతాయి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల చిహ్నాలు అభ్యర్థులకు కేటాయించరు. పార్టీల తరపున నేరుగా ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేయరు. కాకపోతే ఆయా పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో దిగుతున్నారు. తమకు నచ్చిన అభ్యర్థులను ఆయా పార్టీలు ఎన్నికల బరిలో దింపి, వారికి ఆర్థికంగా ఇతర విధంగా సాయం చేస్తుంటాయి. అయితే గుర్తింపు పొందిన పార్టీ చిహ్నాలు లేనందున, పార్టీల విప్ పని చేయదు. దీన్ని ఆసరాగా తీసుకుని ఆయా పార్టీల అభ్యర్థులు నాయకత్వాన్ని ధిక్కరిస్తూ ఒక్కో వార్డు నుంచి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల చొప్పున ప్రతిపాదిస్తారు. పార్టీల నాయకత్వాలు ప్రేక్షక పాత్ర వహించక తప్పడం లేదు. అయితే. ప్రస్తుతం ఉన్న కంటోన్మెంట్ చట్టాన్ని సవరించాలనీ, పలు కీలక సంస్కరణలు తీసుకురావాలని కొన్నేండ్ల క్రితమే కేంద్ర రక్షణశాఖ నిర్ణయించింది. దీనికి గాను ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. వివిధ మార్పులతో పాటు కంటోన్మెంట్ల ఎన్నికలు, కొద్ది రోజుల క్రితం జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం చేయనున్నారు.

మున్సిపల్ ఎన్నికల మాదిరిగానే

పాలక మండలి ఉపాధ్యక్ష పదవికి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆయా వార్డుల నుంచి గెలిచే సభ్యులు తమలో ఒకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్ను కుంటున్నారు. ఈ పద్ధతికి స్వస్తిపలికి వార్డు సభ్యులకు ఒక ఓటు, ఉపాధ్యక్ష పదవికి ఇంకో ఓటు ఉండేలా ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించారు. పార్లమెంట్ బిల్లు ఆమోదం పొందితే కొత్త విధానం ప్రకారం ఎన్నికలు జరుగుతాయని అంతా భావించి పోటీకి దిగుతున్నారు. ఇప్పటి వరకు ఎన్నికలు జరుగకపోవడానికి కారణం చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో పెండింగ్‌ల్లో ఉండట మేనని అంతా భావించారు. ఎన్నికలు జరిగిన తర్వాత బిల్లు ఆమోదం పొందితే. పాలకమండలిని రద్దు చేయాల్సి వస్తుందనీ, తర్వాత న్యాయపరమైన చిక్కులు, మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సిన వస్తే ప్రజా ధనం వృథా తదితర అంశాల నేపథ్యంలో సవరణ బిల్లు ఆమోదం కోసం నిరీక్షిస్తూ వచ్చారు.

విలీనమైతే..

కంటోన్మెంట్ విలీనం అంశాన్ని రక్షణ శాఖ తెరపైకి తీసుకొస్తున్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. విలీనం ప్రక్రియను శరవేగంగా ముందుకు తీస్తూ వాయిదా వేస్తూ ప్రతిపాదన కెళ న్నట్టు 8 మంది అత్యున్నత స్థాయి అధికారులతో ప్రత్యేకంగా పలు కకమిటీని కూడా నియమించింది. రక్షణ శాఖ స్పీడ్ చూసి ఉన్నత నాయకులంతా ఎన్నికలపై ఆశలు వదులుకున్నారు. ఏ క్షణంలోనైనా విలీన ప్రక్రియ పూర్తవుతుందనీ, జీహెచ్ఎంసీలో కలిసిన తర్వాతనే పోటీకి దిగాల్సి ఉంటుందని పలు సందర్భాల్లో స్పష్టంగా కనిపించింది.

పాలనలో కాకతీయ రాజుల సామ్రాజ్యం గొప్పది

- రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-బంజారాహిల్స్/జూబ్లీహిల్స్

కాకతీయ రాజుల సామ్రాజ్యం పాలనలో గొప్పది కానీ నీటి కష్టాలు ఎదుర్కొందని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి మంత్రి హరీష్‌రావు అన్నారు. శనివారం బంజారా హిల్స్ రోడ్డు నెంబర్ 4లో ఉన్న కాకతీయ కళా కీర్తి హెరిటేజ్ ట్రస్ట్ ఆరిటోరియంలో రాసిన పుస్తకాన్ని మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. యన చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. కాకతీయ రాజుల కాలంలో ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులు పడేవారనీ, దాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా వేల చెరువులను మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా తవ్వకాలు జరిపి నీటి కష్టాలను లేకుండా చేశామని చెప్పారు. వ్యవసాయంలో కూడా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కాళేశ్వరంతో పాటు వివిధ ప్రాజెక్టులు నిర్మించి ప్రత్యేక డిజైన్లను రూపొందించామన్నారు. డాక్టర్ రాజారెడ్డి రచించిన ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులో తీసుకురావడం శుభ సూచికమని అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రం తరపున వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ మరిన్ని రాజుల జీవిత చరిత్ర నిజాలను తెలపాలని వివరించారు.

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, వల్లభ్‌నగర్ సబ్ రిజిస్టర్ డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో వల్లబ్ నగర్ కార్యాలయంలో బోయిన్‌పల్లి కార్పొరేటర్ ఎం.నర్సింగ్ యాదవ్ సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని కృషి చేసిన కార్యసాధకుడు కేసీఆర్ అన్నారు. ఆయన నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలనీ, బంగారు తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



రక్తదాన శిబిరం..

సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఆ సంఘం స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ జిల్లా అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ వారి కార్యవర్గం, ఇతర సభ్యులతో కలిసి డీఈవో ఆఫీస్ నుంచి నాంపల్లి గృహకల్ప కార్యాలయానికి బైక్ ర్యాలీగా వెళ్లి రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసినట్టుగా ముజీబ్ వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్ కోశాధికారి ప్రేమ్, ఉపాధ్యక్షులు ఎం.రవి, రుగేష్, జాయింట్ సెక్రెటరీ జయంతిరెడ్డి, పబ్లిక్ సెక్రెటరీ ఎంవై రవి, ఈసీ ప్రియా, ముజాహిద్, ఎగ్జిక్యూటివ్, ప్రాథమిక సభ్యులు, ఆఫీస్ సబార్డినేట్స్, సీఆర్పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

ఎండల ప్రదీప్‌కు విద్యార్థుల సత్కారం



నవతెలంగాణ-ఓయూ

నిజామాబాద్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకమైన ఎండల ప్రదీప్‌ను శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట తెలంగాణ రాష్ట్ర ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమకారులు సత్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విజయరావు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎండల ప్రదీప్‌ను నిజాంబాద్ ఏజీపీగా ప్రభుత్వం నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యమకారుడికి ఈ గౌరవం దక్కడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా విజయరావ్ అంబేద్కర్ పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వేల్పుకొండ వెంకటేష్, ఎంఎస్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, ఓయూ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు క్రాంతి, ఓయూ జేఏసీ నాయకులు రామకృష్ణ, వంశీ, కార్తీక్, కృష్ణ ప్రవీణ్, సురేష్, వడ్డేమాన్ యోగి, తదితరులు పాల్గొన్నారు.

వేల్పుకొండ వెంకటేష్‌కు డాక్టరేట్


నవతెలంగాణ-ఓయూ



తెలుగుశాఖలో తెలంగాణ రాష్ట్ర నిర్మాణ ఉద్యమం-కరపత్ర సాహిత్యం అనే అంశం మీద పర్యవేక్షకులు ఆచార్య సూర్యధంజయ్ ఆధ్వర్యంలో వేల్పుకొండ వెంకటేష్ చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ అధికారులు పీహెచ్డీ పట్టాను ఇచ్చారు. కరపత్ర సాహిత్యం ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది. వివిధ ఉద్యమాల ప్రచారానికి కరపత్రమే ఆధారమైంది. ఫ్రెంచి విప్లవం మొదలు భారతదేశ స్వతంత్ర పోరాటం వరకు కరపత్రం ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రధాన భూమికను పోషించింది. తెలుగు నేలమీద కరపత్ర రచన ఒక సాహిత్య ప్రక్రియగా మారింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సలైట్ ఉద్యమం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పోరాటం వివిధ అస్తిత్వ ఉద్యమాల సందర్భంలో కరపత్రం పోషించిన పాత్రను మనము విస్మరించలేం. కానీ ఇంతటి ప్రాధాన్యం గల కరపత్ర సాహిత్యం పైన ఇప్పటి వరకు ఒక్క పరిశోధన కూడా జరగలేదు. ఈ లోటును పూరించడం కోసం వేల్పుకొండ వెంకటేష్ అనే పరిశోధకుడు పూనుకుని ఆరేండ్లపాటు శ్రమించి కరపత్ర సాహిత్యాన్ని సేకరించి పరిశోధన పూర్తి చేశాడు. కరపత్రాన్ని ముద్రించి తర్వాత మరచిపోవడం అన్ని ఉద్యమ సందర్భాల్లో మనం గమనిస్తూ ఉంటాం. అలా విస్మరణకు గురైన వివిధ రకాల కరపత్రాలను సేకరించి, విశ్లేషించి క్రమ పద్ధతిలో వెంకటేష్ పరిశోధన చేశాడు. తెలంగాణ ఉద్యమంలో స్వయంగా ఈ పరిశోధకుడు పాల్గొని రాష్ట్రం సిద్ధించాక పరిశోధనలు పూర్తి చేయడం సంతోషించదగిన విషయం. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలం, చీకటాయపాలెం గ్రామంలో పేద, దళిత కుటుంబంలో తల్లిదండ్రులు వెంకటమ్మ, వెంకటయ్యకు ఐదుగురు సంతానంలో మొదటి సంతానం వేల్పుకొండ వెంకటేష్.

మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు స్వాగతం

నవతెలంగాణ-ఓయూ



రాజమండ్రి నుంచి శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడుకి శనివారం ఘన స్వాగతం పలికి మహా శివరాత్రి శుభాకాంక్షలను తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీను, చంద్ర మోహన్, లక్ష్మణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మనస్తత్వవేత్తల నైపుణ్యాభివృద్ధికి నిరంతర కృషి

నవతెలంగాణ-హిమాయత్ నగర్



మనస్తత్వవేత్తల నైపుణ్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక సంస్థ తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తమ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 1,500 సైకాలజిస్టుల సభ్యత్వం కలిగి ఉన్న ఏకైక అతిపెద్ద సంస్థ తమదేనన్నారు. సంఘం లక్ష్య సాధనలో అందరూ పాల్గొని, సైకాలజిస్టుల గౌరవాన్ని పెంపొందించుకోవాలనీ, ఉత్తమ సైకాలజిస్టులుగా ప్రతి ఒక్కరూ ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వం కోసం సైకాలజిస్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులు అనీ, సైకాలజీలో పీజీ, డిప్లమో, ఇన్ కౌన్సిలింగ్, ఎంఫిల్, పీహెచ్డీ చేసిన వారు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 9533660938 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు





నవతెలంగాణ-ఓయూ

మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని నగర మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బంజారాహిల్స్ : శివరాత్రిని పురస్కరించుకుని శనివారం వెంకటేశ్వరస్వామి డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాలను సందర్శించిన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఓయూ : మహాశివరాత్రి సందర్భంగా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ఉస్మానియా ప్రొ.డాక్టర్ గాలి వినోద్ కుమార్



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట శివశంకర గురువు ప్రముఖ విశ్లేషకులు మూర్తి రాజేష్, తదితరులు ఉన్నారు.





అంబర్‌పేట : బర్కత్‌పురలో ప్రముఖ హైకోర్టు న్యాయవాది నరసింహారావు, సేవా యూత్ అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సుల్తాన్‌బజార్ : మహాశివరాత్రి సందర్భంగా పురానా పూల్ శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో కొలహాలం నెలకొంది.

అంబర్‌పేట : మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు బి.నర్సింగ్ యాదవ్, దామోదర్ నాయుడు.

అంబేద్కర్ ఆగ్రహ ప్రదర్శనకు సీపీఐ మద్దతు

నవతెలంగాణ-హిమాయత్ నగర్



నేడు రాష్ట్రంలో ప్రగతిశీలవాదులు, దళితులు, భావ ప్రకటన స్వేచ్ఛ, రాజ్యాంగంపై దాడులు తీవ్రతరమయ్యాయనీ, వీటిని అరికట్టడానికి 19వ తేదీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాస్వామికవాదులు తలపెట్టిన 'అంబేద్కర్ ఆగ్రహ ప్రదర్శన' కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఈ.టి.నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో అరాచకాలు సృష్టించి అధికారంలోకి రావడానికి సంఘ పరివార్ శక్తులు ఉద్దేశపూర్వకంగా కొన్ని సంఘటనలను ఎంపిక చేసుకుని, వీడియోలను, మాటలను వక్రీకరించి ప్రజాస్వామికవాదులపై దాడులను తీవ్రతరం చేస్తున్నారనీ, భావాప్రకటన స్వేచ్ఛను కాలరాస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను భంగపరుస్తూ, మూకదాడులకు దిగుతూ సమాజంలో భయాందోళన కలిగించే పరిస్థితులను ఉత్పన్నం చేస్తున్నారని తెలిపారు. తమకు నచ్చని భావాలను ప్రకటించిన అభ్యుదయవాదులపైన, దళితులపైన, అంబేద్కర్ వాదులపైన యదేచ్ఛగా దాడులు చేస్తున్నారనీ, చట్టాన్ని శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరిచడం అన్యాయం అన్నారు. మనుధర్మ శాస్త్రం ప్రాచీన రాజ్యాంగం అంటూ వేల ఏండ్ల క్రితం కొనసాగిన సాంస్కృతిక బానిసత్వాన్ని తిరిగి పీడిత సమాజంపై అధికార బలంతో బలవంతంగా రుద్దడానికి బ్రాహ్మణీయ ఆధిపత్య శక్తులు సమావేశాలు పెట్టుకుని భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గతంలో అంబేద్కర్ రచించిన పుస్తకాల్ని ఉద్దేశించి సనాతన సంఘాలకు చెందిన వ్యక్తులు అంబేద్కర్ జీవించిన కాలంలో మేం ఉంటే గాడ్సే గాంధీని చంపినట్లు మేం అంబేద్కర్‌ను చంపే వాళ్ళమని నిర్భయంగా వీడియోలను పోస్ట్ చేస్తూ సమాజానికి సవాలు విసురుతున్నారని తెలిపారు. బీజేపీ ఈ విషయంపై మాట్లాడకుండా ఇలాంటి సంఘ విద్రోహ శక్తులను పరోక్షంగా మద్దతు ప్రకటిస్తూ ప్రోత్సహిస్తుదని తెలిపారు. ప్రజలు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, అధికారాలను కాలరాసే విధంగా ప్రయత్నాలు చేస్తున్న ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు ప్రజాస్వామిక వాదులు, మేధావులు, బుద్ధి జీవులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భారత రాజ్యాంగాన్ని, మాట్లాడే స్వేచ్ఛను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-ముషీరాబాద్



జీహెచ్ఎంసీలో కొన్నేండ్లుగా చాలీ చాలని జీవితాలతో తాత్కాలిక భృతిపై పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న లక్షల మందిని గుర్తించాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి లోని రాష్ట్ర కార్యాలయంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మహిళా కో-ఆర్డినేటర్ రోషిని విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గారె వెంకటేష్ మాదిగ పాల్గొని మాట్లాడారు. కరోనా వైరస్ వ్యాప్తించి వేలాది మంది ప్రజలు చనిపోతున్న సమయంలో ప్రజలకు నిజమైన సేవ చేసిన వారిలో డాక్టర్‌లు, పోలీస్‌లు, పారిశుధ్య ఉన్నారన్నారు. కార్మికులు వాళ్ళ ప్రాణాలను ప్రాణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడటంలో ముందున్నారన్నారు. డాక్టర్లకు, పోలీస్‌లకు సరైన వేతనాలు ఇస్తున్నాపుడు గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు సరైన జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్‌ల లోని ప్రాంతాలను పరిశుభ్రంగా చేస్తూ మోరీలను, డ్రైనేజీలను కంపు కొడుతున్నా భరిస్తూ నిజమైన సమాజ సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం మానవతా కోణంలో స్పందించి సీఎం పుట్టిన రోజు సందర్భంగా పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి లక్ష్మి బాయ్, పుష్ప, శోభ పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ ఫేజ్-2కు రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు నిర్మించాలనుకుంటున్న ఎంఎంటీఎస్ ఫేజ్-2కు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. భూసేకరణ పనులు ఎంత తొందరగా ప్రారంబిస్తే అంతే త్వరగా పనులు చేపడతామని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్టు ఆయన తెలిపారు. ఎంఎంటీఎస్ లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందడం లేదన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 విషయంలో ఇప్పటికైనా సీఎం కేసీఆర్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బర్కత్‌పురాలోని యాదాద్రి భవన్ నుంచి యాదగిరిగుట్టకు బయల్దేరిన అఖండ జ్యోతియాత్రను కిషన్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అఖండ జ్యోతి వెళ్లే మార్గంలో అన్ని వర్గాల ప్రజలు జ్యోతిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు. కొత్త ఆలయాలను నిర్మించడం కన్నా ఉన్న ఆలయాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి పూజా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 156 ఆలయాలను కేంద్రం అభివృద్ధి చేస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతమ్ రావు, స్థానిక నాయకులు ఎర్ర భీష్మాదేవ్, నిర్వాహకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివారు

- ఆదాయపు పన్ను కమిషనర్ జీవన్‌లాల్
- నేషన్ వైడ్ బిజినెస్ మింట్ అవార్డ్స్-2023

నవతెలంగాణ-అంబర్‌పేట



పారిశ్రామికవేత్తలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివారు అని ఆదాయపు పన్ను కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా అన్నారు. బిజినెస్ మింట్ 40వ నేషన్ వైడ్ అవార్డులను హైటెక్ సిటీ హెచ్ఐసీసీలో ఘనంగా నిర్వహించారు. బిజినెస్ మింట్, ది మార్కెట్ రీసెర్చ్ కంపెనీని వినయ్‌కాంత్ కొరపాటి స్థాపించారు. 40వ నేషన్ వైడ్ అవార్డ్స్ వేడుకలో, బిజినెస్ మింట్ భారతదేశంలోని వివిధ రంగాలకు చెందిన 100 మంది విజయవంతమైన వ్యక్తులను వారి వ్యాపారం, ఫ్యాషన్, హాస్పిటల్, ఎడ్యుకేషన్, సోషల్ వర్క్, హెల్త్, హాస్పిటాలిటీ, ఫుడ్ ఇండస్ట్రీ మొదలైన రంగాల్లో నిష్ణాతులను గుర్తించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ జీవన్ లాల్ లవిడియా, గౌరవ అతిథులుగా ఏపీ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జెఎ చౌదరి, తెలంగాణ ఐటీ డిపార్ట్‌మెంట్ ఓఎస్డీ ఎల్.రమాదేవి, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ ప్రెసిడెంట్, బీజేపీ జాతీయ విభాగం కరుణ గోపాల్ వర్తకవి, ఏజీహబ్ సీఈఓ విజయ్ నడిమింటి, భారత రాష్ట్ర సమితి మహిళా అధ్యక్షురాలు సోఫియా హసీబ్ సిద్దిఖీ పాల్గొని విజేతలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌లాల్ లావిడియ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసమేననీ, అయితే కంపెనీలు, పరిశ్రమలు, స్టార్టప్‌ల నుంచి అందజేసే సొమ్మును అందజేసి, ప్రభుత్వ వ్యవహారాలను ప్రజల కోసం చేస్తుందన్నారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు మన భారతీయ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్నారు. ప్రజలకు ఉద్యోగాలు, అదనపు సేవలు, విలాసవంతమైన జీవితాన్ని, భవిష్యత్తు కోసం మెరుగైన ప్రపంచాన్ని సృష్టించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-సనత్‌నగర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జాక్ కాలనీలో నివాసముంటున్న వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 14వ తేదీన అమలాపురం వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి ఇంటిలో బీరువాలో ఉన్న 3.5తులాల బంగారం, 15 తులాల వెండి చోరీకి గురైందని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మహాశివరాత్రి వేడుకలను అంబర్‌పేటలోని నల్లకుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళ. నవతెలంగాణ-అంబర్‌పేట



బస్తీల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడానికి తన వంతు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజు యాదవ్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గాంధీ తాత నగర్ తదితర ప్రాంతాలకు సొంతగా నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములైనందుకు ఆయనను స్థానికులు ప్రత్యేకంగా సత్కరించారు. నవతెలంగాణ-బంజారాహిల్స్



ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలి

అధ్యక్షుడు మంచుకొండ సురేంద్ర గుప్తా



నవతెలంగాణ - సరూర్‌నగర్

ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని కలిగి ఉండడం వల్ల మానసిక ఆత్మసంతృప్తి కలుగుతుందని లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కనెక్ట్ సుప్రీం అధ్యక్షుడు, శ్రీవాసవి అన్నపూర్ణ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మెన్ మంచుకొండ సురేందర్ గుప్తా అన్నారు. శనివారం చంచల్‌గూడ జైల్లో దాదాపు 750 మంది ఖైదీలకు పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కనెక్ట్ సుప్రీం నుండి సమాజంలోని పేదలకు, అన్ని వర్గాల వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డా.రాజయ్య గుప్తా, అశోక్ కుమార్, సత్తయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి వరం

కౌన్సిలర్ శంషోద్దిన్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సీఎం సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరం లాంటిదని 10వ వార్డు కౌన్సిలర్ ఎం.డి.శంషోద్దిన్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న షాహిన్‌నగర్‌లోని వాది ఇ ఉమ్మర్ కాలనీలో నివాసం ఉంటున్న సలీం బేగం అనారోగ్యంతో బాధపడుతున్నాడనే విషయాన్ని కౌన్సిలర్ శంషోద్దిన్ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్ళటంతో సీఎం సహాయ నిధి పథకం నుండి రూ.40వేల రూపాయలు చెక్కును మంజూరు చేయించారు. మంత్రి ఆదేశం మేరకు కౌన్సిలర్ చేతుల మీదుగా భర్త అజీమొద్దిన్‌కు అందచేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కౌన్సిలర్ శంషోద్దిన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- చైర్మెన్ తిరుపతిరెడ్డి
- బడంగ్‌పేట్ బచ్‌పన్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి విద్యార్థులు కృషి పట్టుదలతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బచ్‌పన్ స్కూల్ విద్యా సంస్థల అధినేత తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట్ బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్‌లో 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మెన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుంద



న్నారు. కృషి,పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. 7,8,9 తరగతుల విద్యార్థులు సెల్‌ఫోన్ ఉపయోగించటం వలన లాభం కంటే నష్టం ఎక్కువగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థుల ప్రదర్శన అభినందనీయమన్నారు. ప్రముఖ గాయకురాలు, జీ టైటిల్ విన్నర్ సముద్రాల శృతి పాడిన పాటలు సభికులను ఆకట్టుకుందన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని, వారికి ఎల్లవేళలా ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరముందన్నారు. ఆకాష్ గుప్త బోర్డు సభ్యులు ఏహెచ్‌పిఎస్ న్యూ ఢిల్లీ ఎన్ఈపి ప్రకారం అకాడమిక్ విద్యార్థులకు సెంచరీ స్కిల్ డెవలప్‌మెంట్ చేయుటకు అవకాశాలను వివరించారు.

అనంతరం విద్యార్థుల సృజనాత్మకతను వివరించే పాఠశాల ఈ మ్యాగజైన్ విడుదల చేశారు. 2021-22 సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యామాన్యం ఈ.మధుకర్‌రెడ్డి, బి.శివకుమార్ రెడ్డి, డా.సి.హెచ్.కౌశిక్ రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈ.మాధవిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- సన్ రైస్ స్కూల్ చైర్మన్ వాణిశ్రీ
- అవగాహనను కల్పించేందుకు సన్ రైస్ స్కూల్లో ఎగ్జిబిషన్ ఏర్పాటు
- ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్మార్ట్ హౌస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ, సైన్స్ వినియోగంపై విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే అవగాహనను కల్పించాలని సన్ రైస్ పాఠశాల చైర్మెన్ వాణిశ్రీ అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు తమ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నేచర్, సైన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల ప్రిన్సిపాల్ యోగితతో కలిసి మీడియాతో మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు సైన్స్, పర్యావరణంపై అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ముద్దు ముద్దు చిన్నారులు తయారు చేసిన ప్రకృతి చిత్రపటాలు, జంగిల్ యానిమల్స్ ట్రీస్, సైన్స్



చిత్రపటాలు టైప్స్ ఆఫ్ హౌస్, డిఫరెంట్ సెషన్స్, రాత్రి - పగల ఏర్పాటు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ హౌజ్ ఈ ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు ఓంకారేశ్వర్, ప్రణయ్ రాజ్, అక్షర, హ్రితికలకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో మంచిరేవుల ఇందిరమ్మ కాలనీ సభ్యులు నాగేందర్, కన్నా రమేష్, శ్రీను జూబ్లీహిల్స్ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ వెంకీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శనివారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో పలు ప్రాంతాల్లో శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఉదయం నుండి భక్తుల తాకిడితో ఆయా ప్రాంతాల్లో శివాలయాలు కిటకిటలాడిపోయాయి.

రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలో..

పంచశీల కాలనీలోని లలితా పరమేశ్వరి, కపర్దీశ్వర, (స్ఫటిక లింగం) బాలాశాస్త, సీతారామాంజనేయ, సాయిబాబా దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్, పారిశ్రామికవేత్త అనంతుల కరుణాకర్ రెడ్డి, అధ్యక్షులు పారిశ్రామికవేత్త, లయన్ డాక్టర్. చిల్లా రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి సలాది సత్యనారాయణ, నిర్వాహక కార్యదర్శి రామిని శ్రీనివాస్, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 8 .గంటలకు శివపార్వతుల కళ్యాణంతో పాటు 11:30 నిమిషాలకు లింగోద్భవ రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌లో గల శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మెన్ నల్లగోపుల బాబు గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాపన చార్యులు కాటూరి శ్రీధర్ స్వామి, ప్రధానార్చకులు కరుణాకర్ స్వామి, నేతృత్వములో కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. 19న ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పబ్బోజు ప్రవీణ్ కుమార్ చారి, సభ్యులు కోటగడ్డ శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, చారి, దుండిగల్ జయశ్రీ, కంసాని అరుణ, సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జంట సర్కిళ్లలో శివరాత్రి సందడి







నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్లోని పలు శివాలయాలు శివనామ స్మరణలతో మారుమ్రోగాయి. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తుల తాకిడి మొదలైంది. మీనాక్షి ఎస్టేట్స్, ఎంఎస్‌రెడ్డి నగర్, సుభాష్‌నగర్, సూరారం, జగద్గిరిగుట్టలోని పలు శివాలయ ఆలయాలలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి. ఈ కార్యక్రమంలో నార్లకంటే దుర్గయ్య, కంది శ్రీరాములు, మల్లేష్, విజయేందర్, శ్రీనివాస్ ముదిరాజ్, నందుగౌడ్, సందీప్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు, మనస్ గౌడ్, శ్రావణ్, జ్ఞానవర్మ, శివ, తుకారం పాల్గొన్నారు.

జగద్గిరిగుటలో : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్‌లో గల శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ పి.ఓంకార్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయ శాస్త్రి, అర్చకులు వెంకటయ్య, సభ్యులు టి.నర్సింగ్ రావు, టి.రాణి, మోహన్ లాల్, శ్రీనివాస్, నిరంజన్, వెంకటాచారి, పండరి, నరసింహ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పలు శివాలయంలో బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, భాస్కర్, లలిత పాల్గొన్నారు.

బెట్టింగ్‌లో అప్పులై...చోరీలకు పాల్పడి

- 6,81,570 విలువ గల వస్తువులు స్వాధీనం

నవతెలంగాణ-హయత్‌నగర్

జల్సాలకు అలవాటుపడి బెట్టింగ్‌లలో అప్పుల పాలైన యువకుడు చోరీలకు పాల్పడిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేటలోని రసూల్‌పురలో నివాసం ఉంటున్న నల్లమాస ఆనంద్ అలియాస్ నందు. డబ్ల్యూఎల్ఎఫ్ 777యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి ప్రతి రోజు సుమారు 10వేల నుండి 20వేలు పోగొట్టుకుంటున్నాడు. అట్టి డబ్బు క్రెడిట్ కార్డ్ ద్వారా సుమారు 15లక్షల రూపాయలు చెల్లించగా మరల డెబిట్ కార్డులు క్లియర్ చేయడానికి సులభంగా డబ్బును సంపాదించాలని అనుకుని తాళం వేసి ఉన్న ఇండ్లను ఎంచుకుని చోరీలకు పాల్పడేవాడు. ఈనెల 14న నాగోల్ జైపురి కాలనీలో నివాసం ఉంటున్న ప్రయివేటు ఉద్యోగి కవిత తన ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లడంతో ఇంట్లో ఉన్న బీరువాలో విలువైన వస్తువులు అపహరణకు గురైన విషయాన్ని ఆమె సోదరుడు ఫోన్‌లో వివరించగా, అట్టి విషయాన్ని పోలీసులకు ఫిర్యాదులో పేర్కొనడంతో, కేసు నమోదు చేసిన పోలీసులు సీసీఎస్, ఎల్బీనగర్ క్రైమ్ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌తో సీసీ కెమెరాల ఆధారంగా అతను వాడిన స్ప్లెండర్ ఏపీ 10బీపీ 5720గల వాహనంపై వచ్చి, చోరీ సమయంలో ఒక చొక్కా, చోరీ చేశాక మరో చొక్కా ధరించేవాడని విచారణలో తేలింది.

నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 19వేల నగదు, 120గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ 6,81,570 ఉంటుందని తెలిపారు.

మనస్థాపంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

నాగర్‌కర్నూలు జిల్లా, చారకొండ మండలం అగ్రహారం తండాకు చెందిన నేనావాత్ నందు నాయక్ (36) శుక్రవారం రాత్రి ఓవైసీ ఆస్పత్రితో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య జ్యోతి, కుమార్తె నిత్య, కుమారుడు అర్జున్ కుటుంబ సభ్యులతో గత 35 సంవత్సరాలుగా సైదాబాద్ డివిజన్ లోకయుక్త కాలనీ ఎస్‌బీఐ కాలనీలో బతుకుదెరువు కోసం వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. వారం రోజుల క్రిందట ఆతని నివాసాన్ని అక్రమంగా కూల్చివేశారన్న మనస్థాపంతో మానసికంగా అనారోగ్యనికి గురై సంతోష్‌నగర్ ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండె వెంకట్ గౌడ్ హాస్పిటల్‌కు వెళ్లి వారి కుటుంబ



సభ్యులకు తన ప్రగాఢ సానుభూతినీ, సంతాపాన్ని తెలియ జేస్తూ పేదవారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు ఆయన ఓదార్చారు. సైదాబాద్ పోలీస్‌లు ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

వైద్య ఆరోగ్య రంగాన్ని మెరుగు చేయాలి • వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ తీర్మానం


క్లిక్: కె.ఎన్ హరి

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

గ్రామీణ ప్రాంత ప్రజలకు అంతో ఇంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ తీర్మానించింది. మహాసభ నాలుగోరోజైన శనివారం పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. తొలుత వైద్య ఆరోగ్య రంగంపై ప్రతినిధి దుర్గాస్వామి తీర్మానం పెట్టారు. దేశంలో కరోనా అనంతరం వైద్య ఆరోగ్య రంగ ప్రాధాన్యత తెలిసిందని, ఈ నేపథ్యంలో ఈ రంగాన్ని మెరుగుపరచడంతోపాటు బడ్జెట్లో నిధులు కూడా పెంచాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది పనులు లేక పోషకాహారలేమి తీవ్రంగా ఉందని అన్నారు. అలాగే తీవ్రమైన అనారోగ్యం బారినపడినా సరైన చికిత్స అందే పరిస్థితి లేదని వివరించారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య రంగానికి నిధులు పెంచాలని తీర్మానించారు. అలాగే గ్రామీణ ప్రాంతంలో పేదలకు అంతోఇంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీకి నిధులు తగ్గించడం సరికాదని వెంటనే నిధులు పెంచాలని తీర్మానించారు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్వల్ప తగ్గుదల ఉటుందని కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో చెప్పారని, వాస్తవంగా ఇది మరింత ఉందని వివరించారు. నిరుద్యోగం పేదరికం, పౌష్టికాహారలోపం, పిల్లల మరణాలు పెరుగుతున్నాయని తెలిపారు. యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో 2006లో ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. 2010 నాటికి దేశవ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇది అమలైందని వివరించారు. ఎన్డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీకి నిధులు తగ్గుతున్నాయని తెలిపారు. గత బడ్జెట్లో 73 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తే ఈ ఏడాది 60 వేల కోట్లకు తగ్గించారని వివరించారు. వాస్తవంగా ఉపాధి కరువైన సమయంలో నిధులు పెంచాల్సింది పోయి తగ్గించారని పేర్కొన్నారు. ఎక్కువ కుటుంబాలకు 50 రోజులు పని కూడా ఉండటం లేదని తీర్మానంలో పేర్కొన్నారు. నెలవారీ ఆర్థిక ఖర్చులు పెరిగాయని, దానికి అనుగుణంగా పెరుగుదల ఉండాలని చెప్పారు. జనవరి 2020 నుండి అక్టోబర్ 2022 మధ్యలో 14 మిలియన్ల మంది ఉపాధి కోల్పోయారని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి నివేదిక తెలిపిందన్నారు.

మరోవైపు జిడిపి పెరిగిందని నివేదికలు పెడుతున్నారని, అంటే ఉపాధిలేని అభివృద్ధి అని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. నయా ఉదారవాద సంస్కరణల ప్రభావం దీనిద్వారా స్పష్టమవుతోందని, ముఖ్యంగా యువతకు ఉపాధి లభించడం లేదని వివరించారు. శ్రామికశక్తి క్రమంగా నాశనం అవుతోందని ఇది ప్రమాదరకమైన పరిణామమని తెలిపారు పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి తగ్గుతోందని పేర్కొన్నారు. కేరళలో అయ్యంకాళి పట్టణ ఉపాధిగ్యారంటీ పథకం ప్రవేశపెట్టి అక్కడివారికి ఉపాధి కల్పించారని వివరించారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద 100 నుండి 150 రోజుల పని కల్పించాలని, కేరళ మాదిరి పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ఏర్పాటు కోసం ఉద్యమించాలని తీర్మానించారు. మొత్తంగా ఏడు తీర్మానాలను మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఒక తీర్మానంలో స్వల్ప పదమార్పు చేశారు.

సంఘం వెబ్సైట్ ప్రారంభం

మహాసభల చివరిరోజు మహాసభల అర్హతల వివరాలను స్టీరింగ్ కమిటీ సభ్యులు విక్రమ్ ప్రవేశపెట్టారు. ఈ మహాసభకు 695 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో 637 మంది ప్రతినిధులు, 47 మంది కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 119 మంది పరిశీలకులుగా ఉన్నారు. వీరిలో 566 మంది పురుషులు, 119 మంది మహిళా ప్రతినిధులు ఉన్నారు. వీరిలో ఎపికి చెందిన శరత్చంద్ర అతి పిన్నవయస్కుడు కాగా, సునీత్ కృష్ణచంద్ర చోప్రా సీనియర్ ప్రతినిధిగా నిలిచారు. ప్రతినిధుల్లో 321 మంది వ్యవసాయ కార్మిక రంగం నుండి రాగా, 368 మంది పూర్తికాలం కార్యకర్తలుగా ఉన్నారు. బెంగాల్కు చెందిన సచీంద్రానంద్రాయ్ ఏడు సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారు. ఏడాదిపైన 11 మంది, రెండేళ్లపైగా 11 మంది మూడేళ్లకుపైగా ఏడుగురు, ఐదేళ్లకుపైగా జైలు జీవితం గడిపారు.



ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా

విజయరాఘవన్, వెంకట్

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయ రాఘవన్, బి.వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 155 మందితో జనరల్ కౌన్సిల్ ఏర్పాటైంది. తెలంగాణా నుంచి 15 మంది, ఏపీ నుంచి 12 మంది జనరల్ కౌన్సిల్లో ఉన్నారు. కేరళ నుంచి 30 మంది, పశ్చిమబెంగాల్ నుంచి 18, తమిళనాడు నుంచి 14, త్రిపుర నుంచి 10, పంజాబ్ 8, కర్నాటక 8, బీహార్ నుంచి ఏడుగురు, ఉత్తరప్రదేశ్ నుంచి ఐదుగురు, మహారాష్ట్ర నుంచి ఆరుగురు, రాజస్థాన్ నుంచి నలుగురు, హర్యానా నుంచి ముగ్గురు, ఒడిస్సా నుంచి ముగ్గురు, మధ్యప్రదేశ్, జార్ఖండ్, అసోం, ఉత్తరాఖండ్, గుజరాత్ నుంచి ఒక్కొక్కరు చొప్పున నూతన కమిటీకి ఎన్నికయ్యారు. సంఘం అఖిల భారత కేంద్రం నుంచి విజయ రాఘవన్, వెంకట్, విక్రమ్సింగ్, వి.శివదాసన్, బాబూమోహన్, షాజీ జనరల్ కౌన్సిల్లో ఉన్నారు. కేంద్రం నుంచి ఒక ఖాళీ పెండింగ్లో ఉంది, ఉత్తరాఖండ్, జార్ఖండ్ నుంచి ఒకరికి జనరల్ కౌన్సిల్లో అవకాశం కల్పించినా ఎవరనేది ప్రకటించలేదు.

ఏపీ నుంచి జనరల్ కౌన్సిల్ సభ్యులు

వి.వెంకటేశ్వర్లు, డి.సుబ్బారావు, వి.శివనాగ రాణి, కె.వి.నారాయణ, ఎం.నాగేశ్వరరావు, కె.ఆంజనేయులు, ఎం.పుల్లయ్య, ఎం.రాజేష్, ఎ.రవి,, డి.వెంకన్న, జి.సింహచలం, వి.అన్వేష్.

కేంద్ర వర్కింగ్ కమిటీ

ఎంవి గోవిందమాస్టార్, ఎస్.ఆర్.బాలన్, ఎస్.చంద్రన్, ఎ.నాగప్పన్, పి.కె.బిజు, కె.కోమల కుమారి, సి.బి.దేవదర్శనన్, లలితాబాలన్, అంబిక, ఎ.డి.కున్నచ్చన్, అమియాపాత్ర, తుషార్ఘోష్, మిజనూర్ రహమాన్, సుకుమార్ చక్రవర్తి, రామకృష్ణరాయ్చౌదరి, హిమాన్షుదాస్, బొని యాతుడు, నిరపడ సర్దార్, జి.నాగయ్య, ఆర్.వెంకటరాములు, బి.ప్రసాదు, బి.పద్మ పి.వెంటకేశ్వర్లు, ఐలయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, శివనాగరాణి, లాజర్ అమర్తలింగం, చిన్నదురై, పళనిస్వామి, పుంగత్తయ్, భానూలాల్ సాహా, శ్యామల్దే, భూప్చంద్ చన్ను, రామ్సింగ్చ గుర్మేష్సింగ్, పుట్టమధు, చంద్రప్ప హెూస్కెర, మునివెంకటప్ప, భోలాప్రసాదు దివాకర్.ధర్మేంద్ర చౌరాసియా, రామ్శ్రే మహతో, బ్రిజ్లాల్ భారతి, సతీస్కుమార్, నీతూసాల్వే, సరిత శర్మ, రామ్రతన్ బగారియా, ప్రేమ్ కుమార్, నిర్మల్ నాయక్, రాంబాబు జాదవ్, ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, విక్రమ్సింగ్చ వి,.శివదాసన్, బాబూమోహన్


జి.నాగయ్య


ఆర్.వెంకటరాములు


బి.ప్రసాదు


నారి ఐలయ్య

తెలంగాణా నుంచి

జి.నాగయ్య, ఆర్.వెంకటరాములు, బి.ప్రసాదు, బి.పద్మ, పొన్నం వెంకటేశ్వర్లు, ఐలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కె.జగన్, పెద్ది వెంకటేశ్వర్లు, ఎ.వెంకటరాజమ్, డి.సరోజ, ఎం.ఆంజనేయులు, ఎ.వీరన్న, కె.నరసింహులు, ఎం.రాములు ఉన్నారు.

ఆఫీసు బేరర్స్

ఎ.విజయరాఘవన్, బి,వెంకట్, గోవిందన్మాస్టార్, అమియపాత్ర, భానూలాల్ సాహా, లాజర్, జి.నాగయ్య, కె.కోమలకుమారి, భూప్చంద్ చన్నూ, విక్రమ్సింగ్, వి.శివదాసన్, తుషార్ఘోష్, వి.వెంకటేశ్వర్లు, బ్రిజ్లాల్ భారతి, ఎస్.చంద్రన్ ఉన్నారు.



ప్రతి కుటుంబాన్ని కదిలించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్
- చలో పార్లమెంట్ విజయవంతం చేయాలి

హౌరా నుంచి నవతలెంగాణ ప్రత్యేక ప్రతినిధి

ప్రజలను ఇబ్బందుల్లోకి నెడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను కదలించాలని, గ్రామస్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, అలాగే కేంద్రానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో పార్లమెంటును విజయవంతం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. హౌరాలోని శరత్సదన్ (జ్యోతిబసునగర్లో) జరుగుతున్న అఖిల వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర విధానాలపై ప్రతిఘటన రాకపోతే ప్రజావ్యతిరేక విధానాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి రైతుల నడ్డి విరిచారని, కార్మిక చట్టాలు తీసుకొచ్చి కార్మికులను అణగదొక్కారని, ఉపాధి హామీని తగ్గించి వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో చేపట్టిన చలో పార్లమెంటును కార్యక్రమాన్ని విజయంతం చేయడం ద్వారానే హక్కులను కాపాడు కోవచ్చని తెలిపారు. ఉపాధి హామీని నిర్వీర్యం వెనుక బిజెపి కుట్రపూరిత వైఖరి ఉందని పేర్కొన్నారు. చలో పార్లమెంటు కార్యక్రమం ఉంటే ఒక ప్రదర్శనే కాదని, మొత్తం ప్రజల్లోకి ప్రభుత్వ విధానాలను తీసుకెళ్లడం ప్రధానమని చెప్పారు.

నవచిత్రం


ప్రభాస్


ప్రాజెక్ట్ కె

సంక్రాంతి కానుకగా రిలీజ్

ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్లో రూపొందుతున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్ కె'. దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్న సినిమాలలో ఇదొకటి. పాన్ వరల్డ్ ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ సినిమా కోసం మేకర్స్ పర్ఫెక్ట్ రిలీజ్ డేట్ని ఖరారు చేశారు. జనవరి12, 2024న సంక్రాంతి కానుకగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ డేట్ని పురస్కరించుకుని యుద్ధ సన్నివేశంతో విడుదల చేసిన అద్భుతమైన రిలీజ్ పోస్టర్ ప్రేక్షకుల్నఉ కట్టిపడేసింది. ముగ్గురు వ్యక్తులు భారీ చేతికి తుపాకీని గురిపెట్టి చూస్తున్నారు. బ్యాక్డ్రాప్లో మైదానంలో ఆయుధాలతో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. ప్రపంచం ఎదురుచూస్తోంది... అని పోస్టర్ పై రాసి ఉంది. ఇండియాలో అత్యంత ఖరీదైన చిత్రంగా నిలిచిన ఈ అద్భుతమైన సినిమా విడుదల కోసం ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోందనే ఫీలింగ్ ఈ పోస్టర్ చూస్తే కలుగుతుంది.

దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రపంచ స్థాయి నిర్మాణ ప్రమాణాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టెక్నికల్గా ఈ సినిమా మరో లెవల్లో ఉండనుంది. విజయవంతంగా 50 ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకుంటున్న వైజయంతీ మూవీస్ నిర్మాణంలో ఈ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు నిర్మాత అశ్విని దత్. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా, బిగ్ బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

పవర్ఫుల్ రామబాణం


గోపీచంద్

గోపీచంద్, శ్రీవాస్ కాంబోలో 'లక్ష్యం', 'లౌక్యం' వంటి సూపర్ హిట్ల తర్వాత వస్తున్న హ్యాట్రిక్ సినిమా 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో గోపీచంద్ సరసన నాయికగా డింపుల్ హయతి నటిస్తుండగా జగపతి బాబు, కుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో విక్కీ అనే పవర్ ఫుల్ పాత్రలో గోపీచంద్ కనిపించనున్నారు. మహా శివరాత్రి కానుకగా శనివారం సాయంత్రం మేకర్స్ ఫస్ట్ లుక్ని విడుదల చేశారు.

'విక్కీస్ ఫస్ట్ యారో' పేరుతో విడుదల చేసిన ప్రత్యేక వీడియో అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటోంది. మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం మెప్పించింది. ఫ్యామిలీ ఎమోషన్స్తో పాటు సామాజిక సందేశం కూడా మిళితమైన బలమైన కథాంశం ఉన్న చిత్రమిది. ఈ చిత్రంలో సరికొత్త గోపీచంద్ను చూడబోతున్నారు. గోపీచంద్ 30వ చిత్రంగా వస్తున్న ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేతలు వ్యయానికి వెనకాడకుండా ప్రముఖ నటీనటులు, ఉత్తమ సాంకేతిక నిపుణులతో భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు.


భోళాశంకరుడి విశ్వరూపం


చిరంజీవి

చిరంజీవి, మెహర్ రమేష్ కలయికలో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర మోషన్ పోస్టర్ను విడుదల చేశారు.

ఈ మోషన్ పోస్టర్లో చిరంజీవి ఢమరుకం పట్టుకుని నటరాజ భంగిమలో అచ్చు శివతాండవం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. మహతి స్వర సాగర్ పోస్టర్కి తన బ్యాక్గ్రౌండ్ స్కోర్తో మరింత ఇంటెన్సిటీ తెచ్చారు. ఈ సినిమాలో తమన్నా నాయికగా నటిస్తోంది. కీర్తి సురేష్ చిరంజీవికి చెల్లెలుగా కనిపించనుంది. క్రియేటివ్ కమర్షియల్స్తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

ఈ చిత్రానికి డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల.


అఖిల్

యూనిక్ స్పై థ్రిల్లర్

అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డిల మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఏజెంట్'. మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ త్వరలోనే ఏజెంట్ మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నట్లు మేకర్స్ ఎనౌన్స్ చేశారు. చార్ట్ బస్టర్ కంపోజర్స్ హిప్హాప్ తమిళ సంగీతం అందించిన ఏజెంట్ ఎక్స్ట్రార్డినరీ సాంగ్స్ని గ్రాండ్ విడుదల చేయబోతున్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ఏజెంట్ బ్రాండ్ న్యూ పోస్టర్లో అఖిల్ టెర్రిఫిక్గా కనిపించారు. ఈ సినిమా కోసం ఆయన స్టైలిష్ మేక్ఓవర్ అయ్యారు. సురేందర్ రెడ్డి ఈ చిత్రాన్ని యూనిక్ స్పై థ్రిల్లర్గా తెరకెక్కిస్తున్నారు. అఖిల్కి జోడిగా సాక్షి వైద్య నటిస్తోంది. మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎకె ఎంటర్టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్ సుంకర, దీపా రెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏప్రిల్ 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా ఈ సినిమా రిలీజ్ కానుంది.


తారకరత్న

హీరో తారకరత్న కన్నుమూత

గత 23 రోజులుగా మృతువుతో పోరాడిన హీరో తారకరత్న (40) కన్నుమూశారు. జనవరి 27న 'యువగళం' పాదయాత్రలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తారకరత్న తీవ్ర గుండెపోటుకి గురయ్యారు. తొలుత కుప్పం, తర్వాత మెరుగైన వైద్యం కోసం బెంగుళూరులోని నారాయణ హృదయాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం సాయంత్రం కన్నుమూశారు.

ఎన్టీఆర్ కుమారుడు మోహన్కృష్ణ తనయుడు తారకరత్న 1983 ఫిబ్రవరి 23న హైదరాబాద్లో జన్మించిన ఆయన ఒకేరోజు ఏకంగా 9 సినిమాల ప్రారంభోత్సవంతో రికార్డ్ సృష్టించారు. 2002లో విడుదలైన 'ఒకటో నెంబర్ కుర్రాడు' చిత్రంతో హీరోగా ప్రేక్షకులకు పరిచయమై, 'యువరత్న', 'భద్రాద్రి రాముడు', 'అమరావతి', 'నందీశ్వరుడు' వంటి తదితర చిత్రాలతో మెప్పించారు. 'అమరావతి' చిత్రానికి ఉత్తమ విలన్గా నంది అవార్డు అందుకున్నారు. రాజకీయాల్లోనూ చురుగ్గా ఉండే తారకరత్న తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో తరచుగా పాల్గొనేవారు. తారకరత్న అకాలమృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సరికొత్త కాన్సెప్ట్


యశ్విక నిష్కల, శరణ్కుమార్, ఊర్వీసింగ్

విజయనిర్మల మనవడు శరణ్ కుమార్ (నరేశ్ కజిన్ రాజ్కుమార్ కొడుకు) హీరోగా, శశిధర్ చావలి దర్శకత్వంలో తెరకెక్కిన యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మిస్టర్ కింగ్'. హన్విక క్రియేషన్ బ్యానర్ బి.ఎస్.రావు నిర్మించారు. యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్ కథానాయికలు. ఈ నెల24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ని గ్రాండ్గా నిర్వహించింది. నరేష్, నిర్మాత ఎంఎస్రాజు ముఖ్య అతిథులుగా ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శరణ్ మాట్లాడుతూ,'ఇందులో నాది చాలా బలమైన పాత్ర. దర్శకుడు చాలా ప్యాషన్తో సినిమా చేస్తే, నిర్మాత ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. మణిశర్మ వండర్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు' అని తెలిపారు.

'దర్శకుడు శశి ఎన్విరాన్మెంటల్ ఏరోప్లేన్స్ గురించి ఏడాది పాటు రీసెర్చ్ చేసి ఈ కథని చేశారు. సినిమా అద్భుతంగా వచ్చింది' అని నిర్మాత బిస్ రావు చెప్పారు. 'ఆత్మాభిమానం ఉన్న ఓ అబ్బాయి కథ ఇది. ప్రేక్షకుడు తనని తాను హీరోగా చూసుకునే కథ' అని దర్శకుడు శశిధర్ చావలి అన్నారు.

గుత్తాధిపత్యంతో నాశనం

'గుత్తాధిపత్యం వల్ల చిత్ర పరిశ్రమ నాశనం అవుతోంది. నేడు (ఆదివారం) జరగబోయే నిర్మాత మండలి ఎన్నికల్లో సభ్యులందరూ అవగాహనతో ఓటు వేయండి' అని నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కళ్యాణ్ చెప్పారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, '2019 నుంచి 2023 ఫిబ్రవరి వరకు కౌన్సిల్ ప్రెసిడెంట్గా రెండవ సారి ఎన్నికయ్యాను. కళ్యాణ్ లీడ్ చేస్తే మంచే జరుగుతుంది అనే నమ్మకం మీకు కలిగితే మీరందరూ మా ప్యానల్కు ఓటెయ్యండి. ఈ ఆర్గనైజేషన్ను కాపాడండి. ఇందులో ఉన్న 1200 మంది సభ్యుల ఆవేదన నాకు తెలుసు. ఇక్కడంత మోనో పలి అయ్యింది. వారే హీరోలు, వారే డిస్ట్రిబ్యూటర్స్, వారివే థియేటర్స్ ఇలా వారు ఇండస్ట్రీని శాసిస్తున్నారు. చిన్న సినిమాలను బతికించాలి. లేకపోతే పరిశ్రమ లేదు' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ప్రాథమిక ఉపాధ్యాయులు సంఘటితం కావాలి : టీఎస్‌పీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంఘటితం కావాల్సిన తరుణం ఆసన్నమైందని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, పిట్ల రాజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండితుల కోసం ఎన్నో త్యాగాలు చేశామనీ, వారు తమను శత్రువుల్లా చూడడం బాధాకరమని పేర్కొన్నారు. భాషాపండితులే అయినా స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా గౌరవించామని వివరించారు.

గ్రేడ్-1 భాషాపండితుల పోస్టును బీఈడీ లేకున్నా స్కూల్ అసిస్టెంట్‌గా పేరు మార్చి సమాన హోదాకు అంగీకరించామని తెలిపారు. బీఈడీ అర్హత లేకున్నా ప్యానల్ గ్రేడ్ హెడ్మాస్టర్‌గా పదోన్నతి పొందడానికి తమ హక్కులను త్యాగం చేశామని పేర్కొన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ హిందీ, తెలుగు పదోన్నతులు పొందడానికి గతంలో మాదిరి జీవోలిస్తే జీర్ణించుకోవడం లేదని వివరించారు. పాఠశాల విద్యాశాఖలో ప్రాథమిక ఉపాధ్యాయుల సంఖ్య 63 వేలు, భాషాపండితుల సంఖ్య పది వేల వరకు ఉందని తెలిపారు. ఎవరు కావాలో తేల్చుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మెదక్ ఘటనపై ఐజీ పర్యవేక్షణలో విచారణ

- ఆదేశాలు జారీ చేసిన డీజీపీ

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

మెదక్ పోలీసుల చేతిలో గాయపడి గాంధీ ఆస్పత్రిలో మరణించిన ఖదీర్ అనే వ్యక్తి ఉదంతంపై ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి స్వీయ పర్యవేక్షణలో విచారణకు రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. గతనెల 29న చోరీ ఆరోపణపై ఖదీర్ అనే వ్యక్తిని మెదక్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురి చేసి ఒదిలి పెట్టారనీ, దాంతో బాధితుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండ్రోజుల క్రితం మరణించినట్టు ఆరోపణలు వచ్చాయి. పోలీసులు పెట్టిన చిత్ర హింసల కారణంగానే తీవ్ర గాయాలపాలై అతను మరణిం చినట్టు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీనిపై స్పందించిన డీజీపీ ఈ ఘటనపై కామారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ పోలీసు అధికారి చేత విచారణ జరిపించాలని, ఈ విచారణను ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

స్తంభించిన విమానయానం

- జర్మనీలో కొనసాగుతున్న సమ్మె

బెర్లిన్ : విపరీతంగా పెరిగిన ద్రవ్యోల్బణం నేపథ్యంలో తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ విమానాశ్రయాల్లోని ఉద్యోగులు సమ్మె చేయడంతో జర్మనీలో విమానయానరంగం స్తంభించింది. విమానాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దేశంలోని ఏడు విమానాశ్రయాల్లోని క్షేత్రస్థాయి సిబ్బంది, ఫ్లైట్ కంట్రోల్ సిబ్బంది బుధవారం నుంచి సమ్మె చేస్తున్నారు. వేతనాల పెంపు ప్రధాన డిమాండ్‌తో సిబ్బంది ఈ సమ్మెకు దిగారు. ఈ సమ్మె కారణంగా ఇప్పటి వరకూ 2,340 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు, దీంతో 3 లక్షల మంది ప్రయాణికులపై భారం పడిందని జర్మనీ ఎయిర్‌పోర్ట్స్ అసోసియేషన్ (ఎడివి) వెల్లడించింది. జర్మనీలో ఒక ప్రముఖ విమాన యాన సంస్థ లుఫ్తాన్సా ఒక్కటే సుమారు 1,300 విమాన సర్వీసులను రద్దు చేసింది. శుక్రవారం ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిచ్ విమానాశ్రయాల నుంచి ఒక్క విమానం కూడా బయలుదేరలేదు. యూరప్‌లోని పౌరవిమాన యాన రంగంలో ఇప్పటికే సిబ్బంది కొరత వేధిస్తుంది. కోవిడ్ మహమ్మారి సమయంలోనూ, తరువాత వివిధ సందర్భాల్లోనూ అనేకమంది ఉద్యోగాలు కోల్పోయారు. ద్రవ్యోల్బణం వల్ల తమ నిజవేతనాలు బాగా పడిపోయాయని, ప్రభుత్వం, యాజమాన్యాలు పట్టించుకోకపోవడం వల్లే సమ్మె చేయాల్సి వచ్చిందని ఉద్యోగులు తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై పిటిషన్ల లిస్టింగ్‌కు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370లోని నిబంధనలను రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను త్వరగా లిస్టింగ్ చేయడంపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ఈ పిటిషన్లను త్వరగా విచారించాల్సిన అవసరం ఉందని పిటీషన్‌దారుల్లో ఒకరి తరఫున సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీనికి ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ జెబి పార్దివాలాతో కూడిన ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ అనేక పిటీషన్లు దాఖలయ్యాయి. వీటి విచారణకు గతంలోనే ఐదుగురు జడ్జిలతో ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. ఇందులోని అప్పటి ప్రధాన న్యాయమూరి ఎన్‌వి రమణ, జస్టిస్ ఆర్ సుభాష్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో ఈ ధర్మాసనాన్ని మళ్లీ ఏర్పాటు చేయాల్సి ఉన్నది.

వాణిజ్య ఒప్పందంపై వెనిజులా, కొలంబియా సంతకాలు

కారకస్ : వాణిజ్య ఒప్పందంపై వెనిజులా, కొలంబియా దేశాలు తాజాగా సంతకం చేశాయి. ఇరు దేశాలకు ఉమ్మడి సరిహద్దు అయిన అటనాసియా గిర్‌డాట్ అంతర్జాతీయ బ్రిడ్జ్ వద్ద ఇరు దేశాల అధ్యక్షులు గురువారం సమావేశమయ్యారు. వాణిజ్య ఒప్పందంపై వెనిజులా, కొలంబియా అధ్యక్షులు నికోలస్ మదురో, గుత్సావో పెట్రో సంతకం చేశారు. ఈ ఒప్పందంతో వాణిజ్య కార్యాచరణకు ఇప్పటి వరకూ ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య పునరేకీకరణకు ఈ ఒప్పందం సహకరిస్తుందని వెనిజులా అధ్యక్షులు మదురో చెప్పారు. ఈ నెల 3న రెండు దేశాల మధ్య పెట్టుబడులను ప్రోత్సహించడానికి, రక్షించడానికి ఒక ఒప్పందంపై కొలంబియా వాణిజ్య, పరిశ్రమ, టూరిజం శాఖల మంత్రి ఉమానా మెండోజా, వెనిజులా అధ్యక్షులు మదురో సంతకాలు చేశారు.

500 విమానాలకు ఇండిగో ఆర్డర్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒక్కటైన ఇండిగో ఏకంగా 500 విమానాలకు ఆర్డర్ ఇచ్చినట్టు తెలిపింది. తమ సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ విమానాల కోసం ఎయిర్‌బస్‌కు ఇప్పటికే ఆర్డర్ ఇచ్చామని ఇండిగో ఇంటర్నేషనల్ సేల్స్ హెడ్ వినయ్ మల్హోత్రా తెలిపారు. ఇండియా, ఇస్తాంబుల్, యూరప్ ప్రాంతాల మధ్య ప్యాసింజర్ సర్వీసులను పెంచనున్నామన్నారు. ప్రస్తుతం తమ సంస్థ రోజుకు 1,800 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఇందులో 10 శాతం విదేశీ రూట్లలో తిరుగుతున్నాయన్నారు. ఈ సంస్థకు ప్రస్తుతం 300 విమానాలు ఉన్నాయి. దేశీయంగా 76, అంతర్జాతీయంగా 26 గమ్యస్థానాలకు సేవలను అందిస్తుంది.

బీబీసీ కార్యాలయాల్లో ముగిసిన ఐటీ సోదాలు

న్యూఢిల్లీ : బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపన్ను (ఐటీ) శాఖ సోదాలు గురువారంతో ముగిసాయి. న్యూఢిల్లీ, ముంబయిలోని బీబీసీ కార్యాలయాల్లో మంగళ, బుధ, గురువారాల్లో మూడు రోజుల పాటు ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రధానంగా సంస్థ ఆర్థిక కార్యక్రమాలపై ఐటీ అధికారులు ఆరా తీశారు. బీబీసీ కార్యాలయాల్లో ఐటీ శాఖ సోదాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీబీసీపై ఐటీ చర్య ద్వారా భారతదేశ ప్రతిష్ఠను మోడీ ప్రభుత్వం నాశనం చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. ఐటి సోదాలపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) ఇప్పటికే ఒక ప్రకటన విడుదల చేసింది. 'ప్రభుత్వ విధానాలను లేదా పాలక వ్యవస్థను విమర్శించే పత్రికా సంస్థలను భయపెట్టడానికి, వేధించడానికి ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగించే ధోరణికి కొనసాగింపుగానే ఈ సోదాలు ఉన్నాయి' అని ప్రకటనలో తెలిపింది.

రెండు ఓలా కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు

హైదరాబాద్ : ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీ అయిన ఓలా ఎలక్ట్రిక్ కొత్తగా రాష్ట్రంలో రెండు కొత్త ఓలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించినట్టు ప్రకటించింది. తెలంగాణలో విస్తరణలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో వీటిని ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఇప్పటికే ఇటువంటి 200 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు కలిగి ఉన్నట్టు తెలిపింది. కంపెనీ తన నెట్‌వర్క్‌ను మార్చి 2023 నాటికి 500 అవుట్‌లెట్‌లను చేర్చాలని ఓలా పేర్కొంది.

జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుపై ఏకాభిప్రాయం

- ఫైనాన్స్ బిల్లులో చేర్చే అవకాశం
- దిగువ కోర్టులు, ట్రిబ్యునల్‌లు అందించే సేవలపై పన్ను
- రాష్ట్రాలకు జీఎస్టీ పెండింగ్ బకాయిలు రూ.16,982 కోట్లు విడుదల : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- 2021-22 జీఎస్టీ పరిహారాన్ని తప్పుగా లెక్కించిన అంశాన్ని లేవనెత్తిన రాష్ట్రాలు
- పెట్రోల్, డిజిల్‌పై సెస్సును నిలిపివేయాలి: కెఎన్ బాలగోపాల్, కేరళ ఆర్థిక మంత్రి



న్యూఢిల్లీ : అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుపై జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం వచ్చినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. విజ్ఞాన భవన్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 49వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ల ఏర్పాటు, పాన్ మసాలా, గుట్కా వ్యాపారంలో పన్ను ఎగవేతలను అరికట్టడానికి యంత్రాంగం, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసీ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి, కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా, సీబీఐసీ చైర్మెన్ వివేక్ జోహ్రీ తదితరులతో కలిసి నిర్మలా సీతారామన్ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ "మేము చాలా వివరంగా రోజంతా సమావేశమయ్యాము. వాతావరణం పూర్తిగా స్నేహపూర్వకంగా ఉంది. కలిసి పని చేయాలనే భావన ఉంది. ఫలితంగా, రెండు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్(జీఓఎం) నివేదికలు ఆమోదించాం. వాటిలో ఒక చిన్న సవరణ, భాషలో కొన్ని మార్పులు ఉన్నాయి" అని అన్నారు.

జీఎస్టీ ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఆర్థిక బిల్లు

జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు సంబంధించిన జీఓఎం నివేదికను భాషలో స్వల్ప మార్పులతో ఆమోదించామని, దానిని రాష్ట్రాలతో పంచుకుంటామని, ఆ తరువాత ట్రిబ్యునల్ ఏర్పాటుకు సంబంధించిన తుది ముసాయిదా రూపొందించనున్నట్టు నిర్మలా సీతారామన్ తెలిపారు. అప్పిలేట్ ట్రిబ్యునల్‌పై జీఓఎం తుది ముసాయిదా కొన్ని రోజుల్లో సభ్యులకు పంపుతాం. కౌన్సిల్ మళ్లీ సమావేశానికి ఎక్కువ సమయం లేనందున, తుది అభిప్రాయాన్ని స్వీకరించడానికి, ఆర్థిక బిల్లులో చేర్చడానికి జీఎస్టీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌కు అధికారం ఇచ్చిందని అన్నారు. "ట్రిబ్యునల్‌పై జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించింది. మార్చి 3 నాటికి అవసరమైన మార్పులు ఖరారు చేస్తాం. తద్వారా ఈ ఏడాది ఫైనాన్స్ బిల్లు కూడా ట్రిబ్యునల్ ఏర్పాటుకు సహాయపడుతుంది" అని అన్నారు. పాన్ మసాలాపై పన్ను విధింపుపై జీఓఎం నివేదికను జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించిందని వెల్లడించారు.

రూ.16,982 కోట్ల జీఎస్టీ పెండింగ్ బకాయిలు విడుదల

"రాష్ట్రాలకు పెండింగ్‌లో ఉన్న జీఎస్టీ పరిహారానికి సంబంధించిన మొత్తం బకాయిలు విడుదల చేశాం. జూన్ 2022కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.16,982 కోట్ల జీఎస్టీ పరిహారం మొత్తం క్లియర్ చేస్తున్నాం. అయితే ఇది ప్రస్తుతానికి జీఎస్టీ పరిహార నిధిలో అందుబాటులో లేదు. కేంద్రం ఖజానా నుంచి చెల్లించిన తరువాత భవిష్యత్తులో సెస్ సేకరణల నుంచి తిరిగి దానికి తీసుకుంటాం" అని అన్నారు. "దీనికి అదనంగా, అకౌంటెంట్ జనరల్ ధ్రువీకరించిన రాష్ట్రాలు చేసిన అదనపు పరిహారం క్లెయిమ్‌లను కూడా కేంద్రం క్లియర్ చేస్తుంది. ఈ మొత్తం రూ. 16,524 కోట్లు" అని తెలిపారు.

దిగువ కోర్టులు, ట్రిబ్యునల్‌లు అందించే సేవలపై పన్ను

"రివర్స్ ఛార్జ్ మెకానిజం దిగువ కోర్టులు, ట్రిబ్యునల్‌లు అందించే సేవలపై పన్ను విధించాలని నిర్ణయం తీసుకున్నాం. చట్టం, ప్రక్రియ సంబంధిత విషయాలపై మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. కంటైనర్‌ల కోసం ఉపయోగించే డేటా లాగర్లు, ట్రాకింగ్ పరికరాలు కొన్ని షరతులకు లోబడి 18 శాతం నుంచి సున్నాకి తగ్గిస్తున్నాం" అని నిర్మలా సీతారామన్ తెలిపారు. "రాబ్‌పై జీఎస్టీ రేట్లకు సంబంధించిన (యూపీ, ఇతర రాష్ట్రాలకు విలక్షణమైన ఒక రకమైన ద్రవ బెల్లం) నిర్ణయం తీసుకున్నాం. మేము రాబ్‌పై జీఎస్టీ రేటును 18 శాతం నుంచి సున్నాకి తగ్గిస్తున్నాము. అది వదులుగా విక్రయించబడితే, ముందుగా ప్యాక్ చేయబడి లేబుల్ చేయబడితే 5 శాతం జీఎస్టీ విధిస్తాం. పెన్సిల్, షార్పనర్‌లపై జీఎస్టీకి సంబంధించి చాలా చర్చలు జరిగాయి. ఇది 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గిస్తున్నాం" అని వివరించారు.

"రూ.20 కోట్ల మొత్తం టర్నోవర్ కలిగిన చిన్న పన్ను చెల్లింపుదారులు, రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్ల టర్నోవర్ ఉన్న రిజిస్టర్డ్ సంస్థల కోసం వార్షిక రిటర్న్‌లను ఆలస్యంగా దాఖలు చేయడం కోసం ఆలస్య రుసుము హేతుబద్ధీకరణపై నిర్ణయం తీసుకోబడింది. కొన్ని రిటర్న్‌ల కోసం క్షమాభిక్ష పథకం కూడా ప్రవేశపెడతాం" అని అన్నారు. కౌన్సిల్ ఆమోదించిన వాషరీస్ ద్వారా సరఫరా చేయబడిన బొగ్గు తిరస్కరణలపై మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు.

2021-22 జీఎస్టీ పరిహారాన్ని తప్పుగా లెక్కించిన విషయాన్ని రాష్ట్రాలు లేవనెత్తాయని తమిళనాడు ఆర్థిక మంత్రి పి తైగ రాజన్ అన్నారు. సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య ఆధారిత మిల్లెట్ ఉత్పత్తులపై రేటు తగ్గింపు ప్రతిపాదన ఫిట్‌మెంట్ కమిటీకి తిరిగి పంపబడిందని అన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ నివేదికపై జీఓఎం అజెండాలో లేదని అన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుపై కౌన్సిల్ దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చిందన్నారు. అయితే అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుపై రాతపూర్వక పత్రాన్ని తరువాత ఆశిస్తున్నామని అన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్, రాష్ట్ర ట్రిబ్యునల్, నిర్మాణాత్మక సమస్యల కోసం ఎంపిక కమిటీపై స్పష్టతపై మండలి చర్చించిందన్నారు. తమిళనాడుతో సహా కొన్ని రాష్ట్రాలు జాతీయ ట్రిబ్యునల్‌లోని రాష్ట్ర అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్‌ల ఏర్పాటుపై సమస్యలను లేవనెత్తాయని తెలిపారు.

పెట్రోల్, డీజిల్‌పై సెస్సును నిలిపివేయాలి

పెట్రోల్, డీజిల్‌పై సెస్సును నిలిపివేయాలి కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చర్చించడానికి తమకు ఎజెండాలు ఉన్నాయని, దాదాపు అన్ని రాష్ట్రాలు జీఎస్టీ కామన్ సెషన్ వ్యవధిని పొడిగించాలని కోరాయన్నారు. జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను, కేంద్ర పన్నుల్లో ఎక్కువ వాటాను డిమాండ్ చేశామని అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై సెస్సును నిలిపివేయాలని అడుగుతున్నామని అన్నారు.

అమెరికాలో ఆరుగురి కాల్చివేత

అనుమానితుడి అరెస్టు

మిస్సిస్సిపి : అమెరికా మిస్సిస్సిప్పీ టేట్ కౌంటీలో ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టేట్ కౌంటీ షెరీఫ్ బ్రాడ్ లాన్స్ తెలిపిన వివరాల ప్రకారం ఆగంతకుడు అర్కబుట్ల రోడ్డులోని ఓ దుకాణంలో ఒకరిని కాల్చివేశాడు. అర్కబుట్ల డ్యామ్ రోడ్డులోని ఓ ఇంట్లో మహిళను కూడా తుపాకితో కాల్చివేశాడు. ఈ ఘటనలో ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఆ రోడ్డులో అనుమానితుడిని గుర్తించిన టేట్ కౌంటీ సహాయకులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో నలుగురు హత్యకు గురైనట్టు అధికారులు గుర్తించారు. అర్కబుట్ల ఆనకట్ట రోడ్డులో ఇంటి లోపల ఇద్దరు, బయట మరో ఇద్దరు మరణించి కనిపించారు. 'బాధ్యుడైన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

అతను ఒంటరిగానే హత్యలకు పాల్పడ్డాడని భావిస్తున్నాం. ఎందుకు ఈ హత్యలకు పాల్పడ్డాడో తెలియలేదు. మిస్సిస్సిప్పి బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎంబిఐ) దర్యాప్తులో సహాయం కోరింది. అన్ని విధాలా సహకరిస్తాం.' అని మిస్సిస్సిప్పి గవర్నర్ టేట్ రీవ్స్ ట్వీట్ చేశారు.

అమ్మమ్మను తుపాకితో కాల్చిన ఆరేళ్ల బాలిక

ఆరేళ్ల బాలిక కారు నడుపుతున్న అమ్మమ్మను వెనుకసీటులో ఉన్న తుపాకితో కాల్చివేసింది. ఈ ఘటనలో ఆమె ప్రాణాలతో బయటపడింది. నార్త్ పోర్ట్ పోలీసు శాఖ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'ఈ నెల 16న 57 ఏళ్ల మహిళ తన మహిళ తన ఆరేళ్ల మనవరాలిని వెనుక సీటులో కూర్చోబెట్టుకుని కారు నడుపుతోంది. డ్రైవర్ సీటు వెనుక జేబులో ఉన్న తుపాకి తీసి ఆ బాలిక కాల్చింది. ఆ మహిళ కారును ఇంటి వరకూ నడుపుకుని వెళ్లింది. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసింది. దీంతో, ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రాణానికి ప్రమాదం లేదు' అని పేర్కొంది. 'యాక్సిడెంటల్‌గా కాల్పులు జరిగినట్టు నార్త్ పోర్ట్‌లోని చైల్డ్ ప్రొటెక్షన్ సెంటర్ తెలిపింది. పిల్లలు తుపాకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబాలకు పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

ఆదుకున్న అక్షర్, అశ్విన్

8వ వికెట్‌కు 114పరుగుల భాగస్వామ్యం ● భారత్ 262ఆలౌట్ ● లియాన్‌కు ఐదు వికెట్లు



న్యూఢిల్లీ: రెండోటెస్ట్‌లో ఆస్ట్రేలియాకు భారీ ఆధిక్యత లభిస్తుందనుకున్న దశలో టీమిండియా ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, రవిచంద్రన్ అశ్విన్ స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ కలిసి 8వ వికెట్‌కు 114పరుగులు జతచేయడంతో భారతజట్టు తొలి ఇన్నింగ్స్‌లో 262పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆస్ట్రేలియా జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం ఒక్క పరుగు ఆధిక్యత మాత్రమే లభించింది. ఓవర్ నైట్ స్కోర్ 21 పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన భారత్‌ను ఆస్ట్రేలియా సీనియర్ స్పిన్నర్ లియాన్ టాప్‌ఆర్డర్‌ను కూల్చాడు.

17వ ఓవర్‌లో కేఎల్ రాహుల్ (17)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న లియాన్.. తన తర్వాతి ఓవర్‌లో రోహిత్ శర్మ (32), పుజారా(0)లను ఔట్ చేసి భారత్‌ను దెబ్బ తీశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్(4) కూడా నాథన్ బౌలింగ్‌లో హ్యాండ్స్‌కాంబ్‌కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఓ దశలో ఔటైన తర్వాత క్రీజులోకి అక్షర్ పటేల్ ఆది నుంచి దూకుడుగా ఆడాడు. టీ బ్రేక్‌కు ముందు కుహ్నేమాన్ వేసిన ఓవర్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. తర్వాత కూడా వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు కొట్టాడు. కుహ్నేమాన్ వేసిన 75వ ఓవర్‌లో సిక్సర్ బాది అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కమిన్స్ వేసిన 79వ ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదాడు. మరో ఎండ్‌లో ఉన్న అశ్విన్(37) అతడికి సహకారం అందించాడు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం నెలకొల్పారు. అశ్విన్‌ను కమిన్స్ ఔట్ చేయగా.. మార్ఫీ వేసిన తర్వాతి ఓవర్‌లో సిక్సర్ బాది జోరు మీద ఉన్న అక్షర్.. కమిన్స్ పట్టిన ఓ అద్భుత క్యాచ్‌కు ఔటయ్యాడు. షమి (2)ని కుహ్నేమాన్ పెవిలియన్‌కు పంపడంతో భారత్ ఆలౌటైంది. లియాన్‌కు ఐదు, కుహ్నేమన్, మర్ఫీకి రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా జట్టు శుక్రవారం ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోయి 61పరుగులు చేసింది. ఖవాజా(6) అశ్విన్ బౌలింగ్‌లో శ్రేయస్ పట్టిన ఓ అద్భుత క్యాచ్‌కు ఔటయ్యాడు.


స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 263, రెండో ఇన్నింగ్స్ 61/1

ఇండియా తొలి ఇన్నింగ్స్: రోహిత్ (బి)లియాన్ 32, కేఎల్ రాహుల్ (ఎల్‌బి) లియాన్ 17, పుజారా (ఎల్‌బి)లియాన్ 0, కోహ్లి (ఎల్‌బి)కుహ్నేమన్ 44, శ్రేయస్ (సి)హ్యాండ్ కోంబ్ (బి)లియాన్ 4, జడేజా (ఎల్‌బి)మర్ఫీ 26, శ్రీకర్ భరత్ (సి)స్మిత్ (బి)లియాన్ 6, అక్షర్ (సి)కమిన్స్ (బి)మర్ఫీ 74, అశ్విన్ (సి)రెన్‌షా (బి)కమిన్స్ 37, షమీ (బి)కుహ్నేమన్ 2, సిరాజ్ (నాటౌట్) 1, అదనం 19. (83.3 ఓవర్లలో ఆలౌట్) 262పరుగులు. వికెట్ల పతనం: 1/46, 2/53, 3/54, 4/66, 5/125, 6/135, 7/139, 8/253, 9/259, 10/262 బౌలింగ్: కమిన్స్ 13-2-41-1, కుహ్నేమన్ 21.3-4-72-2, లియాన్ 29-5-7-5, మర్ఫీ 18-2-53-2, హెడ్ 2-0-10-0

మంధాన మెరిసినా.. ఇంగ్లండ్ చేతిలో ఓటమే..!

- 20న ఐర్లాండ్‌పై గెలిస్తేనే సెమీస్ బెర్త్..



కేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఇంగ్లండ్ చేతిలో 11 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 151పరుగులు చేసింది. ఛేదనలో భారతజట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5 వికెట్లు కోల్పోయి 140పరుగులే చేయగల్గింది. టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ తొలిగా బౌలింగ్‌ను ఎంచుకుంది. ఇంగ్లండ్ టాపార్డర్‌ను రేణుక కట్టడి చేయడంతో ఇంగ్లండ్ జట్టు 29పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో స్కీవర్(50), జోన్స్(40), కెప్టెన్ నైట్(28) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఇంగ్లండ్ జట్టు 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 151పరుగులు చేసింది. రేణుకకు ఐదు, శిఖాపాండే, దీప్తి శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన (52) రాణించినా.. షెఫాలీ(8), రోడ్రిగ్స్(13), హర్మన్ ప్రీత్(4) నిరాశపరిచారు. ఆ తర్వాత రీచా ఘోష్(47) మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ప్రయోజనం లేకపోయింది. చివరి ఓవర్లు 30పరుగులు చేయాల్సి దశలో రీచా 18పరుగులు రాబట్టింది. దీంతో టీమిండియా నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 140పరుగులే చేయగల్గింది. గ్లెన్‌కు రెండు, ఎక్లెస్టోన్, బెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్కీవన్‌కు లభించింది. ఇక గ్రూప్-బిలో శుక్రవారం అర్ధరాత్రి మరో మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 6వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. ఐర్లాండ్ జట్టు 20 ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 139పరుగులు చేస్తే.. విండీస్ జట్టు 19.5ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 140పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మాథ్యూస్‌కు లభించింది.

మహిళల టి20 ప్రపంచకప్‌లో నేడు..
పాకిస్తాన్ × వెస్టిండీస్(సా. 6.30గంIIలకు)
న్యూజిలాండ్ × శ్రీలంక(రా. 10.30గంIIలకు)



ఎదురీదుతున్న బెంగాల్

- రంజీట్రోఫీ ఫైనల్

కోల్‌కతా: రంజీట్రోఫీ ఫైనల్లో బెంగాల్ జట్టు ఎదురీదుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 230పరుగులు వెనుకబడ్డ బెంగాల్ జట్టు శనివారం రెండో ఇన్నింగ్స్‌లో ఆట నిలిచే సమయానికి 4 వికెట్లు నష్టపోయి 169పరుగులు చేసి ఇంకా 61పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 404 పరుగులకు ఆలౌటైంది. మిడిలార్డర్ బ్యాటర్స్ జాక్సన్(59), వసవాడ(81), చిరాగ్ జానీ(60) అర్ధసెంచరీలతో మెరిసారు. బెంగాల్ బౌలర్లు ముఖేశ్ కుమార్‌కు నాలుగు, ఆకాశ్ దీప్, ఇషాన్ పోరెల్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్‌ను కెప్టెన్ మనోజ్ తివారీ(57నాటౌట్), మజుందార్(61) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు.

ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించండి

- రైతులకు టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైతులు వ్యవసాయ పంపుసెట్ల వద్ద ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎమ్‌డీ అన్నమనేని గోపాలరావు విజ్ఞప్తి చేశారు. దీనిపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఈఆర్సీ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. 24 గంటలు విద్యుత్ సరఫరా ఉన్నందున రైతులకు ఆటోమేటిక్ స్టార్టర్లతో పనిలేదనీ, అవి ఉండటం వల్ల కరెంటుతో పాటు భూగర్భజలాలు కూడా నష్టపోవలసి వస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నదనీ, విద్యుత్ వృథా అయితే అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందనీ చెప్పారు. తిరిగి ఈ భారం ప్రజలపైనే పడుతుందని హెచ్చరించారు. విద్యుత్‌పు పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. అలాగే రైతులు తప్పనిసరిగా రేటింగ్ ఉన్న కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. దీనివల్ల ఓల్టేజీ హెచ్చుతగ్గులు నియంత్రించబడి, మోటర్లపై భారం తగ్గుతుందన్నారు. ఈ విషయంలో రైతులు తమ సంస్థకు సహకరించాలని కోరారు.

21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

- పాఠశాలల్లో ఘనంగా నిర్వహించండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అంతర్జాతీయ మాతభాషా దినోత్సవాన్ని ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని అధికార భాషా సంఘం ఆదేశించింది. ఆ మేరకు విద్యాశాఖాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వం, పద్య పఠనం, పరాయి మాట రాకుండా రెండు నిముషాలు మాట్లాడటం వంటి పోటీలు-భాషా సంస్కృతులను ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఉదయం ప్రార్థన మాతభాషలోనే జరపుతూ, భాషా విశిష్టతను తెలపాలని చెప్పారు. ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల వివరాలను సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి నివేదికను తెప్పించుకోవాలని తెలిపారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ఇవ్వాలని చెప్పారు.

తెలంగాణ తేజోమూర్తి భాగ్యరెడ్డి వర్మ

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

దళిత బహుజన చైతన్యానికి ఆద్యుడు, తెలంగాణ తేజోమూర్తి మాదరి భాగ్యరెడ్డి వర్మ అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. దళితుల్లో చైతన్యానికి చదువును ఆయుధంగా మలిచారని చెప్పారు. శనివారం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ, పూలే, అంబేద్కర్‌ల స్ఫూర్తితో రాష్ట్రంలో పరిపాలన సాగుతున్నదని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పిల్లల కోసం వెయ్యికి పైగా గురుకులాలను నెలకొల్పారన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఉపేంద్ర మాట్లాడుతూ విద్య ద్వారా దళిత బహుజన వర్గాల్లో చైతన్యం తెచ్చేందుకు గురుకులాలు సామాజిక మార్పుకు నమూనాగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం దళిత స్టడీ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాల్లో పొదుపు చేయండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజలు పోస్టాఫీసుల్లో సేవింగ్స్ ఖాతాలు ఓపెన్ చేయాలని ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. బ్యాంకులకంటే పోస్టల్ ఖాతాల్లో వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుందనీ, దీనివల్ల ప్రజలకు అధిక ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయని శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. పోస్ట్‌మ్యాన్ ప్రజల ఇంటి వద్దకే వచ్చి సేవింగ్స్ ఖాతాలు ఓపెన్ చేస్తారనీ, దరఖాస్తులతో పాటు డబ్బులు కూడా అక్కడే సేకరిస్తారని చెప్పారు. ఇండ్ల వద్దే పాస్‌బుక్‌లు ఇస్తారనీ, ఈ సేవలకు ఎలాంటి అదనపు చార్జీలు ఉండబోవన్నారు. పోస్టాఫీసుల్లో వివిధ రకాల పొదుపు ఖాతాలు, స్కీంలు ఉన్నాయనీ వాటిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ ఖాతాకు 8 శాతం, సుకన్య సమృద్ధి యోజన ఖాతాకు 7.6 శాతం, కిసాన్ వికాస్ పత్రకు 7.2 శాతం వడ్డీ లభిస్తుందని వివరించారు. అలాగే నెలవారీ ఆదాయ పథకానికి 7.1 శాతం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు 7.1 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లకు 7 శాతం వడ్డీ ఇస్తారని తెలిపారు. టైం డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు పోస్టాఫీసుల్లో ఓపెన్ చేయొచ్చు.

45 వేలు దాటిన భూకంప మృతుల సంఖ్య

అంటక్యా : టర్కీ, సిరియాలో సంభవించిన భూకంప ప్రమాదంలో మృతుల సంఖ్య 45 వేలు దాటింది. మృతుల సంఖ్య టర్కీలోనే అధికంగా ఉంది. టర్కీలో 39 వేలకు మందికి పైగా మరణించగా, సిరియాలో సుమారు 5,800 మంది మృతి చెందారు. అలాగే భూకంప ధాటికి టర్కీలో సుమారు 2,64,000 అపార్ట్‌మెంట్లు ధ్వంసమయ్యాయి.

ఢిల్లీ మేయర్ ఎన్నిక తేదీ ఖరారు

ఢిల్లీ : ఢిల్లీ మేయర్ ఎన్నిక ఈ నెల 22న జరగనుంది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన మేయర్ ఎన్నిక సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఖరారైంది. ఎంసిడి కార్యనిర్వాహక విభాగం శనివారం మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ రిలీజ్ చేసింది బుధవారం ఉదయం 11 గంటలకు ఎంసిడి సదన్‌లో ఈ ఎన్నిక జరగనుంది. అదే రోజున మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక తర్వాత.. ఆరుగురు సభ్యులుండే స్టాండింగ్ కమిటీని అదేరోజు ఎన్నుకుంటారు.